www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 14-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 300 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి మ. 12.11 తదుపరి షష్టి; నక్షత్రం: రేవతి ఉ 10.44 తదుపరి అశ్విని వర్జ్యం: తె. 5.39 మొదలు; దుర్ముహూర్తం: మ. 12.07-12.53; అమృతఘడియలు: ఉ. 8.31-9.59; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 6.13 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

SR Educational Academy
TELANGANA • ANDHRA PRADESH • KARNATAKA

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

హైదరాబాద్ ● బుధవారం 14 ఫిబ్రవరి 2024

భారత హ్యామర్ త్రోయర్
రచనపై 12 ఏళ్ల నిషేధం



న్యూఢిల్లీ: భారత హ్యామర్ త్రో అథ్లెట్ రచనా కుమారిపై వేటు పడింది. పలుమార్లు డోప్ పరీక్షల్లో విఫల మవడంతో 30 ఏళ్ల రచనపై 12 ఏళ్ల నిషేధాన్ని విధిస్తూ అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య సమగ్రత విభాగం (ఏఐయూ) మంగళ వారం నిర్ణయం తీసుకుంది. ఈ నిషేధం గతేడాది నవంబ రు 24వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించింది. గతంలోనూ డోపీగా పట్టుబడ్డ రచన.. 2015 మార్చి నుంచి నాలుగేళ్ల పాటు నిషేధానికి గురవడం గమ నార్హం. నిరుడు ఆసియా క్రీడల్లో పోటీపడ్డ రచన.. ఇప్పటి దాకా ఒక్క అంతర్జాతీయ పతకం కూడా నెగ్గలేదు.

దక్షిణాఫ్రికా తడ‘బ్యాటు’

హమిల్టన్: న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో ఘోర పరాజయం చవిచూసిన దక్షిణాఫ్రికా..రెండో టెస్టులోనూ తడ'బ్యాటు'కు లోనైంది. మంగళ వారం ప్రారంభమైన మ్యాచ్‌లో తొలి రోజు ఆఖరికి మొదటి ఇన్నింగ్స్‌లో 220 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. స్పిన్నర్ రచిన్ రవీంద్ర (3/33) తిప్పేయడంతో ఓ దశలో దక్షిణాఫ్రికా 150/6తో నిలిచింది. అయితే రువాన్ డిస్వార్డ్ (55 బ్యాటింగ్), 37 ఏళ్ల వయస్సులో అరంగేట్రం చేసిన షాన్ వాన్ బెర్గ్ (34 బ్యాటింగ్) ఏడో వికెట్‌కు అభేద్యంగా 70 పరుగులు జోడించడంతో కోలుకుంది.

29 బంతుల్లో 71

రస్సెల్ విధ్వంసం ● ఆఖరి టీ20లో విండీస్ విజయం



పెర్త్: ఆండ్రీ రస్సెల్ (29 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్సర్లతో 71), రూథర్‌ఫోర్డ్ (40 బంతుల్లో 67 నాటౌట్) చెలరేగడంతో ఆస్ట్రేలియాతో మూడో టీ20లో వెస్టిండీస్ నెగ్గింది. తొలుత వెస్టిండీస్ 20 ఓవర్లలో 220/6 రన్స్ చేసింది. 79 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన దశలో..ర స్సెల్, రూథర్‌ఫోర్డ్ ఆరో వికెట్‌కు 139 పరుగులు జోడించారు. టీ20లలో ఆరో వికెట్‌కిదే అత్యుత్తమ భాగస్వామ్యం. ఛేదనలో వార్నర్ (49 బంతుల్లో 81) కదం తొక్కినా..20 ఓవర్లలో ఆస్ట్రేలియా 183/5 స్కోరుకే పరిమితమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే ఆతిథ్య జట్టు కైవసం చేసుకుంది.

వార్నర్ చివరి మ్యాచ్: వన్డే వరల్డ్ కప్‌తో 50 ఓవర్ల ఫార్మాట్‌కు, జనవరిలో పాకిస్థాన్‌తో జరిగిన సిడ్నీ మ్యాచ్‌తో టెస్టులకు వీడ్కోలు పలికిన డేవిడ్ వార్నర్..విండీస్‌తో మూడో టీ20తో స్వదేశంలో ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడేశాడు. ఈ మ్యాచ్‌లోనూ అతడు హాఫ్ సెంచరీతో సత్తా చాటడం విశేషం. 37ఏళ్ల వార్నర్ ఇకపై ప్రపంచవ్యాప్తంగా జరిగే టీ20 లీగ్‌ల్లో మాత్రమే కనిపిస్తాడు.

మంధాన.. రెండు ర్యాంక్‌లు పైకి



దుబాయ్: ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన రెండు స్థానాలు ఎగబాకి, నాలుగోర్యాంక్‌కు చేరుకుంది. ఈ క్రమంలో మంధాన 696 పాయింట్లతో సౌతాఫ్రికా బ్యాటర్ లారా వోల్వార్ట్‌ను వెనక్కి నెట్టింది. బంట్ (ఇంగ్లండ్), చామరి ఆటపట్టు (శ్రీలంక), బెత్ మూనీ (ఆస్ట్రేలియా) టాప్-3లో కొనసాగుతున్నారు. హర్మన్‌ప్రీత్ కౌర్ 10వ స్థానంలో నిలిచింది. బౌలర్లలో దీప్తి శర్మ మూడు నుంచి 4వ ర్యాంక్‌కు పడిపోగా, ఆల్‌రౌండర్లలో ఒక స్థానం మెరుగుపర్చుకొని ఐదో స్థానానికి చేరుకుంది. బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ (ఇంగ్లండ్), ఆల్‌రౌండర్ల జాబితాలో కాప్ మారిజానె (సౌతాఫ్రికా) అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు.

‘భారత రెజ్లింగ్’పై సస్పెన్షన్ ఎత్తివేత

- ప్రపంచ సమాఖ్య నిర్ణయం
- ఆ ముగ్గురు రెజ్లర్లపై చర్యలు తీసుకోబోమని హామీ ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై విధించిన సస్పెన్షన్‌ను యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) ఎత్తివేసింది. అయితే, లైంగిక వేధింపులు ఎదుర్కొన్న డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా గతంలో ఆందోళన చేపట్టిన స్టార్ రెజ్లర్లు బజ్‌రంగ్ పూనియా, వినేశ్ ఫొగట్, సాక్షీ మాలిక్‌పై ఎలాంటి వివక్షాపూరిత చర్యలు తీసుకోబోమని లిఖితపూర్వక హామీ ఇవ్వాలని జాతీయ సమాఖ్యను యూడబ్ల్యూడబ్ల్యూ ఆదేశించింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించడంలో విఫలమైనందున డబ్ల్యూఎఫ్ఐపై సస్పెన్షన్ విధిస్తూ గతేడాది ఆగస్టు 23న ప్రపంచ సమాఖ్య నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇక.. డబ్ల్యూఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే, ప్రధానంగా ఒలింపిక్ ట్రయల్స్‌లాంటి జాతీయ, అంతర్జాతీయ ఈవెంట్లలో పూనియా, వినేశ్, మాలిక్‌తో పాటు ఇతర రెజ్లర్ల ప్రాతినిధ్యం విషయంలో వివక్ష ప్రదర్శించబోమని కచ్చితమైన హామీ ఇవ్వాలని ప్రపంచ సమాఖ్య కోరింది.



ఉమా మహేష్‌కు రెండో స్వర్ణం

గ్రెనడా (స్పెయిన్): ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ వరల్డ్‌కప్‌లో విజయవాడ షూటర్ మద్దినేని ఉమా మహేష్ రెండో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మంగళవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ విభాగం ఫైనల్లో ఉమా-ఇషా అనిల్ జోడీ 16-8తో భారత్‌కే చెందిన అన్వీ రాథోడ్-అభినవ్ షా ద్వయంపై నెగ్గింది. అంతకుముందు జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్ వ్యక్తిగత విభాగంలో ఉమా 252.1 స్కోరు చేసి ఈ వరల్డ్‌కప్‌లో తొలి పసిడి పతకం సాధించాడు.



ఫ్లాటా.. స్పిన్నా?

మూడో టెస్ట్ పిచ్‌పై ఆసక్తి



రాజ్‌కోట్: భారత్‌లో టెస్ట్ మ్యాచ్‌లంటే.. టర్నింగ్ వికెట్ అని సహజంగా భావిస్తారు. అయితే, ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లు జరిగిన హైదరాబాద్, విశాఖ పిచ్‌లపై అంతగా టర్న్ లభించక పోవడంతో టీమిండియా స్పిన్నర్లు ఇబ్బందులుపడ్డారు. దీంతో ఇంగ్లండ్ బ్యాటర్లు ధాటిగా ఆడుతూ ఆతిథ్య భారత్‌కు గట్టిసవాల్ విసిరారు. అయితే, రెండో టెస్ట్‌లో పేసర్ బుమ్రా చెలరేగడంతో టీమిండియా నెగ్గి సిరీస్‌ను సమం చేసింది.

ఈ నేపథ్యంలో రాజ్‌కోట్‌లో గురువారం నుంచి జరిగే మూడో టెస్ట్ పిచ్ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. కోహ్లీ, రాహుల్, అయ్యర్ లాంటి సీనియర్లు లేకపోవడంతో టీమిండియా బ్యాటింగ్‌లో అనుభవలేమి కనిపిస్తోంది. మరి బ్యాటర్ ఫ్రెండ్లీ వికెట్ అయితే ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌ను తట్టుకోవడం కష్టమేనని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఈ క్రమంలో మూడో టెస్ట్ కోసం టర్నింగ్ వికెట్ అందుబాటులో ఉంటుందని లెగ్గీ కుల్దీప్ యాదవ్ చూచాయగా చెప్పడం కొంత ఊరటనిచ్చే విషయం. 'స్పోర్టింగ్ వికెట్ అయితే మ్యాచ్ మజాగా సాగుతుంది. దీనర్థం రాబోయే మ్యాచ్‌ల్లో స్పిన్ వికెట్లు ఉండవని కాదు. భవిష్యత్ మ్యాచ్‌ల్లో టర్నింగ్ వికెట్లను ఆశిస్తున్నాన'ని మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో కుల్దీప్ చెప్పాడు. కానీ, రాజ్‌కోట్ పిచ్ స్వభావాన్ని కచ్చితంగా చెప్పకుండా దాటవేశాడు. టెస్ట్ క్రికెట్ సంప్రదాయ బ్యాటింగ్ తీరును మార్చేస్తూ ఇంగ్లండ్ దూకుడైన ఆట తనను ఎంతో ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నాడు.

జడేజాకు చోటు..!

సీనియర్ల గైర్హాజరీలో యువ క్రికెటర్లు సత్తాచాటేందుకు ఇదో సువర్ణావకాశమని యాదవ్ చెప్పాడు. తొడ కండర గాయంతో రెండో టెస్ట్‌కు దూరమైన ఆల్‌రౌండర్ జడేజాకు తుది జట్టులో చోటుదక్కే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని కుల్దీప్ మాటలనుబట్టి తెలుస్తోంది. 'జడ్డూ యథావిధిగా తన పనులు తాను చేసుకొంటున్నాడు. సోమవారం నెట్స్‌లో కూడా పాల్గొన్నాడు. మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉంటాడని భావిస్తున్నా' అని చెప్పాడు.

సర్ఫరాజ్ అరంగేట్రం?

రాహుల్ దూరం కావడం.. యువ ఆటగాడు సర్ఫరాజ్‌కు కలసి రానుంది. మూడో టెస్ట్‌లో అతడు అరంగేట్రం చేసే అవకాశాలు బలంగా ఉన్నాయని బోర్డు వర్గాలు చెబుతున్నాయి. మిడిలార్డర్‌లో రాహుల్‌తోపాటు అయ్యర్ కూడా లేకపోవడంతో అతడి ఎదురుచూపులకు తెర పడుతుందని భావిస్తున్నారు.

బ్యాటింగ్‌కాదు.. కీపింగ్ చూడండి!



కీపర్‌గా కేఎస్ భరత్ రాణిస్తున్నా.. బ్యాటింగ్‌లో అంతగా ఆకట్టుకోలేక పోవడం మేనేజ్‌మెంట్‌ను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో కీపర్‌గా ధ్రువ్ జురెల్‌కు తుది జట్టులో చోటు ఖాయమని భావిస్తున్నారు. అయితే, ఈ సిరీస్‌లో భరత్‌ను కొనసాగించాలని భారత మాజీ ఆటగాడు ఆకాష్ చోప్రా కోరాడు. కీపింగ్ ప్రతిభ ఆధారంగానే అతడిపై నిర్ణయం తీసుకోవాలని సూచించాడు. గత రెండు మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లు చేయకపోయినా.. అతడి బ్యాటింగ్ ఫర్వాలేదనే విధంగా ఉందన్నాడు. టీమ్ ఇంత త్వరగా భరత్‌పై నమ్మకాన్ని కోల్పోవడం బాధాకరమని చోప్రా చెప్పాడు.

స్టోక్స్ @100

టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ అరుదైన మైలురాయిని అందుకోనున్నాడు. రాజ్‌కోట్‌లో జరగబోయే మూడో టెస్ట్.. స్టోక్స్ కెరీర్‌లో 100వ మ్యాచ్ కావడం విశేషం.

రెహాన్‌కు తాత్కాలిక వీసా..

ఇంగ్లిష్ స్పిన్నర్ రెహాన్ అహ్మద్‌కు తాత్కాలిక వీసాను మంజూరు చేశారు. మ్యాచ్‌కు ముందే అతడికి పూర్తిస్థాయి వీసా వస్తుందని ఇంగ్లండ్ జట్టు అధికారి ఒకరు విశ్వాసం వ్యక్తం చేశాడు. క్లరికల్ తప్పిదం కారణంగానే ఇది జరిగిందని తెలుస్తోంది. సోమవారం ఇంగ్లండ్ జట్టు అబుధాబి నుంచి వచ్చింది. అయితే, అతడికి సింగిల్ ఎంట్రీ వీసా ఉండడంతో ఎయిర్‌పోర్టులోనే అడ్డుకొన్నారు. ఆ తర్వాత తాత్కాలిక వీసాతో హోటల్‌కు వెళ్లాడు.

రంజీలు ఆడితేనే.. ఐపీఎల్‌కు?

- కిషన్‌పై బీసీసీఐ ఆగ్రహం
- నిబంధనలు కఠినతరం చేసే యోచన



ముంబై: ఇషాన్ కిషన్ ఎపిసోడ్ నేపథ్యంలో ఐపీఎల్‌కు ప్రాధాన్యమిస్తున్న ఆటగాళ్లకు బీసీసీఐ కఠిన హెచ్చరికలు చేయనుంది. రంజీలు ఆడేందుకు విముఖత ప్రదర్శిస్తున్న జార్ఖండ్ ఆటగాడు కిషన్.. బరోడాలో పాండ్యా బ్రదర్స్‌తో కలసి ఐపీఎల్ కోసం సన్నద్ధమవుతున్నాడు. ఈ సమాచారం బయటకు రావడంతో ఆగ్రహించిన బోర్డు పెద్దలు.. ఈనెల 16 నుంచి రాజస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడాల్సిందిగా ఇషాన్‌కు హుకుం జారీ చేశారు. తద్వారా రెడ్‌బాల్ క్రికెట్ ఆడకుండా తప్పించుకొంటున్న యువ ఆటగాళ్లకు చెక్ పెట్టాలని బోర్డు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇషాన్‌తోపాటు దీపక్ చాహర్, కృనాల్ పాండ్యా, శ్రేయాస్ అయ్యర్‌లకు కూడా ఇలాంటి ఆదేశాలే జారీ చేయనున్నారట. కనీసం 3-4 రంజీ మ్యాచ్‌లు ఆడితేనే.. ఐపీఎల్ బరిలో దిగేందుకు అనుమతించేలా సరికొత్త రూల్స్ తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నట్టు ఓ అధికారి తెలిపాడు. దక్షిణాఫ్రికా టూర్ మధ్యలో బ్రేక్ తీసుకొని భారత్ తిరిగి వచ్చిన కిషన్.. మళ్లీ సెలెక్టర్లకు అందుబాటులోకి రాలేదు. కాగా, సెంట్రల్ కాంట్రాక్ట్ 'సి'జాబితా నుంచి ఇషాన్‌ను తప్పించారనే వార్తలు వస్తున్నాయి.

భారత జట్టు మాజీ కెప్టెన్
దత్తాజీరావు గైక్వాడ్ మృతి



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ దత్తాజీ రావు గైక్వాడ్ (95) మంగళవారం అనారోగ్యంతో బరోడాలో మరణించారు. ఆయన తనయుడు అన్షుమన్ గైక్వాడ్ టెస్టు క్రికెటర్‌గా, రెండుసార్లు భారత జట్టు కోచ్‌గా వ్యవహరించాడు. 1950వ దశకంలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన దత్తాజీరావు.. అభేద్యమైన డిఫెన్స్, సుందరమైన కవర్ డ్రైవ్‌లు ఆడడంలో పేరెన్నికగన్న బ్యాటర్. 1952 నుంచి 1961 మధ్య ఆయన 11 టెస్ట్‌లు ఆడారు. 1959లో ఇంగ్లండ్‌లో పర్యటించిన భారత జట్టుకు దత్తాజీ కెప్టెన్‌గా వ్యవహరించారు. జీవించివున్న అతి పెద్ద వయస్సు భారత టెస్ట్ క్రికెటర్లలో దత్తాజీ ఒకరు.

మైక్ ప్రాక్టర్ పరిస్థితి విషమం



డర్బన్ : సౌతాఫ్రికా దిగ్గజ ఆల్‌రౌండర్, కోచ్ మైక్ ప్రాక్టర్ మృత్యువుతో పోరాడుతున్నాడు. 77 ఏళ్ల ప్రాక్టర్‌కు డర్బన్‌లోని ఓ ఆసుపత్రిలో ఆపరేషన్ సందర్భంగా గుండెపోటుకు గురయ్యాడు. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న మైక్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు డాక్టర్లు వెల్లడించారు.

ప్లేఆఫ్స్‌కు పట్నా పైరేట్స్

కోల్‌కతా: ప్రొ కబడ్డీ సీజన్-10లో పట్నా పైరేట్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. మంగళవారం తెలుగు టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పట్నా 38-36తో గెలిచింది. ఈ సీజన్‌లో పట్నాకు ఇది వరుసగా ఏడో విజయం కావడం విశేషం. గెలుపురుచి ఎలావుంటుందో మరిచిపోయిన తెలుగు టైటాన్స్ ఈ మ్యాచ్‌లో విజయం కోసం పోరాట పటిమ ప్రదర్శించింది. టైటాన్స్ కెప్టెన్ పవన్ (16 పాయింట్లు) ఒంటరి పోరాటం వృథా అయింది.

బిజినెస్

జీఎంఆర్ చేతికి మనీలా విమానాశ్రయం!

కాంట్రాక్టు విలువ 300 కోట్ల డాలర్లు

న్యూఢిల్లీ: జీఎంఆర్ గ్రూప్ విదేశాల్లో మరింత విస్తరిస్తోంది. కొత్తగా ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలోని 'నినాయ్ అక్వినో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు (ఎన్ఏఐఏ) రీడెవలప్‌మెంట్ కోసం పోటీపడుతోంది. ఇందుకోసం మొత్తం నాలుగు కంపెనీలు బిడ్స్ దాఖలు చేశాయి. అయితే జీఎంఆర్ గ్రూప్ నేతృత్వంలోని కన్సార్షియం అతి తక్కువ ధరతో పోటీలో ముందున్నట్టు సమాచారం. విమానాశ్రయాన్ని రీడెవలప్ చేయడంతో పాటు ఏటా వచ్చే ఆదాయంలో 33.3 శాతం ఫిలిప్పీన్ ప్రభుత్వానికి ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. దీంతో 300 కోట్ల డాలర్ల విలువైన ఈ రీడెవలప్‌మెంట్ కాంట్రాక్టు జీఎంఆర్ గ్రూప్‌నకే దక్కుతుందని భావిస్తున్నారు. ఈ కాంట్రాక్టు దక్కితే జీఎంఆర్ గ్రూప్ మనీలా విమానాశ్రయాన్ని ఏటా 6.2 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఇందుకు ప్రతిగా ఫిలిప్పీన్ ప్రభుత్వం 15 ఏళ్ల పాటు పన్ను రాయితీలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది.

జల్ జీవన్ మిషన్ కింద మరిన్ని కాంట్రాక్టులు : ఎన్‌సీసీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎన్‌సీసీ లిమిటెడ్ సాగునీటి ప్రాజెక్టులపై మరింత దృష్టి పెట్టింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'జల్ జీవన్ మిషన్' పథకం కింద కంపెనీ ఇప్పటికే రూ.18,000 కోట్ల కాంట్రాక్టులు సంపాదించింది. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద మరిన్ని కాంట్రాక్టులు వచ్చే అవకాశం ఉందని కంపెనీ స్ట్రాటజీ హెడ్ నీరద్ శర్మ తెలిపారు. ఈ నెల ఒకటో తేదిన ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) జల్ జీవన్ మిషన్ పథకానికి కేటాయింపులను రూ.96,549 కోట్ల నుంచి రూ.98,418 కోట్లకు పెంచారు. దీంతో ఈ పథకం కింద మరిన్ని ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందని ఎన్‌సీసీ భావిస్తోంది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.20 లక్షల కోట్లు

మార్కెట్ క్యాప్‌లో రికార్డు సృష్టించిన కంపెనీ
ఈ ఘనత సాధించిన తొలి భారత కంపెనీ ఇదే



ముంబై/న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీ యాజమాన్యంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మంగళవారం మార్కెట్ విలువలో చారిత్రక మైలురాయిని అధిగమించింది. తొలిసారిగా రూ.20 లక్షల కోట్ల మార్కెట్ విలువను అధిగవించి ఈ ఘనత సాధించిన తొలి భారతీయ కంపెనీగా చరిత్ర నమోదు చేసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఇంట్రాడేలో 1.88 శాతం పెరిగి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.2957.80ని తాకడంతో ఈ రికార్డు రిలయన్స్ ఖాతాలో పడింది. అప్పటికి కంపెనీ మార్కెట్ విలువ రూ.20,01,279.72 కోట్లకు చేరింది. తదుపరి క్రమంలో షేరు విలువ కొంత దిగజారి చివరికి 0.90 శాతం లాభంతో రూ.2928.95 వద్ద ముగిసింది. ఫలితంగా ముగింపు సమయానికి కంపెనీ మార్కెట్ విలువ రూ.19,81,635.72 కోట్ల వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో కూడా ఈ షేరు 1.89 శాతం పెరిగి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.2958కి చేరిన అనంతరం చివరికి 0.74 శాతానికి లాభాన్ని పరిమితం చేసుకుని రూ.2926.20 వద్ద ముగిసింది.

రెండు వారాల్లో లక్ష కోట్లు అప్

గత రెండు వారాల వ్యవధిలోనే కంపెనీ మార్కెట్ విలువ రూ.లక్ష కోట్ల మేరకు ఎగబాకింది. గత నెలలో రిలయన్స్ షేర్లకు డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా మార్కెట్ విలువ 7 శాతం మేరకు పెరిగి మార్కెట్ విలువ రూ.19.56 లక్షల కోట్లు దాటింది. 2022 మార్చిలో రిలయన్స్ రూ.18 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. ఆర్ఐఎల్ మార్కెట్ విలువపరంగా దేశంలోని టాప్ 10 కంపెనీల్లో అగ్రగామిగా తన ఆధిపత్యాన్ని నిరంతరం నిలబెట్టుకుంటూ వస్తోంది. ప్రస్తుతానికి మార్కెట్ విలువలో ఆర్ఐఎల్‌ను ఢీ కొట్టగలిగే కంపెనీ దరిదాపుల్లో ఏదీ లేదు. రిలయన్స్ తర్వాత టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్,ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్ఐసీ, ఎస్‌బీఐ, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్, ఐటీసీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

అంబానీ సంపదకూ బూస్ట్

ఆర్ఐఎల్ మార్కెట్ క్యాప్‌లో ఏర్పడిన వృద్ధి కంపెనీ అధినేత ముకేశ్ అంబానీ సంపద కూడా గణనీయంగా పెరగడానికి దోహదపడింది. ఈ సంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటికి అంబానీ సంపద 1,250 కోట్ల డాలర్ల (రూ.1,06,250 కోట్లు) మేరకు పెరిగి 10,900 కోట్ల డాలర్లకు (రూ.9,26,500 కోట్లు) దూసుకుపోయింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం ఆయన ప్రస్తుతం దేశంలో అమిత సంపన్నుడుగాను, ప్రపంచ సంపన్నుల్లో 11వ స్థానంలోను ఉన్నారు.

లాభాల్లో సెన్సెక్స్

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో మంగళవారం స్టాక్ మార్కెట్ పునరుజ్జీవం సాధించింది. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గిందన్న వార్తలు ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను బూస్ట్ చేశాయి. సెన్సెక్స్ 482.70 పాయింట్ల లాభంతో 71,555.19 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 71,662.74-70,924.30 పాయింట్ల మధ్యన కదలాడింది. నిఫ్టీ కూడా 127.20 పాయింట్లు లాభపడి 21,743.25 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో 2.46 శాతం లాభంతో ఐసీఐసీఐ బ్యాంక్ అగ్రగామిగా నిలవగా యాక్సిస్ బ్యాంక్, విప్రో, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్‌టీపీసీ కూడా మంచి లాభాలు నమోదు చేసిన కంపెనీల్లో ఉన్నాయి.

పేటీఎం షేరు 10 శాతం డౌన్

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆంక్షల విషయంలో పునరాలోచన లేదని ఆర్‌బీఐ ప్రకటించిన నేపథ్యంలో పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్ షేరు మంగళవారం 10 శాతం మేరకు నష్టపోయింది. దీంతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈ రెండింటిలోనూ 52 వారాల కనిష్ఠ స్థాయికి దిగజారిన ఈ షేరు తొలిసారిగా రూ.400 కన్నా దిగువన ముగిసింది. ఎన్ఎస్ఈలో ఈ షేరు రూ.380 వద్ద ముగియగా బీఎస్ఈలో రూ.380.35 వద్ద ముగిసింది.

ఎంఎఫ్ ఆస్తుల్లో మహారాష్ట్ర టాప్

ఈ ఏడాది జనవరి నాటికి మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల్లో మహారాష్ట్ర అగ్రగామిగా ఉంది. మొత్తం ఎంఎఫ్ ఆస్తుల విలువ రూ.52.89 లక్షల కోట్లు కాగా మహారాష్ట్ర, న్యూఢిల్లీ, కర్ణాటక, గుజరాత్, పశ్చిమ బెంగాల్ 68.46 శాతం వాటా కలిగి ఉన్నాయని ఇక్రా అనలిటిక్స్ ఒక నివేదికలో తెలిపింది. ఈ ఐదు రాష్ట్రాలు/యుటిల్లో ఏయూఎంలు గత నెలలో 27 నుంచి 30 శాతం మేరకు పెరిగాయి. ఏయూఎం వాటా మహారాష్ట్రలో రూ.21.69 లక్షల కోట్లుంది. తెలంగాణ రూ.78,964 వాటాతో టాప్ 10 రాష్ట్రాల్లో ఒకటిగా పదో స్థానంలో ఉంది.

ఆటో డ్రైవర్లకు జీరో కమిషన్ నమూనా

ర్యాపిడో

హైదరాబాద్: జీరో కమిషన్ మోడల్‌తో ఆటో డ్రైవర్లను ఆకర్షించి, తమతో చేర్చుకోవాలని భావిస్తున్నట్టు రైడ్ హైలింగ్ కంపెనీ ర్యాపిడో తెలిపింది. సేవలు పారదర్శకంగా, సమ్మిళితంగా ఉండేందుకు ఆటో డ్రైవర్ల కోసం అగ్రిగేటర్ కమిషన్ ఆధారిత మోడల్ నుంచి జీవితకాల జీరో కమిషన్ మోడల్‌కు మారబోతున్నట్టు కంపెనీ సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి తెలిపారు. దేశంలో ప్రతి రోజూ రెండు కోట్ల ఆటో రైడ్లు జరుగుతాయని, వాటిలో ఆన్‌లైన్ మార్కెట్ వాటా 10 శాతం కన్నా తక్కువేనని ఆయన చెప్పారు. తన పోటీ సమాంతరంగా కార్యకలాపాలు సాగిస్తున్న మార్కెట్ కన్నా ఆఫ్‌లైన్ మార్కెట్‌తోనే అన్నారు. దేశంలో 25 లక్షల ఆటోడ్రైవర్లుంటే 4 లక్షల మంది ర్యాపిడో ద్వారా ఆటోలు నడుపుతున్నారని, కొత్త మోడల్ ద్వారా వారిలో అధిక శాతం మందిని ఆకర్షించడం తమ లక్ష్యమని చెప్పారు.

8 శాతం వృద్ధితోనే వికసిత్ భారత్ సాధ్యం

రంగరాజన్

హైదరాబాద్: భారత్ 2047 నాటికి 13,000 డాలర్ల తలసరి ఆదాయంతో అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ఏటా 7 లేదా 8 శాతం వృద్ధి తప్పనిసరి ఆర్‌బీఐ మాజీ గవర్నర్, పీఎంఈఏసీ మాజీ చైర్మన్ సి.రంగరాజన్ అన్నారు. సమాజంలో అసమానతలు, పేదరికం తగ్గించడానికి ఇన్నోవేషన్ ఒక్కటే పరిష్కారం అవదని ఆయన వ్యాఖ్యానించారు. వృద్ధి రేటుతో పాటుగా నగదు, మౌలికాదాయం రూపంలో సబ్సిడీలు కూడా అవసరమేనని తేల్చి చెప్పారు. "తలసరి ఆదాయం 13,000 డాలర్లుగా ఉన్న దేశమే అభివృద్ధి చెందిన దేశంగా పరిగణనలోకి వస్తుంది, కాని ఇప్పుడు మన తలసరి ఆదాయం 2,700 డాలర్లు మాత్రమే. అంటే దాన్ని మనం ఐదు రెట్లు పెంచుకోవాల్సి ఉంటుంది" అని రంగరాజన్ వ్యాఖ్యానించారు. సమాజంలో అట్టడుగున ఉన్న ప్రజల జీవనోపాధి అవకాశాలు పెంచేందుకు మరింతగా దృష్టి సారించాల్సి ఉంటుందని ఆయన అన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,840 ▼	57,600 ▼	77,000 ▲
ముంబై	62,394 ▲	57,153 ▲	71,042 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ		విజయవాడ	536
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
14వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	593	దజను గుడ్లు రూ.72	
గోదావరి	536		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	124	గోదావరి	129
వరంగల్	124	విజయవాడ	129
కరీంనగర్	124	గుంటూరు	129
మహబూబ్‌నగర్	124	ఒంగోలు	129
కర్నూలు	124	చిత్తూరు	133
విశాఖపట్నం	122		

పవర్‌మెక్ లాభంలో 22% వృద్ధి

హైదరాబాద్: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.62 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో (రూ.50.6 కోట్లు) పోల్చితే లాభం 22.5 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.912 కోట్ల నుంచి రూ.1,114.90 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో కంపెనీ మొత్తం వ్యయాలు కూడా రూ.840.90 కోట్ల నుంచి రూ.1,008.20 కోట్లకు పెరిగినట్లు కంపెనీ పేర్కొంది.

జీఓసీఎల్ ఆదాయం రూ. 230 కోట్లు

జీఓసీఎల్ కార్పొరేషన్ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.230 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.15 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. త్రైమాసిక కాలంలో ముడి సరుకులు ధరలు పెరగటం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల పనితీరుపై ప్రభావం చూపించాయని కంపెనీ పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో అనుబంధ సంస్థ ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్ రూ.152 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. కాగా కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్, రక్షణ అప్లికేషన్స్ కోసం కటింగ్ ఎడ్జ్ ఉత్పత్తులు, మెటల్ క్లాడింగ్ వంటి విభాగాల్లోకి ప్రవేశించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది.

డీసీఐ లాభంలో రెండింతల వృద్ధి

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి రూ.27.22 కోట్ల లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.13.84 కోట్లుగా ఉంది. ప్రస్తుతం ఒక్కో షేరు మీద రూ.9.72 ఆర్జించింది. అయితే సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.372.30 కోట్ల నుంచి రూ.266.23 కోట్లకు తగ్గిందని కంపెనీ పేర్కొంది. త్రైమాసికంలో పలు కీలకమైన డ్రెడ్జింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసినట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,200 కోట్ల టర్నోవర్‌ను సాధించవచ్చని కంపెనీ భావిస్తోంది.

తగ్గిన ఎంటార్ టెక్నాలజీ లాభం

హైదరాబాద్: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఎంటార్ టెక్నాలజీస్ నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో రూ.118.4 కోట్ల రెవెన్యూపై రూ.10.4 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం (రూ.160.2 కోట్లు) 26 శాతం క్షీణించగా లాభం (రూ.31.4 కోట్లు) ఏకంగా 66.8 శాతం తగ్గింది. క్లీన్ ఎనర్జీ విభాగంలో కొన్ని ఎగుమతులు వాయిదా పడటం మూలంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయంలో స్వల్ప వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని కంపెనీ పేర్కొంది. కాగా చిన్న శాటిలైట్ లాంచ్ వెహికల్ ప్రాజెక్ట్ కోసం పేరొందిన అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో జరుపుతున్న చర్చలు తుది దశకు చేరుకున్నాయని తెలిపింది.

కాప్రీ గ్లోబల్ 1:1 బోనస్

ముంబై: ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ కాప్రీ గ్లోబల్ క్యాపిటల్ లిమిటెడ్ (సీజీసీఎల్) వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు ప్రకటించింది. దీంతో రూ.2 ముఖ విలువ ఉన్న కంపెనీ షేర్లు కలిగి ఉన్న ప్రతి వాటాదారుకు ప్రతి ఒక్క షేరుకు ఒక షేరు బోనస్‌గా లభిస్తుంది. దీనికి తోడు రూ.2 ముఖ విలువ ఉన్న కంపెనీ షేర్లను రూ.1 ముఖ విలువ ఉండే రెండు షేర్లుగా విభజించేందుకూ కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

టాటా నెక్సాన్, టియాగో ఈవీల ధర తగ్గింపు

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ తన ఎలక్ట్రిక్ కార్లయిన నెక్సాన్ ఈవీ, టియాగో ఈవీ ధరలను రూ.1.2 లక్షల మేరకు తగ్గించింది. బ్యాటరీ వ్యయాలు తగ్గడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ తెలిపింది. నెక్సాన్ ఈవీ ధర గరిష్ఠంగా రూ.1.2 లక్షలు తగ్గడంతో ప్రారంభ ధర రూ.14.49 లక్షలకు తగ్గుతుంది. అలాగే టియాగో ఈవీ ధర రూ.70,000 తగ్గించడంతో ఆ కారు ప్రారంభ ధర రూ.7.99 లక్షలకు దిగివస్తుంది. అయితే ఇటీవలే మార్కెట్లోకి తెచ్చిన పంచ్ ఈవీ ధరలో మాత్రం ఎలాంటి మార్పు ఉండదని, బ్యాటరీ ధర తగ్గుదలను ముందే ఊహించి ఆ కారు ధర నిర్ణయించామని వివరణ ఇచ్చింది.

www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
హైదరాబాద్ సిటీ*

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 300

బుధవారం | 14-2-2024

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





నల్లగొండ బీఆర్ఎస్ సభకు భారీగా హాజరైన జనం. ప్రసంగిస్తున్న కేసీఆర్

ఈ సభ రాజకీయాల కోసం పెట్టిన సభ కాదు. కృష్ణా నీళ్లలో మన హక్కుల కోసం, మన జీవన్మరణ సమస్య కోసం, మన బతుకు కోసం పెట్టిన సభ. కృష్ణా నీళ్లలో మన వాటా మనకు దక్కేంతవరకు ఈ జల ఉద్యమం ఆగదు. నేను సాధించిన తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ కూర్చోలేను. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం పోరాడడానికి బెబ్బులిలా వచ్చాను.

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

దద్దమ్మల పాలన

నేను పదవి నుంచి తప్పుకోగానే కరెంటు పోతోంది

- పాలిచ్చే బర్రెను కాదని.. దున్నపోతును తెచ్చుకున్నారు
- కాంగ్రెస్ నేతలకు పదవులు, డబ్బులపైనే మమకారం
- రైతుబంధు అడిగితే రైతులను చెప్పుతో కొట్టమంటారా?
- రైతులకూ చెప్పులుంటాయ్.. కొడితే 32 పళ్లు ఊడతాయ్
- దమ్ముంటే నీళ్లివ్వాలి కానీ.. మేడిగడ్డకు వెళ్లి ఏం చేస్తారు?
- అసెంబ్లీ సమావేశాలు ముగిశాక మేమూ అక్కడికి వెళతాం
- వందల పిల్లర్లలో ఒకటి రెండు దెబ్బతింటే రిపేర్ చేయాలి
- నాగార్జునసాగర్ కుంగలేదా? మూసీ మూసుకుపోలేదా?
- కృష్ణానదీ జలాల్లో హక్కులు మన జీవన్మరణ సమస్య
- ఎవరు అధికారంలో ఉన్నా కేంద్రంతో కొట్లాడడం మొగోళ్ల పని
- అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానిని నిలదీయాలి
- అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.. రెట్టింపు వేగంతో వస్తాం
- ఇది రాజకీయాల కోసం కాదు.. బతుకు కోసం పెట్టిన సభ
- కాలు విరిగినా కట్టె పట్టుకొని కొట్లాటకు వచ్చాను
- ప్రజలకు భయం వద్దు.. తెలంగాణను నాశనం కానివ్వను
- నల్లగొండ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉద్ఘాటన
- కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు

నల్లగొండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని దద్దమ్మలు, చేతకాని వాళ్లు పాలిస్తున్నారని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోపించారు. తాను పదవి నుంచి తప్పుకోగానే రాష్ట్రంలో కరెంటు కోతలు మొదలయ్యాయన్నారు. ప్రజల కోసం తాను ఎక్కడెక్కడి నుంచో కరెంటు తెచ్చి ఇచ్చానని, కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అసెంబ్లీని కూడా జనరేటర్ పెట్టి నడిపించుకుంటున్నారని విమర్శించారు. ప్రజలు ఏ భ్రమలకో లోనై.. పాలిచ్చే బర్రెను కాదని దున్నపోతును తెచ్చుకున్నారని వ్యాఖ్యానించారు. అయినా తమకు అప్పజెప్పిన ప్రతిపక్ష బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తామని, తెలంగాణ ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. మళ్లీ రెట్టింపు వేగంతో అధికారంలోకి వస్తామని ప్రకటించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభకు కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ఈ సభ రాజకీయాల కోసం పెట్టిన సభ కాదు. పిడికెడు మంది కోసమో, ఒకరిద్దరి కోసమో ఈ సభ జరపడం లేదు. కృష్ణా నీళ్లలో మన హక్కుల కోసం, మన జీవన్మరణ సమస్య కోసం, మన బతుకు కోసం పెట్టిన సభ. కేంద్ర ప్రభుత్వానికి, బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు, కేంద్ర మంత్రికి ఈ సభ హెచ్చరిక. కృష్ణా నీళ్లలో మన వాటా మనకు దక్కేంతవరకు ఈ జల ఉద్యమం ఆగదు. నాకు కాలు విరిగినా, కుంటి నడకతోనైనా, కట్టె పట్టుకొనైనా ఇంత ఆయాసంతోనైనా ఈ సభకు రావాల్సి వచ్చింది. నేను సాధించిన తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ కూర్చోలేను. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం పోరాడడానికి బెబ్బులిలా వచ్చాను. నా కట్టె కాలేంతవరకు తెలంగాణ ప్రజల హక్కుల కోసం పోరాడుతాను" అని కేసీఆర్ ఉద్ఘాటించారు. ఈ సభతో జల ఉద్యమం ఆగదని, కృష్ణాజలాల్లో తెలంగాణ హక్కులు సాధించేంత వరకు తాము విశ్రమించబోమని కేసీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి

మిగతా 10వ పేజీలో...





నిలువుగా చీలిక ఏర్పడిన మేడిగడ్డ బ్యారేజీ డీపీ - 21 పిల్లర్; పిల్లర్ పగుళ్లను గమనిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు

కేసీఆర్ కాశీకే!

సన్యాసం పుచ్చుకుని బిచ్చమెత్తుకోవాల్సిందే.. 4-5 పిల్లర్లు పోతే తప్పేంటంటారా?

- కేసీఆర్‌కు ఓ కాలు విరిగితే ఫరక్ పడుతుందా?
- అవినీతిని బయట పెడుతుంటే ఎదురుదాడా?
- వేటాడతాడట... అల్లాటప్పాగా కూర్చున్నామా?
- నేను మంది పిల్లలను చంపి కుర్చీ ఎక్కలేదు
- నల్లగొండకు పోయినోడు అసెంబ్లీకి రాలేడా?
- తీర్మానంలో లోపాలుంటే సభకొచ్చి చెప్పాల్సింది
- హరీశ్‌రావు ఎందుకు మద్దతు పలికిండు?
- సీబీఐ విచారణ అడుగుతున్న బీజేపీ కేంద్రానికి చెప్పి సిటింగ్ జడ్జిని ఇప్పించలేదా?
- సీబీఐకి ఇస్తే కేసీఆర్ నుంచి గిల్లుకుందామనే?
- కాళేశ్వరంపై జ్యుడీషియల్ ఎంక్వైరీ చేయిస్తాం
- ఎల్‌అండ్‌టీపై రెవెన్యూ రికవరీ యాక్టు అవసరమైతే తప్పకుండా ప్రయోగిస్తాం
- మేడిగడ్డ సందర్శనలో రేవంత్ వ్యాఖ్యలు
- నీటిపారుదల శాఖపై నేడు శ్వేతపత్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో చేసిన దోపిడీ బయట పడుతుందనే భయంతోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన పార్టీ ఎమ్మెల్యేలు బ్యారేజీ దగ్గరకు రాకుండా నల్లగొండలో సభ పెట్టుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును చూడడానికి తర్వాత వెళతామని అంటున్నారని, నిజానికి కేసీఆర్ వెళ్లాల్సింది కాళేశ్వరం కాదు కాశీకేనని ఎద్దేవా చేశారు. కాశీకి వెళ్లి సన్యాసం తీసుకొని బిచ్చమెత్తుకోవడం తప్ప ఆయనకేం మిగల్లేదన్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి ప్రాజెక్టు కింద కనీసం లక్ష ఎకరాల ఆయకట్టుకు నీళ్లివ్వలేదని ఆరోపించారు. ఈ ప్రాజెక్టులో కేసీఆర్ సాగించిన అవినీతిపై న్యాయవిచారణ జరిపిస్తామని చెప్పారు. విచారణ బాధ్యతను సీబీఐకి ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జ్యుడీషియల్ కమిషన్‌కు సిటింగ్ జడ్జిని ఇప్పించే బాధ్యత తీసుకోవాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పిల్లర్లు కుంగిపోవడం, దాని నిర్మాణ లోపాలను చూపించడానికి రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, పత్రికా విలేకరులను మేడిగడ్డకు బస్సుల్లో తీసుకెళ్లింది. సీఎం రేవంత్, సాగునీటి పారుదల మంత్రి ఉత్తమ్ కూడా వారితో పాటే బస్సుల్లో ప్రయాణించారు. పరిస్థితిని పరిశీలించిన అనంతరం రేవంత్, ఉత్తమ్ విలేఖర్లతో మాట్లాడారు. అంతకుముందు ప్రాజెక్టు అంచనా వ్యయం, ఇప్పటివరకు

మిగతా 11వ పేజీలో...

కాళేశ్వరం పేరుతో కట్టింది
ఇసుకలో పేక మేడలా?

- ప్రపంచంలో అద్భుత కట్టడమైతే కేసీఆర్ ఎందుకు రారు?
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి
- **ఎన్నికల్లో పొత్తుకోసమే..**
- బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేల డుమ్మాపై పొన్నం ఆరోపణ 12

ఇన్ని పగుళ్లా?

- ఇంత డ్యామేజీ జరిగితే చిన్న లోపమంటారా?.. పగుళ్ల ప్రాజెక్టు గురించా అంత గొప్పగా చెప్పింది!
- బ్యారేజీ పునర్నిర్మాణమా? బ్లాక్ లిస్టా?.. ఎల్‌అండ్‌టీ సంస్థనే తేల్చుకోమన్న రాష్ట్ర ప్రభుత్వం
- పరిశీలిస్తూ.. ప్రశ్నిస్తూ.. విమర్శిస్తూ.. సాగిన సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ పర్యటన 11
- కాళేశ్వరం రైతుల త్యాగాలకు ఫలితం లేదు.. విజిలెన్స్ నివేదికపై ఉలుకెందుకు?: శ్రీధర్‌బాబు



బీఆర్ఎస్ నేతలకు నిరసన సెగ

- బస్సును అడ్డుకున్న ఎన్ఎస్‌యూఐ శ్రేణులు
- కోడిగుడ్ల దాడి.. నల్ల దుస్తులతో నిరసన
- కేసీఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు 10
- బీఆర్ఎస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల మధ్య వాగ్వాదం.. చెదరగొట్టిన పోలీసులు
- సభా ప్రాంగణానికి వెళుతుండగా ఘటన



శంభు వద్ద ఆందోళనకారులపై బాష్పవాయువు ప్రయోగిస్తున్న పోలీసులు

రైతుల చలో ఢిల్లీ ఉద్రిక్తం

- డ్రోన్లతో బాష్పవాయువును ప్రయోగించిన పోలీసులు
- రణరంగంలా పంజాబ్, హరియాణా సరిహద్దులు
- రైతులు ఢిల్లీకి చేరకుండా ఎక్కడికక్కడ నిర్బంధాలు
- శంభు వద్ద పోలీసులపైకి రాళ్లు రువ్విన రైతులు 9
- ఖాకీల రబ్బరు బుల్లెట్ తగిలి ఓ రైతు కంటికి గాయం
- భారీ ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- ఎమ్మెస్పీపై కమిటీలో ప్రతినిధుల పేర్లను సంఘాలు చేర్చలేదు
- హడావుడిగా ఎమ్మెస్పీ చట్టాన్ని తేలేం: కేంద్ర మంత్రి అర్జున్

పాస్‌బుక్‌కు
40 లక్షల లంచం

- ఏసీబీ వలలో శామీర్‌పేట తహసీల్దార్
- పట్టాదార్ పాస్‌బుక్‌కు 30 లక్షలు డిమాండ్
- రెండు విడతల్లో రూ.30 లక్షలు ఇచ్చిన రైతు
- అదనంగా మరో రూ.10 లక్షలు డిమాండ్
- డ్రైవర్ ద్వారా తీసుకుంటుండగా పట్టివేత
- నల్లగొండ కలెక్టరేట్‌కు బదిలీ అయినట్టు సిబ్బందికి చెప్పిన గంటలోపే అరెస్టు 12



శామీర్‌పేటలో ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు

జేఈఈ మెయిన్స్‌లో మనోళ్ల సత్తా

- 100% స్కోరు సాధించిన 23 మందిలో ఏడుగురు తెలంగాణ విద్యార్థులే
- రిషి శేఖర్ శుక్లాకు రెండో ర్యాంకు
- టాప్ స్కోరర్లలో ఏపీ నుంచి ముగ్గురు
- బీసీ గురుకుల విద్యార్థుల హవా..
- 248 మందిలో 98 మంది ఉత్తీర్ణత



రిషి శేఖర్ శుక్లా

ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్సే లక్ష్యం: జేఈఈ విజేతలు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2024లో తెలంగాణ విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. మంగళవారం ప్రకటించిన మొదటి విడత జేఈఈ పరీక్ష ఫలితాల్లో జాతీయస్థాయిలో రెండో ర్యాంకుతోపాటు 100 శాతం స్కోరులో అత్యధిక ర్యాంకులు మన రాష్ట్రానికే దక్కాయి. గత నెలాఖరులో దేశంలోని అన్ని ప్రధాన నగరాలతో పాటు ఇతర దేశాలకు చెందిన 21 నగరాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 11.70 లక్షల మంది హాజరయ్యారు. ఇంగ్లిష్, హిందీ, తెలుగు తదితర 13 భాషల్లో పరీక్ష నిర్వహించారు. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో 23 మంది 100 శాతం స్కోరు (100 పర్సంటైల్) సాధించారు. వీరిలో తెలంగాణ

మిగతా 9వ పేజీలో...

కోటి ఇళ్లకు సౌరశక్తి
నెలకు 300 యూనిట్లు ఫ్రీ

- ప్రధానమంత్రి సూర్య ఘర్.. ముఫ్త్ బిజిలీ యోజన
- లబ్ధిదారులకు నగదు బదిలీ, రాయితీపై రుణాలు
- ప్రజల్లోకి తీసుకెళ్లేలా స్థానిక సంస్థలకు ప్రోత్సాహకాలు
- సౌరశక్తి వినియోగం, సుస్థిరాభివృద్ధే లక్ష్యం
- కొత్త పథకంతో మరింత ఆదాయం, ఉద్యోగ అవకాశాలు, తక్కువ కరెంటు బిల్లు: ప్రధాని మోదీ
- వినియోగదారులకు ఏటా రూ.18 వేల వరకు మిగులు 9

యూఏఈలో నేడు అతిపెద్ద హిందూ ఆలయ ఉద్ఘాటన

- అబుధాబి చేరుకున్న మోదీ
- ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు
- యూపీఐ-ఏఏఎన్ఐల సమన్వయం
- రూపేకార్డుతో జేవాన్‌కార్డు లింక్



హైదరాబాద్.. కావాలట! 12

- మరో 2 ఏళ్లు ఉమ్మడి రాజధానిగా ఉండాలట
- జగన్ చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలు
- కేంద్రాన్ని కోరతామని.. తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోనూ చేరుస్తామని స్పష్టీకరణ
- ప్రస్తుతానికి విశాఖలో కొత్త రాజధానిని నిర్మించే పరిస్థితి లేదని సంచలన ప్రకటన



2,090 మందికి గురుకుల నియామక పత్రాలు

- నేడు లేదా రేపు సీఎం చేతులమీదుగా ఇచ్చేందుకు ట్రిబ్ ఏర్పాట్లు 7
- ముందు డీఎల్, జేఎల్, టీజీటీ పోస్టులు
- కాకుండా పీజీటీ, లైబ్రేరియన్, పీడీ పోస్టుల భర్తీ

మంత్రాల నెపంతో తల్లీకొడుకుల దారుణ హత్య

- పట్టపగలు నడిరోడ్డుపై ఇనుప రాడ్డుతో కొట్టిచంపిన ఆటోడ్రైవర్
- దాడిలో మరొకరికి తీవ్ర గాయాలు
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన 7
- నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు



గుండు చేసి.. మీసాలు తొలగించి.. 7

- రామగుండం మెడికల్ కళాశాలలో ర్యాగింగ్
- ఇద్దరు జూనియర్లపై నలుగురు సీనియర్ల దుశ్చర్య
- ఆందోళనకు దిగిన విద్యార్థులు

రాజస్థాన్ నుంచి రాజ్యసభకు సోనియా

- నేడు జైపూర్‌లో నామినేషన్ సమర్పణ
- రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభ బరిలో ప్రియాంక!


9

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాక్‌లో అదే అనిశ్చితి

పాకిస్థాన్ ఎన్నికల ఫలితాలు ఊహించినవే. అధికారం కోల్పోయినప్పటినుంచి సైన్యంమీద ప్రతీకారజ్వాలతో రగిలిపోతూ, భీకర యుద్ధం చేసిన ఇమ్రాన్‌ఖాన్ ఎన్నికల్లో భారీగా గెలుస్తారని అనుకున్నదే. అలా జరగనివ్వకూడదనే సైన్యం ప్రయత్నం. ఎన్నికలకు ఓ వారంముందు కూడా ఇమ్రాన్‌మీద మూడుకేసుల్లో తీర్పులు వెలువరించి న్యాయస్థానాలు ఆయనకు భారీ శిక్షలు వేశాయి. ఇప్పట్లో ఆయన జైల్లోంచి బయటకు రాడని తేల్చేశాయి. ఇమ్రాన్, ఆయన పార్టీ రాజకీయ భవిష్యత్తు గురించి ప్రజలకు పూర్తి అవగాహన ఉంది. అయినా, ఎన్నికల బరిలో ఇండిపెండెంట్లుగా నిలిచిన ఇమ్రాన్ పార్టీవారినే ప్రజలు ఎక్కువగా ఆదరించారు. కానీ, సైన్యమే అన్నీ తానై నడిపిస్తున్నది కనుక, ఇప్పుడు తరువాతి స్థానాల్లో నిలిచిన నవాజ్‌షరీఫ్ పార్టీ, భుట్టోల మద్దతుతో అధికారంలోకి వస్తోంది.

దేశం తీవ్ర సంక్షోభంలో ఉన్నదనీ, ఇప్పుడు కనుక ప్రధాని ఎంపిక, ప్రభుత్వం ఏర్పాటు సక్రమంగా జరగకపోతే మళ్ళీ ఎన్నికలకు పోవాల్సి వస్తుందనీ, మరో కొత్త సంక్షోభాన్ని నివారించే లక్ష్యంతోనే తాను ప్రధానమంత్రి పదవికి పోటీపడకుండా తప్పుకుంటున్నానని బెనజీర్ భుట్టో కుమారుడు బిలావల్ మంగళవారం ప్రకటించారు. ఈ ప్రకటనతో ఐదురోజుల అనిశ్చితికి తెరపడింది. దేశక్షేమం దృష్ట్యా ఇంతటి త్యాగం చేసి, షరీఫ్‌లు ప్రధాని కావడానికి మార్గం సుగమం చేసిన బిలావల్ కొత్త ప్రభుత్వంలో చేరకుండా, మంత్రిపదవులు పొందకుండా వెలుపలి నుంచి అంశాలవారీ మద్దతు ఇస్తానని ప్రకటించడం విశేషం. ఈ త్యాగానికి ప్రతిఫలంగా బెనజీర్ భుట్టో భర్త, మాజీ దేశాధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ దేశాధ్యక్షుడు అవుతాడన్నది కుమారరత్నం ప్రకటన సారాంశం. ఇలా ఇచ్చిపుచ్చుకోవడం బాగున్నది కానీ, ప్రభుత్వంలో చేరకపోవడం బిలావల్ నిర్ణయమో, సైన్యం వ్యూహమో తెలియదు. బిలావల్ పోటీనుంచి తప్పుకొని, షరీఫ్‌లకు మార్గాన్ని సుగమం చేసి, అనిశ్చితికి తెరదించారు. కానీ, ప్రభుత్వంలో చేరకపోవడమన్నది ప్రమాదకరమైన సంకేతం. నవాజ్ షరీఫ్ ఏ మాత్రం స్వతంత్రంగా వ్యవహరించినా, గతంలో మాదిరిగా సైన్యానికి వ్యతిరేకంగా తలెగరేసినా ఆయన ప్రభుత్వం కూలిపోతుందన్న సైన్యం హెచ్చరిక ఇందులో ఉంది. ఈ కారణంగానే కాబోలు, తాను కాక, షాబాజ్‌నే ప్రధాని చేయాలని నవాజ్ అనుకుంటున్నట్టు వార్తలు వస్తున్నాయి.

ఎన్నికల ఫలితాలు పాకిస్థాన్‌లో సుస్థిరప్రభుత్వం ఏర్పాటుకు తావు లేకుండా ఉన్నాయి. 264స్థానాల్లో 101స్థానాలతో ఇండిపెండెంట్లు అగ్రస్థానంలో ఉంటే, వీరిలో 93మంది ఇమ్రాన్ ఖాన్ పార్టీ బలపరిచినవారే. 75సీట్లతో నవాజ్‌షరీఫ్ పార్టీ, 54సీట్లతో భుట్టోల పార్టీ ఆ తరువాత స్థానాల్లో ఉన్నాయి. ఇప్పటికే కొంతమంది ఇండిపెండెంట్ల చేరికతో షరీఫ్ పార్టీ బలం 80కు పెరిగింది. తమ స్వతంత్ర అభ్యర్థులందరినీ ఒక కూటమిగా మార్చి, కొన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకొని అన్ని పదవులకూ పోటీపడతామని ఇమ్రాన్ అంటున్నప్పటికీ అది ఆచరణ సాధ్యంగా కనిపించడం లేదు. అత్యధిక స్థానాలు గెలుచుకొని, భుట్టోల చేయూతను కూడా అందుకున్నందున మరిన్ని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు షరీఫ్‌ల పక్షానే చేరే అవకాశాలే అధికం. ఒకటి రెండు ప్రావిన్సుల్లో తప్ప కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయగల పరిస్థితి ఇమ్రాన్‌కు లేదు.

మొత్తానికి ఈ ఎన్నికల తరువాత కూడా పాకిస్థాన్‌లో ఒక బలహీనమైన ప్రభుత్వమే ఏర్పడబోతున్నది. ఇమ్రాన్ ఖాన్ మీద కక్షసాధించడంలో మాత్రం సైన్యం విజయం సాధించింది. తెరవెనుకనుంచి సైన్యం అన్ని వ్యవస్థలనూ ప్రభావితం చేసి ఇమ్రాన్ ఖాన్‌ను అనేక కేసులతో వేధించి, ఆయన చేతిలోనుంచి బ్యాట్ లాక్కొని, పోటీకి, ప్రచారానికి దూరం చేసినా, జైలునుంచి కూడా ఇమ్రాన్ ఎన్నికల యుద్ధం బలంగా చేశారు. సైన్యం ప్రోత్సహించిన షరీఫ్‌లు, భుట్టోలకంటే స్వతంత్రులుగా రంగంలోకి దిగిన ఇమ్రాన్ అభ్యర్థులనే ప్రజలు ఎక్కువగా ఆదరించారు. ఇమ్రాన్ దేశద్రోహి అన్న సైన్యం వాదనను తిరస్కరించి, రాజకీయాల్లోనూ, పరిపాలనలోనూ సైన్యం పెత్తనాన్ని ప్రశ్నించిన ఇమ్రాన్ పక్షాన నిలబడ్డారు. అధికారం దక్కకపోయినా, ప్రజాబలం తగ్గలేదని రుజువుచేసిన ఈ ఫలితాలు ఇమ్రాన్‌కు ఉపశమనం కలిగించేవే. అయితే, సైన్యంతో ఆయన పోరాటం, దేశంలో రాజకీయ అనిశ్చితి కొనసాగుతూనే ఉంటాయి.

సినిమా రంగానికి 'గద్దర్' అవార్డు ఏమిటి?

గద్దర్ తొలి జయంతిని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని సభని జయప్రదం చేశారు. ఇదే సందర్భంలో సినిమా పరిశ్రమకు ఇచ్చే నంది పురస్కారాన్ని ఇకపై గద్దర్ పురస్కారంగా ఇస్తానని ప్రకటించారు. అంతే కాకుండా ఆయన చాలా భావోద్వేగానికి గురైనట్లు కనిపించారు. 'ఇదే నా మాట నా మాటే శాసనం' అని రాజమాత శివగామీదేవి స్టైల్‌లో చెప్పేశారు. పక్కనే ఉన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా సంతోషించి ఆమోదించినట్లుగా ముఖ్యమంత్రిని హర్షపూర్వక ఆలింగనం చేసుకున్నారు. ఇలాంటి విధానపరమైన నిర్ణయాలను మంత్రిమండలిలో తీసుకొని తర్వాత ప్రజలకు చెప్తారు. కానీ ముఖ్యమంత్రి ఒక ఎమోషనల్ స్ట్రీమ్‌లో చెప్పేశారు. పరిపాలకులు ఎప్పుడూ ఎమోషన్‌లో నిర్ణయాలు తీసుకోకూడదు అని రాజనీతి చెబుతుంది.

గద్దర్‌కి అభిమానులు కానివారెవరు.. తెలుగువారు అందరూ ఆయనకు అభిమానులే. దేశవ్యాప్తంగా, విదేశాలలోనూ ఆయనకు అభిమానులు ఉన్నారు. ఆయన పాట, కవిత్వాన్ని విపరీతంగా అభిమానించే వారిలో నేనూ ఒకడిని. నేను ఎంత అభిమానిని అంటే గద్దర్ పాటలపైన నా విద్యార్థితో పిహెచ్.డి చేయించాను. కానీ ఇదే సమయంలో గద్దర్ పేరుతో సినిమా పరిశ్రమకు చెందినవారికి అవార్డు ఇవ్వడాన్ని అంగీకరించలేకపోతున్నాను. అంతే కాదు ఆ పరిశ్రమలోని అధికాధికులు అంగీకరించరు. కారణం గద్దర్‌కి సినిమా పరిశ్రమకు గరిష్ఠమైన సంబంధం లేదు. ఆయన కొన్ని సినిమాలకు పాటలు రాసి ఉండవచ్చు. కొన్ని సినిమాలలో చిన్న చిన్న అతిథి పాత్రలు చేసి ఉండవచ్చు. కానీ ఆయనకు, సినిమా రంగానికి ప్రధానమైన సంబంధం లేదు.



> గద్దర్ తన కెరీర్ అంతా రాజ్యవ్యతిరేకంగా, సాయుధ విప్లవం ద్వారానే సమసమాజ స్థాపన సాధ్యం అనే సైద్ధాంతిక భావజాలంతో గడిపాడు. ఇలాంటి వ్యక్తి పేరుతో సినిమా పరిశ్రమకు చెందిన కళారంగం, సాంకేతిక రంగాల వారికి పురస్కారాలు ప్రకటించడం సరైన చర్య కాదు. సినీరంగానికి చెందిన ఉన్నత స్థాయి నటులు, కవులు, గాయకులు గద్దర్ పురస్కారం గ్రహించి ఆయన ప్రతిమను సంతోషంగా ఇంటికి తీసుకుపోయి పెట్టుకుంటారా?

సినిమా పరిశ్రమలోని వేరు వేరు రంగాలకు చెందినవారికి నటులు, దర్శకులు, పాటల రచయితలు, మాటల రచయితలు, సినిమాటోగ్రఫీ అంటే కెమెరా వారికి, తర్వాతి కాలంలో మేకప్ కళాకారులకు, ఆర్ట్ డైరెక్టర్లకు, ఇంకా వేరే శాఖల వారికి ఈ నంది పురస్కారాలు ఇస్తున్నారు. ఇందులో కూడా స్వర్ణ, రజత, కాంస్య తామ్ర నందులను వరుసగా ప్రథమ, ద్వితీయ స్థాయిలలో ఇచ్చుకుంటూ వస్తున్నారు. ఈ అవార్డుని తెలుగు వారికి సాంస్కృతిక చిహ్నమైన నంది ఆకారంలో దాని పేరుతో ఇస్తున్నారు. నందిని ఎంచుకోవడానికి చాలా కారణాలున్నాయి. నంది విగ్రహం ఒక చరిత్రకు, ఆధ్యాత్మికతకు, మన సాంస్కృతిక చారిత్రక వారసత్వానికి గుర్తు, మన శిల్ప చిత్రకళలకు చిహ్నం. ఇది ఇన్ని విధాల వారసత్వానికి ఒక టోటెమ్. అందుకే నందిని పురస్కారానికి ఎంచుకున్నారు. ఇది లేపాక్షి నంది అని ఆంధ్ర వారి చిహ్నం అని తెలంగాణకు ఎందుకు అని భావించవలసిన పనిలేదు. నంది కాకతీయ శిల్పంలో చాలా అద్భుతమైన శిల్పకళా చిహ్నం. కాకతీయ వారసత్వానికి చిహ్నం. రామప్పగుడిలోని నంది, వేయిస్తంభాల గుడిలోని నంది, పానగల్లు ఛాయాసోమేశ్వరాలయం, పచ్చలసోమేశ్వరాలయంలోని నందులు తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక, కళా వారసత్వాలకు చిహ్నం. కాబట్టి నందిని నిస్సందేహంగా కొనసాగించవచ్చు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ కవులకు కళాకారులకు హంస అవార్డును ఇవ్వడం కూడా మొదలు పెట్టారు. ఇది 1999లో జరిగింది. ఎందరో కవులకు కళాపురస్కారం పేరుతో వేరు వేరు రంగాల కళాకారులకు హంస అవార్డుని ఇచ్చారు. కాకతీయ ద్వార తోరణాలలో హంస ఉన్నది. కాకతీయ శిల్పంలో గొప్ప ఐకాన్ ఇది. నంది అంతగా ఇష్టంలేదు ఆంధ్ర వారు ఇస్తున్నారుగా అని అనుకుంటే... సినిమా పరిశ్రమ వారికి హంస గుర్తుతో కూడా పురస్కారాలు ఇవ్వవచ్చు.

అంతేకాని సినిమా పరిశ్రమ వారికి గద్దర్ పేరుతో పురస్కారం ఇవ్వడానికి ఆ రంగంలో వారు సంతోషిస్తారని నేను అనుకోను. గద్దర్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో జరిపినప్పుడే వ్యతిరేకించిన వారున్నారు. ఇది పోలీసు వారి ఆత్మవిశ్వాసాలకు అనుగుణమైనది కాదని అన్నారు. గద్దర్ తన కెరీర్‌లో అంతా రాజ్యవ్యతిరేకంగా, సాయుధ విప్లవం ద్వారానే సమసమాజ స్థాపన సాధ్యం అనే సైద్ధాంతిక భావజాలంతో గడిపాడు. తర్వాత పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నమ్మకాన్ని ప్రకటించి పార్టీ పెట్టి ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనాలని భావించినా, ఇప్పుడున్న ప్రజాస్వామ్య విధానాలకు భిన్నమైన మావోయిస్టు భావజాలాన్ని ప్రధానంగా కలిగి జీవితంలో ఎక్కువభాగాన్ని గడిపినవాడు. ఇలాంటి వ్యక్తి పేరుతో సినిమా పరిశ్రమకు చెందిన కళారంగం, సాంకేతిక రంగాల వారికి పురస్కారాలు ప్రకటించడం సరైన చర్య కాదు. సినీరంగానికి చెందిన ఉన్నత స్థాయి నటులు, కవులు, గాయకులు గద్దర్ పురస్కారం గ్రహించి ఆయన ప్రతిమను సంతోషంగా ఇంటికి తీసుకుపోయి పెట్టుకుంటారా? అంతేకాదు రాజ్యం ఇప్పుడు గద్దర్ భావజాలాన్ని అంగీకరించి ముందుకు సాగగలదా? ఇవి ప్రజలందరి మనస్సులో ఉన్న ప్రశ్నలు. ఈ ప్రశ్నలు తక్షణం బయటికి రాకున్నా తర్వాత బయటికి వస్తాయి.

అంతే కాదు సినిమారంగ ప్రముఖులకు కేంద్రం ఇచ్చే దాదాసాహెబ్ పురస్కారానికి తుల్యంగా నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రఘుపతి వెంకయ్య పురస్కారాన్ని ఇస్తూ వచ్చింది. బిఎన్ రెడ్డి పురస్కారం కూడా ఇచ్చారు. వీరు ముగ్గురూ సినీరంగానికి చెందిన పితామహులు. దక్షిణ భారతానికి రఘుపతి వెంకయ్య... దాదాసాహెబ్ ఫాల్కేకి సమానమే. కానీ గద్దర్ ఇలా సినీరంగానికి సేవ చేసిన వ్యక్తి కాదు. అందువల్ల సినీపరిశ్రమకు గద్దర్ పురస్కారం తగినది కాదు.

గద్దర్ కళని ప్రభుత్వం గౌరవించవద్దని నేను చెప్పడం లేదు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే దాశరథి పేరుతో, కాళోజీ పేరుతో లక్షరూపాయల బహుమతిని, పురస్కారాన్ని ఇస్తున్నారు. ఇదే విధంగా గద్దర్ పేరుతో ప్రజాగాయకులకు, వాగ్గేయకారులకు, ప్రజాకవులకు, జానపద కళల వారికి లక్ష కాకుంటే రెండు లక్షల రూపాయలతో పురస్కారాన్ని పెట్టి ఇవ్వవచ్చు. నేడు కాంగ్రెస్ లేదా ఇతర పార్టీల ప్రభుత్వాలు కావచ్చు. గద్దర్ భావజాలంతో నేటి ప్రజాస్వామ్య వ్యవస్థ ఏకీభవిస్తుందా? ఈ ప్రశ్నను నేటి పాలకులు వేసుకోవాలి. సినీ పరిశ్రమలోని వేరు వేరు రంగాల వారికి ఈ పురస్కారాన్ని ఇవ్వడం సమంజసమైనది కాదు. ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచించాలని మనవి.

■ ప్రొ. పులికొండ సుబ్బాచారి

మోదీ గ్యారంటీ రైతులకు లేదా?





■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

దేశ రాజధాని చుట్టూ యుద్ధ వాతావరణం నెలకొంది. ఎక్కడ చూస్తే అక్కడ బారికేడ్లు కనపడుతున్నాయి. వందలాది లారీల్లో ఇసుకను, మట్టిని తీసుకువచ్చి జేసీబీ ప్రొక్లెయినర్లతో రహదార్లపై పోస్తున్నారు. ఢిల్లీ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు రాజధానిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీసులు బాష్పవాయువు, నీటి కానన్లను ప్రయోగించి వారిని చెదరగొడుతున్నారు. రాజధానికి ఇతర వాహనాల రాకపోకల్ని నిషేధించారు. పలు ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను విధించారు. అనేక చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనాలు అంగుళం కదలాలంటే కష్టమయ్యే పరిస్థితి ఏర్పడింది. 2020–21లో ఢిల్లీ పొలిమేరల్లో కనపడ్డ దృశ్యాలే మళ్లీ పునరావృతమవుతున్నాయి. సాగు చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు రైతులు తీవ్ర నిరసన తెలిపినప్పుడు వారి పోరాట పటిమను నీరు కార్చేందుకు ప్రభుత్వం తరఫున చాలా ప్రయత్నాలు చేశారు. రైతులను సంఘ వ్యతిరేక శక్తులు, ఉగ్రవాదులని కూడా నిందించారు. అభివర్ణించారు. తీవ్రమైన చలికి, వానకు, నిర్బంధానికి గురైన 700 మంది రైతులు ఆ నిరసన ప్రదర్శనల సందర్భంగా మరణించారు. 11 సార్లు రైతు ప్రతినిధులతో చర్చలు జరిపిన నాటి వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సాగు చట్టాలను వెనక్కి తీసుకునే ప్రసక్తి లేదని 2021 జూలై 28న ప్రకటన చేశారు. 2021 అక్టోబర్‌లో ఉత్తర ప్రదేశ్‌లోని లఖీంపూర్ ఖేరీలో నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్రహోంశాఖ సహాయమంత్రి కుమారుడు వాహనం నడిపించడం, తర్వాత జరిగిన హింసాకాండలో 8 మందికి పైగా మరణించారు. చివరకు 2021 నవంబర్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజల ముందుకు వచ్చి సాగు చట్టాలను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు కనీసమద్దతు ధరను మరింత సమర్థంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు కమిటీని వేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత మాత్రమే రైతులు శాంతించారు.

మళ్లీ ఇప్పుడు రైతులు ఎందుకు తీవ్ర నిరసన తెలిపేందుకు సమాయత్తమయ్యారు? మోదీ ప్రకటన చేసిన 9 నెలల తర్వాత 2022 జూలై 12న వ్యవసాయశాఖ మాజీ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ అధ్యక్షతన ఒక కమిటీ నేర్పాటు చేశారు. ఈ కమిటీలో సాగు చట్టాలను వ్యతిరేకించిన ఆర్థికవేత్తలు కానీ, నిపుణులు కానీలేరు. ఉత్తర ప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రానికి చెందిన రైతు ప్రతినిధులను ఎవర్నీ అందులో నియమించలేదు. విచిత్రమేమంటే ఈ కమిటీ ఇంతవరకూ మధ్యంతర నివేదిక కూడా సమర్పించలేదు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలు కూడా సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు మళ్లీ తమ డిమాండ్లను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు నిరసన ప్రదర్శనలు నిర్వహించాలనుకోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. మోదీ సర్కార్ మళ్లీ వారిని అణిచివేసేందుకు యథాప్రకారం చర్యలు తీసుకోవడంలో కూడా ఆశ్చర్యం లేదు.

నిజానికి 2014లో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చేందుకు ప్రధానంగా రైతులు కారణమయ్యారు. అనేక సభల్లో మోదీ కనీస మద్దతు ధర గురించి మాట్లాడారు. గోధుమ, వరి వంటి పంటలకు ఉత్పత్తి వ్యయం భరించడంతో 50శాతం లాభం కలిగించే విధంగా కొత్త ఫార్ములాను రూపొందిస్తామని ఆయన ప్రకటించారు. ఈ ఫార్ములా మోదీది కాదు. ఇటీవల మోదీ భారతరత్న ప్రకటించిన వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌ది. మోదీ అధికారంలోకి వచ్చాక ఈ ఫార్ములాను ఏనాడూ అమలుచేయలేదు. పైగా కనీసమద్దతు ధర అనే దానికే అర్థం లేకుండా చేసేందుకు, కార్పొరేట్లు వ్యవసాయ రంగంలో ప్రవేశించేందుకు వీలుగా సాగు చట్టాలను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించారు! ఈ చట్టాలను ఉపసంహరించుకున్న తర్వాత మోదీ ప్రభుత్వం ప్రకటించిన కనీసమద్దతు ధరలు స్వామినాథన్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా లేవు. భూసంస్కరణలు, రైతుల ఆత్మహత్యలు అరికట్టడం, వ్యవసాయ భూమి అమ్మకాన్ని క్రమబద్ధీకరించడం, నీటిపారుదల రంగంలో పెట్టుబడులు పెట్టడం, వ్యవసాయ భూమిని కార్పొరేట్లకు వ్యవసాయేతర అవసరాలకోసం అమ్మకుండా నిషేధించడం, గ్రామీణ బీమా అభివృద్ధి నిధిని ఏర్పాటు చేసి పంట బీమా, గ్రామీణ మౌలిక సదుపాయాలు కల్పించడం, రైతులకు 4 శాతం సరళ వడ్డీతో రుణాలు అందించడం వంటి అనేక సిఫారసులను కూడా స్వామినాథన్ కమిషన్ చేసింది. వీటిలో ఎన్ని మోదీ ప్రభుత్వం అమలు చేసింది? అమలు చేస్తే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, తమను అప్పుల వలయం నుంచి తప్పించాలని, రైతులకు, రైతు కూలీలకు పింఛను చెల్లించాలని, రైతులు ఇవాళ వీధుల్లోకి ఎందుకు వస్తారు? గత నిరసన ప్రదర్శనల సందర్భంగా రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోనే లేదు. ఆ ప్రదర్శనల్లో మరణించిన వందలాది రైతులకు నష్టపరిహారం కూడా చెల్లించలేదు. ఇది కాకుండా మోదీ ప్రభుత్వం నీరుకార్చిన భూసేకరణ చట్టం, 2013ను పునరుద్ధరించాలని కూడా రైతులు కోరుతున్నారు. విద్యుత్ చట్టానికి చేసిన సవరణలు రైతులను వ్యవసాయం నుంచి దూరం చేసే లక్ష్యంతో రూపొందించారని విమర్శిస్తున్నారు. నాడు రైతులతో చర్చలు జరిపిన నరేంద్రసింగ్ తోమర్‌ను కేంద్ర కేబినెట్ పదవి నుంచి తప్పించి మధ్యప్రదేశ్ అసెంబ్లీకి పోటీ చేయించారు. కేంద్రంలో కనీసం 8 కేబినెట్ పదవులు నిర్వహించిన తోమర్ ఇప్పుడు అసెంబ్లీలో స్పీకర్‌గా బాధ్యత నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అర్జున్ ముండా కనీస మద్దతు ధరపై చట్టాన్ని హడావిడిగా చేయలేమని తాజాగా ప్రకటించారు. మరి గత అయిదు సంవత్సరాలుగా ఏమి చేస్తున్నారు?

> స్వామినాథన్ కమిషన్ సిఫారసులను పూర్తిగా అమలు చేయకుండా ఆయనకు భారతరత్న ప్రకటించడంలో అర్థం ఉన్నదా? లక్ష కోట్ల రూపాయలతో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మోదీ సర్కార్ గత మూడేళ్లలో అందుకు కేటాయించింది కేవలం రూ. 12వేల కోట్లే! రైతాంగ సంక్షోభం నానాటికీ తీవ్రమవుతోందే కానీ తగ్గడం లేదని గత పదేళ్లలో సంభవించిన రైతుల ఆత్మహత్యలు స్పష్టం చేస్తున్నాయి. మరి మోదీ గ్యారంటీ ఎవరికి? ఈ పది సంవత్సరాలలో భారీ ఎత్తున సంపదను పోగుచేసుకున్న బడా పారిశ్రామికవేత్తలకేనా?

అసలు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను పూర్తిగా అమలు చేయకుండా ఆయనకు భారతరత్న ప్రకటించడంలో అర్థం ఉన్నదా? ఇవాళ దేశంలో వ్యవసాయ రంగానికి న్యాయం చేయాలంటే పంటలకు కనీస మద్దతు ధరను హామీ ఇచ్చే చట్టాన్ని చేయాల్సిందేనని స్వామినాథన్ కమిషన్ సభ్యుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డా. ఆర్‌బి సింగ్ మంగళవారం ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఏ పంటకైనా ఉత్పత్తి వ్యయంలో కనీసం 50 శాతం అధికంగా కనీస మద్దతు ధరను నిర్ణయించాలని తాము సిఫారసు చేశామని, కానీ దీన్ని దేశమంతటా ఒకే విధంగా అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. కనీస మద్దతు ధర విషయంలో మాత్రమే కాదు వ్యవసాయమౌలిక సదుపాయాలను కూడా మోదీ ప్రభుత్వం కల్పించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. రూ. లక్షకోట్లతో వ్యవసాయ మౌలికసదుపాయాల నిధిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం గత మూడేళ్లలో కేవలం రూ. 12వేల కోట్లే కేటాయించిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఇవాళ దేశంలో ఏ ప్రసార సాధనాలను చూసినా మోదీ గ్యారంటీ పేరుతో ప్రకటనలు ఊదరగొడుతున్నాయి. మోదీ చెప్పింది చేస్తారని ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు సర్వ యత్నాలు చేస్తున్నారు. అయోధ్యలో బాల రాముడికి ప్రాణ ప్రతిష్ఠ చేసి మోదీ తన వాగ్దానం నిలుపుకున్నారేమో కాని ఈ దేశ రైతులకు మాత్రం తాను ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఇవాళ లక్షలాది రైతులు వీధిన పడడాన్ని బట్టి అర్థమవుతోంది. 2016–17లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న దృష్ట్యా 2022 కల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామనే విధాన ప్రకటన చేశారు. అయితే దేశంలో 70 శాతం మంది రైతుల ఆదాయం సంవత్సరానికి రూ.15 వేలు కూడా మించడం లేదని, కేవలం 10శాతం మాత్రమే రూ.30 వేల కంటే ఎక్కువ ఆర్జిస్తున్నారని భారత వ్యవసాయ పరిశోధనా మండల అధ్యయనం ఒకటి తెలిపింది. దేశంలో రైతాంగ సంక్షోభం నానాటికీ తీవ్రమవుతోంది కానీ తగ్గడం లేదని గత పదేళ్లలో పెద్ద ఎత్తున జరిగిన రైతుల ఆత్మహత్యలను బట్టి తెలుస్తోందని రైతు సంఘాలు అంటున్నాయి. మరి మోదీ గ్యారంటీ ఎవరికి? ఈ పది సంవత్సరాల్లో భారీ ఎత్తున సంపదను పోగు చేసుకున్న బడా పారిశ్రామికవేత్తలకేనా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

విచిత్రమేమంటే రైతుల నిరసన ప్రదర్శనల సందర్భంగా ఎన్డీఏ నుంచి వైదొలగిన అకాలీదళ్‌ను మళ్లీ ఎన్డీఏలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఒకప్పుడు రైతుల నిరసనల్లో కీలకపాత్ర పోషించి అనేక రైతు ప్రదర్శనల్లో పాల్గొన్న భారతీయ లోక్‌దళ్ నేత జయంత్ చౌదరిని కూడా ఎన్డీఏ వైపు దృష్టిసారించేలా చేశారు. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించి నితీశ్ కుమార్‌ను ఎన్డీఏలోకి లాగినట్లే, జయంత్ చౌదరిని ఇండియా కూటమిలోంచి లాగి బీజేపీ వైపు తిప్పుకునేందుకు ఆయన తాత చౌదరి చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించారు.

పీవీ నరసింహారావును కాంగ్రెస్ పార్టీ గుర్తించకపోయినప్పటికీ ఆయనకు భారతరత్నను ప్రదానం చేయడం ద్వారా ఆ ఘనత పొందేందుకు మోదీ ప్రయత్నం చేయడంలో ఆశ్చర్యం లేదు. పీవీ తన అయిదేళ్ల పాలనలో అనేక నిర్ణయాలను ఏకాభిప్రాయ సాధన ద్వారా అమలు చేశారు. ఆయన హయాంలో పార్లమెంట్‌లో ఏనాడూ చర్చించకుండా ఏ బిల్లూ ఆమోదం పొందలేదు. ఇవాళ పి.వి. చనిపోయిన తర్వాత భారతరత్నను ప్రకటించారు కాని వాజపేయి ప్రతిపక్ష నేతగా తనను విమర్శిస్తారని తెలిసినప్పటికీ పి.వి. ఆయనకు పద్మవిభూషణ్ ఇచ్చారు. జెనీవాలో ఐక్యరాజ్యసమితి సమావేశానికి కేబినెట్ హోదాలో వాజపేయిని పంపించారు. అయినా సరే వాజపేయి పి.విపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. పరస్పర మర్యాదలకు లోటు రాకుండా రాజకీయాలు నిర్వహించేందుకు నాడు నేతలు జాగ్రత్తపడేవారు. కాని నేడు ప్రతిపక్షాలను నిర్మూలించేందుకు మోదీ కంకణం కట్టుకున్నట్లు కనపడుతోంది. పార్లమెంట్‌లో స్థాయీ సంఘాలను ప్రవేశపెట్టి ప్రతి కీలక బిల్లునూ క్షుణ్ణంగా చర్చించే పద్ధతిని ప్రవేశపెట్టిన నేత పి.వి. మరి ఆయన బాటలో మోదీ ఏనాడైనా నడిచే ప్రయత్నం చేశారా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

హేతువాద ఉద్యమాలతోనే సమాజాభివృద్ధి

ఏ దేశంలోనైనా మూఢనమ్మకాలు ఎంత తక్కువగా ఉంటే, ఆ దేశం అంతగా అభివృద్ధిపథంలో ముందుకు పోతుంది. మనదేశంలో తరతరాలుగా వస్తున్న ఆచారాలు, సాంప్రదాయాల పేరుతో చాందస భావాలను ప్రజల వదులుకోలేకపోతున్నారు. సైన్సు ఎంతగా అభివృద్ధి చెందినా దేవుడూ, దెయ్యం, బూచోడు లాంటి మాటలు, పుక్కిట పురాణాలు, మంత్రాలు–శాపాలూ వీటి బారి నుంచి బయటపడలేకపోతున్నారు. ఎంత చదువుకున్నా శాస్త్రీయ దృక్పథం లోపించిన కారణంగా డాక్టర్లు, యూనివర్శిటీ వైస్ చాన్సలర్లు, కలెక్టర్లు సైతం యాగాలు చేస్తున్నారు. యూనివర్శిటీలలో వాస్తు జ్యోతిష్యాలను కోర్సులుగా పెట్టి, సర్టిఫికెట్లు ఇస్తున్నారు. 'పదార్థం సృష్టించబడదు, నాశనం కాదు, మార్పు చెందుతుంది' అని విద్యార్థులకు బోధించే ఫిజిక్స్ ప్రొఫెసర్, ఒక బాబా నోట్లోంచి లింగం తీస్తే, అమాంతం వెళ్లి ఆయనకు సాష్టాంగపడుతున్నాడు.

ఆర్టికల్ 51ఏ(హెచ్)లో ఉన్న ప్రశ్నించే తత్వము, శాస్త్రీయ ఆలోచన, మానవవాదాన్ని పెంచటం ప్రతి పౌరుని బాధ్యత అన్న సూత్రాలను అమలుపరుస్తామని ప్రమాణం చేసిన ప్రధాని మోదీ ఒక సైన్సు కాంగ్రెసు సభలో పురాణాలలో వినాయకునికి ఏనుగు తలను అతికించడాన్ని ఇప్పటి సర్జరీలతో పోల్చి చెప్పారంటే పాలకులు ఎంత అజ్ఞానంలో కూరుకుపోయారో ఊహించుకోవచ్చు. ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తున్న బాబాల వద్దకు అధికారికంగా వెళ్లి సాష్టాంగపడుతున్న ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, గవర్నర్లు, ప్రజాప్రతినిధులు రాజ్యాంగంలోని లౌకికవాదాన్ని మంటగలుపుతున్నా అడిగేవాడు లేడు. ఈ రకంగా దేశంలో మూఢనమ్మకాలు పెరిగిపోతున్నాయి. అరికట్టవలసిన అధికారులు సైతం వాటిలోనే మునిగిపోతున్నారు. వీటికి విరుగుడు ఒక్కటే.. మూఢనమ్మకాల నిర్మూలనచట్టం. కర్ణాటక, మహారాష్ట్ర మరికొన్ని రాష్ట్రాలలో ఉన్నట్లుగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో కూడా మూఢనమ్మకాల నిర్మూలనచట్టం ఎంతో అవసరం. అందుకోసం అన్ని హేతువాద నాస్తిక సంఘాలూ, జన విజ్ఞాన వేదిక, ఇతర అభ్యుదయ సంఘాలు కలసి పోరాడాలి.

– నార్నె వెంకటసుబ్బయ్య

కుల గణన! మత గణన! వర్గ గణన!

'కుల గణన విదేశీ శక్తుల ఎజండా?' పేరుతో (ఫిబ్రవరి 3న) వచ్చిన కె. అరవిందరావు వ్యాసానికి ప్రతిస్పందన ఇది. ఆ వ్యాసంలో, 'సంప్రదాయ మార్క్సిజం', 'సాంస్కృతిక మార్క్సిజం', 'రథయాత్ర', 'మండల్ కమిషన్ నివేదిక', 'హెయిర్ కటింగ్ రంగం', 'హిందూ సంస్కృతి', 'భారతీయ సంస్కృతి' అంటూ అనేక విషయాల గురించి అవాస్తవాలు రాశారు, వ్యాసకర్త!

(1) మార్క్సిజంలో 'సంప్రదాయ మార్క్సిజం' అనీ, 'సాంస్కృతిక మార్క్సిజం' అనీ, తేడాలేమీ ఉండవు. మార్క్స్, ఎంగెల్సులు, తమకు పూర్వం వున్న సిద్ధాంతాలను, విమర్శనాత్మకంగా పరిశీలించి రూపొందించిన 'శ్రామికవర్గ పోరాట సిద్ధాంతం' ఒక్కటే వుంటుంది. దానిని, వేరు వేరు దేశాలలో ఉన్న పరిస్థితులను బట్టి అన్వయించుకోవడం మాత్రమే జరిగింది. అది తప్ప, మార్క్సిజం చెప్పిన 'శ్రమ దోపిడీ' అనే సత్యాన్ని మించిన సత్యాన్ని, ఇప్పటి వరకూ ఎవరూ కనిపెట్టలేదు.

(2) 'గ్రాంష్సీ' వంటి కమ్యూనిస్టు మేధావులు కనిపెట్టారని వ్యాసకర్త చెపుతున్న 'సాంస్కృతిక పెత్తందారీతనం' ('కల్చరల్ హెగిమొనీ') అనే భావన, కొత్త సత్యమేమీ కాదు. ఆ పద ప్రయోగమే కొత్త! మార్క్స్–ఎంగెల్సులు 1845లో రాసిన 'జర్మన్ ఐడియాలజీ'లోనూ; 1848లో రాసిన 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'లోనూ, ఆ భావన చాలా స్పష్టంగా ఉన్నదే. వాళ్ళ మాటలు చూడండి: "ప్రతీయుగంలోనూ, పాలించే భావాలు, ఆ నాటి పాలకవర్గ భావాలే"– (కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, పేజీ–66). "భౌతిక ఉత్పత్తి సాధనాలను తన అదుపులో కలిగివున్న వర్గమే, దాని ఫలితంగా బౌద్ధిక ఉత్పత్తి సాధనాలను కూడా కంట్రోల్ చేస్తుంది. బౌద్ధిక ఉత్పత్తి సాధనాలను కలిగివుండని వారి భావాలు, మొత్తం మీద, కంట్రోలు చేసే వర్గానికి లోబడివుంటాయి... పాలకవర్గ భావాలు అనేవి, ప్రబలంగా వున్న భౌతిక సంబంధాలకు ఖచ్చితమైన వ్యక్తీకరణ తప్ప ఇంకేమీ కాదు." (జర్మన్ ఐడియాలజీ, పేజీ–67) మార్క్స్, ఎంగెల్సులు చెప్పిన భావాన్నే, గ్రాంష్సీ గానీ, ఇంకో కమ్యూనిస్టు గానీ చెప్పగలిగారు గానీ, వర్గాతీతమైన భావాన్నయితే చెప్పలేదు! కాబట్టి, 'సంప్రదాయ మార్క్సిజం' అనీ, 'సాంస్కృతిక మార్క్సిజం' అని వేరే వేరే పేర్లు పెట్టినంత మాత్రాన, మార్క్సిజపు సారాంశం మారదు.

(3) "అనేక దేశాల్లో ఆర్థిక అసమానతలున్నా, వర్గ పోరాటాలు జరగలేదు."– అని వ్యాసకర్త వ్యాఖ్య! అవి జరగలేదంటే, అది మార్క్సిజంలో లోపం కాదు. వర్గ పోరాటాలు అనేవి, పగలూ–రాత్రీలా, అమావాస్యా– పౌర్ణమీలా, ప్రకృతి సహజంగా జరగవు! వర్గ పోరాటాల కోసం, శ్రామికవర్గ పార్టీలైన కమ్యూనిస్టు పార్టీలకు, మార్క్సిస్టు సిద్ధాంత గ్నానంతో, నడిచే సామర్థ్యాలు బలహీనపడి ఉండవచ్చు! అలా జరగలేదు కాబట్టి, 'సాంస్కృతిక మార్క్సిజం' అనే భావన వచ్చిందనడం తప్పు! వర్గ పోరాటాలలోకి శ్రామిక జనాల్ని సమీకరించడానికి, కావలిసిన వర్గ చైతన్యం ప్రాధాన్యతను నొక్కి చెప్పే సందర్భంలో, గ్రాంష్సీ 'సాంస్కృతిక పెత్తనం' అనే మాటని వాడాడు. సంస్కృతి అంటే భావజాలం. శ్రామిక జనాల మీద పాలక వర్గ సంస్కృతి పెత్తనాన్ని ఎదుర్కోవడానికి శ్రామిక వర్గ మేధావులు కృషి చెయ్యాలని చెప్పిన సందర్భం అది! ఈ భావన, మార్క్స్ ఎంగెల్సులు చెప్పని భావన కాదు. ఉదాహరణకి, సమాజానికి ఒక పునాదీ (ఆర్థిక సంబంధాలు), ఆ పునాదికి అనుగుణమైన, ఉపరితలం (సంస్కృతీ, రాజకీయాలూ, మతం మొదలైనవి) ఉంటాయని మార్క్స్, ఎంగెల్సులు గతంలోనే చెప్పివున్నారు.

(4) "హిందూ మతం, కులాన్ని నిర్మించిందన్నది అసత్య ప్రచారం" అని వ్యాసకర్త వాదన. హిందూ మత గ్రంథాలలో నాలుగు వర్ణాల గురించే రాశారట గానీ, కులాల గురించి చెప్పలేదట! ఏ మతాల్లోనూ లేని ఆ వర్ణ వ్యవస్థ హిందూ సమాజంలో మాత్రమే ఉందంటే, అది హిందూ మతానికి వున్న ప్రత్యేక లక్షణమే! వర్ణ వ్యవస్థ మానవుల్ని ఎలా విభజించిందో చూడండి! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనేవే ఆ నాలుగు వర్ణాలూ. ఇవన్నీ అసమాన వర్ణాలే! వాటిల్లోని అసమానత్వమే, అనేక వేల కులాలు ఏర్పడడానికి దారి తీసింది. అసలు గ్రహించవలసింది: వర్ణ వ్యవస్థలో గానీ, కుల వ్యవస్థలో గానీ వున్నదంతా, అసమాన శ్రమ విభజనే! అసమాన శ్రమ విభజన అంటే, మానవుల్లో కొందరు ఎక్కువ విలువ గలిగిన మేధా శ్రమలూ; కొందరు తక్కువ విలువ గలిగిన శారీరక శ్రమలూ; కొందరు ఎప్పుడూ మురికిని శుభ్రం చేసే శ్రమలు చేయవలిసి రావడం, కొందరు ఆ రకం పనులు ఎప్పుడూ చెయ్యకపోవడం... ఇలాంటి పరిస్థితే అసమాన శ్రమ విభజన! అయితే, ఈ అసమాన శ్రమ విభజన అనేది, ప్రపంచ వ్యాప్తంగా, అన్ని మతాలలోనూ వున్నప్పటికీ, హిందూ మతం మాత్రమే వర్ణ వ్యవస్థని ఎందుకు కౌగలించుకుందో ఊహించుకోవలిసిందే! ఇప్పుడు మనం చెయ్యవలిసిందల్లా, కుల సంస్కృతిని చీదరించుకోవడమే! దాన్ని నిర్మూలించడమే!

> అసలు గ్రహించవలసింది: వర్ణ వ్యవస్థలో గానీ, కుల వ్యవస్థలో గానీ వున్నదంతా, అసమాన శ్రమ విభజనే! అసమాన శ్రమ విభజన అంటే, మానవుల్లో కొందరు ఎక్కువ విలువ గలిగిన మేధా శ్రమలూ; కొందరు తక్కువ విలువ గలిగిన శారీరక శ్రమలూ; కొందరు ఎప్పుడూ మురికిని శుభ్రం చేసే శ్రమలు చేయవలిసి రావడం, కొందరు ఆ రకం పనులు ఎప్పుడూ చెయ్యకపోవడం... ఇలాంటి పరిస్థితే అసమాన శ్రమ విభజన! అయితే, ఈ అసమాన శ్రమ విభజన అనేది, ప్రపంచ వ్యాప్తంగా, అన్ని మతాలలోనూ వున్నప్పటికీ, హిందూ మతం మాత్రమే వర్ణ వ్యవస్థని ఎందుకు కౌగలించుకుందో ఊహించుకోవలిసిందే! ఇప్పుడు మనం చెయ్యవలిసిందల్లా, కుల సంస్కృతిని చీదరించుకోవడమే! దాన్ని నిర్మూలించడమే!





(5) 'ఈనాడు చాలా మంది కుల వృత్తులలో లేరనడానికి ఉదాహరణగా, క్షవరం చేసే వృత్తిలో ముస్లిములే చాలామంది వున్నారని వ్యాసకర్త వాదన. అంటే, హిందువుల్లో, కులవృత్తుల్లో వున్నవారు తగ్గిపోయారని, తేల్చే ప్రయత్నం! జనాభా లెక్కల్ని ఆధారం చేసుకుని, 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక, 2018 డిసెంబరు 22న ఇచ్చిన వివరాల ప్రకారం, కులం అనేది ఇప్పటికీ, వృత్తుల్ని ఎంచుకోవడంలో, ప్రధానమైన అడ్డంకిగా వుంది–అని! ఉత్తరప్రదేశ్‌లో జనాభా లెక్కల ప్రకారం: తోలు పరిశ్రమల్లో (లెదర్ ఇండస్ట్రీస్) పని చేసే 46 వేల మందిలో, 41 వేల మంది, ఎస్సీ కులస్తులే! అదే సమయంలో, రాజస్తాన్‌లో 76 వేల మంది స్వీపర్లుగా వుంటే, వారిలో 52 వేల మంది ఎస్సీలే!

(6) 'అద్వానీ రథయాత్ర సమయంలో, వి.పి.సింగు ప్రభుత్వం మండల్ కమిటీ నివేదికను అమలు చేసిందని' వ్యాసకర్త చేసిన వ్యాఖ్య వాస్తవ విరుద్ధం. ఆ నివేదికను వి.పి.సింగు పార్లమెంటులో ప్రవేశపెట్టినది, రథయాత్రకు పూర్వమే. 1990 ఆగస్టు 7న. రథయాత్ర ప్రకటన వచ్చింది ఒక నెల తర్వాత, సెప్టెంబరు 12న. ఎయిర్ కండిషనర్లు బిగించిన టొయోటా వ్యానుతో 'రథయాత్ర' మొదలైనది, సెప్టెంబరు 25న.

(7) కుల గణన వల్ల భారతీయ సంస్కృతీ మూలాలు నశించే అవకాశం వుంది–అని వ్యాసకర్త వాపోయారు. కుల వ్యవస్థను సృష్టించినదే హిందూ సంస్కృతి కాబట్టి, కుల గణన వలన భారతీయ సమాజానికి ఏమీ నష్టం జరగదు. ఎందుకంటే, కుల గణన కోరే వారి ఉద్దేశం, కులాల జనాభాని బట్టి ఆర్థిక, రాజకీయ అవకాశాలు పొందాలి–అన్నదే! అందుచేత, కులాల నాయకులు ఇప్పుడున్న దోపిడీ రాజ్యాంగ యంత్రంలోనే, అధికారులుగా, ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా, పదవులకోసం ప్రయత్నిస్తారు. ఆ ప్రయోజనం కోసం, ఎల్లకాలమూ కులాలు నిలిచివుండేలా చూసుకుంటారు. నష్టం అంటూ జరిగితే, కులాల వారీగా కాకుండా, మతాల వారీగా, అది కూడా, మెజారిటీ మతస్తుల ఓట్లకోసం ప్రయత్నించే మతతత్వ రాజకీయ పార్టీలకి తలనొప్పే. మతతత్వ వాద పార్టీలకు కావలిసింది 'మత గణన'.

(8) ఈ కులగణనను మార్క్సిస్టులే వెనక వుండి రాజకీయ పార్టీల చేత చేయిస్తున్నారు – అని, వ్యాసం చివరిలో, వ్యాసకర్త అనుమానం! అది పూర్తిగా తప్పు. ఎందుకంటే, 'శ్రమ దోపిడీ'ని శ్రామిక వర్గ పోరాటాల ద్వారా నిర్మూలిస్తూ, అసమాన శ్రమ విభజనను మార్చడం ద్వారా కుల వ్యవస్థను కూల్చే లక్ష్యం గల కమ్యూనిస్టులు, కుల గణన మీద భ్రమలు పెట్టుకోరు! 'వర్గ గణన' మీద ఆధారపడి, వారు తమ కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. అలాగే, "మనమంతా హిందువులం! మనమంతా బంధువులం!" అనే నినాదంతో, కుల గణనను వ్యతిరేకించే పార్టీలను నమ్మవద్దని కూడా శ్రామిక జనాలకు కమ్యూనిస్టులు వివరిస్తారు.

(9) ఆరెస్సెస్ వాళ్ళూ బీజేపీ వాళ్ళూ తరుచుగా జపించే 'భారతీయ సంస్కృతి', 'జాతీయ భావన' అనే మాటలు, ఈ వ్యాసంలో కూడా కనిపించాయి. వాస్తవంలో, హిందూ మతస్తులందరూ, భారతీయ సమాజం అంతా, ఒకే రాయితో చేసిన శిల్పం కాదు. ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ, అన్ని సమాజాల్లోనూ, అన్ని మతాల్లోనూ వున్నట్టే, ఇక్కడా ధనిక–పేద తేడాలూ, స్త్రీ–పురుష అసమానత్వమూ, మూఢ నమ్మకాలూ, ఇలా అన్ని చెడుగులూ వున్నాయి. కుల వ్యవస్థ అనేది, ఇక్కడ అదనంగా వున్న చెడ్డ లక్షణం! అన్ని దేశాలలోనూ వున్నట్టే, ఈ దేశంలోనూ, లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూ అనే 'శ్రమ దోపిడీ' ఆదాయాల మీద బ్రతికే సంస్కృతే, దోపిడీ వర్గానికి మూలం! ఏదో ఒక రకమైన శ్రమ చేస్తూ, జీతాల మీద బ్రతికే పేదల సంస్కృతీ వుంది. అలాంటప్పుడు భారతీయ సంస్కృతి, ఇతర దేశాల సంస్కృతి నించీ వేరుగా వుండదు.

(10) "కులగణన వల్ల ఎవరికి లాభం?" అని ప్రశ్నించిన వ్యాసకర్తకి, మత గణన వల్ల ఎవరికి లాభం? అని కూడా ప్రశ్నించాలని తోచలేదు. 2022లో, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో, బీజేపీ రాజ'యోగి' (ముఖ్యమంత్రి), 'ఈ ఎన్నికలు 80 శాతానికీ, 20 శాతానికీ మధ్య పోరాటం!' అనడం, 'మత గణన' దృష్టితో కాదా? ఇలాంటి ప్రకటనలు, దేశ ప్రజల్ని కలిపి వుంచుతాయా, విభజిస్తాయా?

• రంగనాయకమ్మ

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.3 కనిష్ఠం 18.6

16న సింగూరు నీళ్లు బంద్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న హైదరాబాద్ మహానగరానికి సింగూరు జలాలు నిలిచిపోనున్నాయి. ఆరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పెద్దాపూర్ పంప్‌హౌస్ నిర్వహణ పనులు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నాలుగు గంటల పాటు షేక్‌పేట, బోరబండ రిజర్వాయర్, లింగంపల్లి రిజర్వాయర్ ప్రాంతాల్లోని ప్రాంతాలకు సింగూరు జలాలు నిలిచిపోనున్నాయి. బంజారాహిల్స్, ఎర్రగడ్డ రిజర్వాయర్ల ప్రాంతాల్లో అంతరాయం తలెత్తనుంది.

చిట్టిచేతులు చేసిన కాగితపు బొమ్మలు



ఎన్టీఆర్ స్టేడియం గద్దర్ ప్రాంగణంలో కొనసాగుతున్న బుక్‌ఫెయిర్ మంగళవారం వినూత్న కార్యక్రమాలకు వేదికగా మారింది. బాలవికాస్ కార్యక్రమంలో భాగంగా రవ్వా శ్రీహరి వేదికపై నిర్వహించిన 'క్రాఫ్ట్ వర్క్స్'లో విద్యార్థినీ విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. తమ ఆలోచనలకు పదును పెట్టారు. రకరకాల కాగితపు బొమ్మలను, కళాకృతులను తయారు చేశారు. అభ్యుదయ, మదర్స్ ఇంటిగ్రల్, మహాబోధి, శ్రీ మేధ పాఠశాల విద్యార్థులు, మదర్స్ ఇంటిగ్రల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఈ వేడుకలో భాగస్వాములు అయ్యారు. ఈ సందర్భంగా బాలల సాహిత్య రచయిత చొక్కాపు వెంకటరమణ, బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షుడు కోయ చంద్రమోహన్ మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ పోటీలు దోహదపడతాయని తెలిపారు. అనంతరం చిన్నారులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందించారు.

మరిన్ని విశేషాలు.. 6లో

కెమికల్ పరిశ్రమలో పేలుడు..



- పది మందికి తీవ్ర గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- మరో ఇద్దరి ఆచూకీ గల్లంతు

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 13: పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ కంపెనీలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో పది మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరు కార్మికుల ఆచూకీ తెలియకపోవడం ఆందోళన కలిగిస్తోంది. స్థానికులు, కార్మికుల కథనం ప్రకారం.. సీఎంహెచ్

మిగతా 6వ పేజీలో..



సమావేశంలో మాట్లాడుతున్న సినీనటుడు సిద్దు

కార్యక్రమానికి హాజరైన సీపీ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

హెల్మెట్, సీటుబెల్ట్ వల్లే ప్రాణాలతో బయటపడ్డా

- వాహనం బాధ్యతతో నడపాలి : సినీనటుడు సిద్దు

హైదరాబాద్ సిటీ/కార్వాన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): 'హెల్మెట్, సీటుబెల్ట్ పెట్టుకోవడం వల్ల నేను రెండుసార్లు ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే డీజే టిల్లూలా మీ ముందుకు వచ్చి ఎంటర్‌టైన్ చేసేవాడిని కాదు' అని సినీనటుడు సిద్దు జొన్నలగడ్డ తెలిపారు. హైదరాబాద్ సిటీ ట్రాఫిక్‌పోలీసులు గుడిమల్కాపూర్‌లోని కింగ్‌ప్యాలెస్ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన జాతీయ రోడ్డు సేఫ్టీ మాసోత్సవం కార్యక్రమానికి సిద్దు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూడళ్లలో ట్రాఫిక్ నిబంధనలు తెలిపే వాయిస్ రికార్డింగ్ అవేర్‌నెస్ సీడీని ఆవిష్కరించారు. అనంతరం సిద్దూ మాట్లాడుతూ.. 'ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు స్నేహితులతో కలిసి కీసరగుట్టలో ఎగ్జామ్ రాసి ఈసీఐఎల్‌కు బైక్‌పై వస్తున్న క్రమంలో మా ఫ్రెండ్ బైక్ నన్ను ఓవర్‌టేక్ చేసింది. దాంతో నేను స్పీడుగా వెళ్లి వారిని ఓవర్‌టేక్ చేస్తుండగా రెండు బైక్ హ్యాండిళ్లు ఢీకొన్నాయి. 70-80 స్పీడ్‌లో ఉన్నాం. ఇద్దరం కిందపడ్డాం. నా హెల్మెట్ ఒకవైపు విరిగింది. మరోవైపు పెద్ద హోల్ పడింది. నేను మాత్రం ప్రాణాలతో బయటపడ్డా. విరిగిన హెల్మెట్‌ను చూస్తే ఇది నా తల, ఇది నా పుర్రె అనిపించింది. అది లేకపోతే నేను ఉండేవాడిని కాను' అన్నారు.

కారు పల్టీకొట్టినా బతికి బయటపడ్డాం..

'మరోసారి రాజమండ్రికి వెళ్లి వస్తున్న క్రమంలో మా వాళ్లు ఒకరు కారు డ్రైవ్ చేస్తున్నారు. మార్గమధ్యలో ఒక బైక్ సడెన్‌గా రోడ్డుమధ్యలోకి

మిగతా 4వ పేజీలో..

క్రమశిక్షణతో వాహనాలు నడపాలి..

వాహనదారులు క్రమశిక్షణతో వాహనాలు నడపాలి. హైదరాబాద్ ఎంతో గొప్ప పేరున్న నగరం. అలాంటి నగరంలో ట్రాఫిక్ కంట్రోల్ చేయాల్సిన బాధ్యత సిటీ పోలీసులపై ఉంది. అందుకు వాహనదారులు సహకరించాలి. ఆటో, ట్రక్కు డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడానికి ముందుకొచ్చిన సరోజినీదేవి, మ్యాక్స్‌విజన్, ఎస్‌డీ కంటి ఆస్పత్రి యాజమాన్యాలకు అభినందనలు.

\- కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, సీపీ, హైదరాబాద్.

బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

- గ్రేటర్‌లో గులాబీ పార్టీ నుంచి వలసలు



- కాంగ్రెస్‌లో చేరేందుకు నేతల ఆసక్తి
- ఇప్పటికే చేరిన మాజీ డిప్యూటీ మేయర్
- త్వరలో మాజీ మేయర్
- తాజాగా సీఎంను కలిసిన ప్రస్తుత డిప్యూటీ మేయర్
- త్వరలో మరి కొందరు కార్పొరేటర్లు..?
- జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో మారుతున్న బలాబలాలు
- బీఆర్ఎస్ నుంచి వెళ్లింది 8 మంది.. చేరనున్న మరో ఇద్దరు
- బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి ఆరుగురు
- అవిశ్వాసానికి అవకాశముందా..?

అసెంబ్లీ ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధించామని చెప్పుకుంటున్న బీఆర్ఎస్‌కు మహానగరంలో ఊహించని షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే మాజీ మేయర్, మాజీ డిప్యూటీ మేయర్ కాంగ్రెస్ బాట పట్టగా, తాజాగా ప్రస్తుత డిప్యూటీ మేయర్ అదే దారిలో నడుస్తున్నారు. శ్రీలతా శోభన్‌రెడ్డి దంపతులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. దీంతో వారు రెండు, మూడు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరే అవకాశముందని సన్నిహితులు చెబుతున్నారు. ఇటీవల సీఎంను కలిసిన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన సతీమణి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కూడా త్వరలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతాయని అధికారపార్టీ వర్గాలు చెబుతున్నాయి.

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పరిణామాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో పార్టీల బలాబలాలు మారుతున్నాయి. 2020 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ 56, బీజేపీ-48, ఎంఐఎం-44, కాంగ్రెస్ రెండు డివిజన్లలో విజయం సాధించాయి. అనంతరం బీజేపీకి చెందిన లింగోజిగూడ కార్పొరేటర్ ఆకుల రమేష్‌గౌడ్ హఠాన్మరణంతో నిర్వహించిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి గెలుపొందారు. దీంతో కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం మూడుకు చేరింది. జూలై 2022లో నగరంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు జరిగిన సమయంలో ఆ పార్టీకి చెందిన హస్తినాపురం, జూబ్లీహిల్స్, అడిక్‌మెట్, రాజేంద్రనగర్ కార్పొరేటర్లు బానోతు సుజాతనాయక్, దేరంగుల వెంకటేష్, సునితా ప్రకాష్‌గౌడ్, అర్చనాప్రకాష్‌గౌడ్‌లు బీఆర్ఎస్(అప్పటి టీఆర్ఎస్)లో చేరారు. అనంతరం గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ అనారోగ్యంతో మరణించారు. దీంతో కౌన్సిల్‌లో బీజేపీ బలం 42కు తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఊహించని పరిణామాలు జరిగాయి. బీఆర్ఎస్ నుంచి కొందరు కాంగ్రెస్‌లోకి, బీజేపీకి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఖైరతాబాద్, మాదాపూర్, హఫీజ్‌పేట కార్పొరేటర్లు విజయారెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, పూజిత కాంగ్రెస్‌లో చేరారు. విజయారెడ్డి ఖైరతాబాద్ నియోజకవర్గం, జగదీశ్వర్‌గౌడ్ శేరిలింగంపల్లి నియోజకవర్గాల నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో నిలిచారు. మల్కాజిగిరికి చెందిన మచ్చబొల్లారం, ఈస్ట్ ఆనంద్‌బాగ్, కాప్రా డివిజన్ల కార్పొరేటర్లు రాజ్‌జితేంద్రనాథ్, ప్రేమ్‌కుమార్, స్వర్ణరాజ్‌లు మైనంపల్లి హన్మంతరావు వెంట హస్తం గూటికి చేరారు. స్థానిక ఎమ్మెల్యేతో విభేదాల నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఎన్నికలకు ముందు జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 10కి

మిగతా 4వ పేజీలో..

జీహెచ్ఎంసీలో పార్టీల వారీగా బలాబలాలు...

బీఆర్ఎస్	52
ఎంఐఎం	42
బీజేపీ	40
కాంగ్రెస్	11 (శ్రీలత, శ్రీదేవి చేరితే 13)
మొత్తం - 147 (మూడు డివిజన్లలో ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది)	

ఎక్స్‌అఫీషియో బలాబలాలు

ఎమ్మెల్యేలు		ఎంపీలు
బీఆర్ఎస్-	16	బీఆర్ఎస్-1
ఎంఐఎం	7	ఎంఐఎం-1
బీజేపీ	1	బీజేపీ-1

నోట్ : నామినేటెడ్ రాజ్యసభసభ్యులు, ఎమ్మెల్సీలకు రాష్ట్రంలో ఏదైనా ఒక కార్పొరేషన్‌లో ఎక్స్‌అఫీషియోలుగా కొనసాగే అవకాశముంది. ఫిబ్రవరి 2021లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 32, ఎంఐఎంకు 10, బీజేపీకి -2 సీట్లతో కలిపి మొత్తం 44 మంది ఎక్స్‌అఫీషియోలుగా ఉన్నారు. గతంలో ఎక్స్‌అఫీషియోలుగా నమోదు చేసుకున్న వారిలో కొందర పదవీ కాలం ముగిసింది. కొత్తగా కొందరు నామినేట్ అయ్యారు. ఈ నేపథ్యంలో వారు ఎక్కడ ఎక్స్‌అఫీషియోలుగా కొనసాగుతారనే దానిని బట్టి ఆ సంఖ్యలో మార్పులుంటాయి.

రాష్ట్రంలో అలా.. జీహెచ్ఎంసీలో ఇలా..



రాష్ట్రంలో పలు కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాసాల నేపథ్యంలో గ్రేటర్‌లో ఏం జరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది. తాజా బలాబలాల నేపథ్యంలో అధికార పార్టీ గ్రేటర్ పీఠం దక్కించుకోవడం అంత సులువు కాదు. కాంగ్రెస్ సభ్యుల సంఖ్య కేవలం 11 మాత్రమే ఉండడం.. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉండే ఎమ్మెల్యేలూ నగరంలో ఆ పార్టీకి లేకపోవడంతో అవిశ్వాసాల జోలికి వెళ్లే అవకాశం లేదు. బీఆర్ఎస్ నుంచి మరో 10-14 మంది కార్పొరేటర్లతో కాంగ్రెస్ సంప్రదింపులు జరుపుతుందన్న ప్రచారం జరుగుతోంది. వారిలో ఎంత మంది హస్తం గూటికి వెళ్తారు అన్నది తేలాల్సి ఉంది. జీహెచ్ఎంసీలో ఎంపీలు, ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలకు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఓటు హక్కు ఉంటుంది. గ్రేటర్‌లో 30 మందికిపైగా (సుమారు) ఎక్స్‌అఫీషియో సభ్యుల బలం బీఆర్ఎస్‌కు ఉంది. ఆ పార్టీకి ప్రస్తుతం ఉన్న కార్పొరేటర్ల సంఖ్య 52. మొత్తంగా కౌన్సిల్‌లో బీఆర్ఎస్ బలం రమారమిగా 82. ప్రస్తుత మేయర్ ఎన్నిక సమయంలో బీఆర్ఎస్.. ఎంఐఎం మద్దతు తీసుకుంది. అధికారం మారిన నేపథ్యంలో అవిశ్వాసం పెడితే ఎంఐఎం ఎవరి వైపు నిలుస్తుందన్నది ఆసక్తికరం కానుంది. ప్రస్తుత బలాలను పరిగణనలోకి తీసుకుంటే కాంగ్రెస్, ఎంఐఎం కలిసినా గ్రేటర్ మేయర్ పీఠాన్ని దక్కించుకునే అవకాశం లేదు. అవిశ్వాసం పెట్టిన పక్షంలో బీజేపీ కూడా వారికి మద్దతిస్తే బీఆర్ఎస్ మేయర్ పదవిని కోల్పోవాల్సి వస్తుంది. కాంగ్రెస్, ఎంఐఎం కలిసినా.. కాంగ్రెస్, బీజేపీ కలిసినా.. పీఠం దక్కడం అసాధ్యమే.

పీవీకి భారతరత్నపై హర్షం



పీవీకి భారతరత్నపై హర్షం వ్యక్తం చేస్తూ చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్న తనికెళ్ల భరణి, జొన్నవిత్తుల తదితరులు

6

ఏడో నిజాం మనవడికి బెదిరింపులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదంలో నిజాం మనవడిని ఓ వ్యక్తి బెదిరించడంతో పాటు దూషించాడు. మణికొండ డైమండ్‌హిల్స్‌లో నివాసముండే దిల్‌షాద్‌జా (హెచ్‌ఈహెచ్) 7వ నిజాం మనవడు. అతనికి వరుసకు సోదరుడైన ప్రిన్స్‌షామత్ అలీఖాన్ గతేడాది మృతి చెందారు. ప్రిన్స్‌షామత్‌ది సహజ మరణం కాదంటూ అతడి వద్ద 15 ఏళ్లపాటు పనిచేసిన సయ్యద్ అజీజ్ ఖాద్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దిల్‌షాద్‌జాతో పాటు అతని బావపై అనుమానం వ్యక్తం చేశాడు. ప్రిన్స్‌తో బలవంతంగా సంతకాలు చేయించుకుని ఆస్తులను కొట్టేయాలని సయ్యద్ పథకం వేశాడని పేర్కొంటూ దిల్‌షాద్‌జా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందుకే ప్రిన్స్‌షామత్ మరణంపై అనుమానాలు అంటున్నారని అందులో పేర్కొన్నారు. ఇదిలాఉండగా ఈ నెల 9న దిల్‌షాద్‌జా ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా సయ్యద్ అడ్డుకుని రూ. కోటి ఇస్తా కేసు విత్‌డ్రా చేసుకోవాలని కోరాడు. దీనికి దిల్‌షాద్‌జా ఒప్పుకోలేదు. దీంతో చంపేస్తానని బెదిరించడంతో పాటు దుర్భాషలాడాడు. ఈ మేరకు దిల్‌షాద్‌జా సయ్యద్‌పై ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమకు స్వాగతం



నచ్చిన చెలికి.. మెచ్చిన బహుమతి ఇచ్చి ప్రేమికుల రోజుకు స్వాగతం చెప్పేందుకు నగర యువత సిద్ధం అవుతోంది. అలాంటి వారి కోసమే అంటూ.. రోజాపూల మధ్య చామంతులతో ఐ లవ్ యూ అని అమరుస్తూ బొకేను తయారుచేస్తున్న పంజాగుట్టలోని ఓ వ్యాపారి.

అర్హతకు తగ్గ ఉద్యోగాలివ్వండి

- సీఎం ఇంటి వద్ద అభ్యర్థుల వేడుకోలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అర్హతకు తగ్గ ఉద్యోగాల కోసం ఎనిమిదేళ్లుగా నిరీక్షిస్తున్నా ప్రభుత్వాలు తమను పట్టించుకోవట్లేదని జిల్లా పరిషత్‌లలో కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసిన పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం 25 జిల్లాల నుంచి దాదాపు 60 మంది సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వచ్చారు. సీఎం వద్దకు వెళ్లేందుకు అధికారులు అవకాశం కల్పించకపోవడంతో రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడికి వినతిపత్రమిచ్చారు. అనంతరం బేగంపేటలోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌కు చేరుకొని వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ.. జిల్లా పరిషత్తులకు చెందిన కారుణ్య నియామక అభ్యర్థులకు ఎనిమిదేళ్లుగా అర్హతకు తగ్గ ఉద్యోగాలివ్వలేదని, ఖాళీలు లేవనే సాకుతో డిగ్రీ, ఆపై విద్యార్హత ఉన్నప్పటికీ ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు తీసుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. కారుణ్య నియామకాల్లో జిల్లాకో న్యాయం ఉంటుందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో.. కారుణ్య నియామకాలు ఇచ్చి మిగతా జిల్లాల వారికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 650 మంది అభ్యర్థులు ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్నారని వివరించారు


కుతుబ్‌షాహీ టూంబ్స్.. డిజిటల్ ట్విన్




- చారిత్రక కట్టడాలకూ ఉపయోగపడుతుందని ఇప్పుడే తెలిసింది : జయేష్ రంజన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శక్తివంతమైన డ్రోన్ స్కానర్లను వినియోగించి కేవలం ఎనిమిది నిమిషాల్లో కుతుబ్‌షాహీ టూంబ్స్‌కు డిజిటల్ ట్విన్ (టూంబ్స్ కచ్చితమైన పరిమాణంతో ప్రతీ అంగుళాన్నీ డిజిటల్‌రూపంలో నకళ్ల తయారుచేయడం) పూర్తి చేశారు. అత్యాధునిక జియో రిఫరెన్సింగ్ సాంకేతికతలను వినియోగించి కుతుబ్‌షాహీ టూంబ్స్‌లో సెంటీమీటర్ పరిమాణానికి కూడా డిజిటల్ ట్విన్ తీర్చిదిద్దినట్లు హెక్సాగాన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యశాఖల ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ మాట్లాడుతూ డిజిటల్ ట్విన్‌ను లైఫ్‌సైన్సెస్ పరంగా మాత్రమే చూశామని, చారిత్రక కట్టడాల పరంగా కూడా వాడవచ్చనే అంశాన్ని హెక్సాగాన్ చూపి అద్భుతాన్ని సృష్టించిందని కొనియాడారు. డిజిటల్ హెరిటేజ్ ఫర్ స్మార్ట్‌సిటీస్ ప్రాజెక్ట్‌లో భాగంగా కుతుబ్‌షాహీ టూంబ్స్‌ను డిజిటల్ ట్విన్ చేసినట్లు తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ ప్రాజెక్ట్‌ను వారు చేపట్టారన్నారు. హెక్సాగాన్ సీఈఓ, అధ్యక్షుడు పాలో గుగ్లీల్మినీ మాట్లాడుతూ చారిత్రక ప్రాధాన్యం కలిగిన కుతుబ్‌షాహీటూంబ్స్‌ను డిజిటల్ ట్విన్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా చారిత్రక కట్టడాలను డిజిటల్‌గా రక్షించాలనే ప్రయత్నంలో ఈ ప్రాజెక్ట్ ఓ భాగమని తెలిపారు. హెక్సాగాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఆర్‌అండ్‌డీ హెడ్ నవనీత్ మిశ్రా మాట్లాడుతూ కుతుబ్‌షాహీ టూంబ్స్‌కు దాదాపు 10.7 బిలియన్ డాటా పాయింట్లు, 100కు పైగా స్కానింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి 10వేల చదరపు మీటర్ల ప్రాంగణాన్ని పూర్తిగా స్కాన్ చేశామన్నారు. తమ బృందం అత్యాధునిక పరికరాలను, సైక్లోన్ 3డీఆర్ వంటి సాఫ్ట్‌వేర్లను వినియోగించిందని వెల్లడించారు.







పిచ్చి కుక్క దాడిలో ఒకే రోజు
14 మందికి గాయాలు


గాయాన్ని చూపుతున్న బాధితుడు నర్సింహ


రాజేంద్రనగర్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): ఒకే రోజు పిచ్చి కుక్క దాడిలో 14 మంది గాయపడ్డారు. రోడ్డు వెంట వెళ్తున్న వారిని వెంబడించి మరీ కరిచింది. మంగళవారం ఉదయం శ్రీమాతా పోచమ్మ ఆలయం వద్ద టీ అమ్ముకుంటున్న ఎం. రమేష్(35)ను, అక్కడే ఆడుకుంటున్న కౌశిక్ కుమార్(4)ను కరిచింది. అనంతరం అక్కడి నుంచి రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(నార్మ్) మెయిన్ గేటు వైపునకు వెళ్లి అక్కడ సెక్యూరిటీ అధికారిపై దాడి చేసి కరిచింది. తిరిగి పోచమ్మ దేవాలయం వీధిలోకి వచ్చిన కుక్క.. ఆ దారిన పోతున్న ఎస్‌కేసింగ్, రామకృష్ణ, రమేశ్, శరత్‌కుమార్, చెన్నయ్య, మల్లిక, అండాలు, నరేందర్, రాజ్‌వీర్, యాదగిరి, షాకీర్, రంగన్న, కౌశిక్ కుమార్, రాజులను కరిచింది. వారందరూ రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రాగా, టీకాలు ఇచ్చామని డాక్టర్ సుగుణ తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్

(3వ పేజీ తరువాయి)

చేరింది. బీజేపీ నుంచి బాగ్‌అంబర్‌పేట, హిమాయత్‌నగర్ కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, గడ్డం మహాలక్ష్మిగౌడ్‌లు గులాబీ గూటికి చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో చేరికలు మళ్లీ మొదలయ్యాయి. మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఇటీవల కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి తాజాగా సీఎంను కలిశారు.

వీరు కాంగ్రెస్‌లో చేరడం దాదాపుగా ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రామ్మోహన్‌తోపాటు ఆయన సతీమణి, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హస్తం గూటికి వెళ్లే అవకాశముంది. వారిద్దరూ చేరితే కాంగ్రెస్ బలం 13కు పెరుగనుంది. చేరికలు, వలసలతో బీఆర్‌ఎస్ బలం ప్రస్తుతం 52గా ఉంది. ఎంఐఎంకు చెందిన మెహిదీపట్నం, శాస్త్రిపురం కార్పొరేటర్లు మాజిద్ హుస్సేన్, మహ్మద్ మొబిన్‌లు నాంపల్లి, బహదూర్‌పురా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. దీంతో ఎంఐఎం సభ్యుల సంఖ్య 42కు తగ్గింది.





హెల్మెట్, సీటుబెల్ట్ వల్లే ప్రాణాలతో బయటపడ్డా

(3వ పేజీ తరువాయి)

వచ్చింది. కారు సడన్ బ్రేక్ కొట్టడంతో 360 డిగ్రీలు తిరిగి ఉల్టాపల్టా పడింది. కానీ ఎవరికీ ఏం కాలేదు. ఒంటిమీద ఒక్క గీతకూడా పడకుండా బతికి బయటపడ్డాం. కారణం అందరం సీటుబెల్టు పెట్టుకున్నాం. ఈ రెండు ప్రమాదాల్లో నేను ప్రాణాలతో బయటపడ్డానంటే కారణం, హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోవడం వల్లనే..' అని సిద్ధూ వివరించారు. వాహనదారులు హెల్మెట్ బరువు కాదు.. బాధ్యత అనుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుబ్బారాయుడు, ట్రాఫిక్ డీసీపీ-1, అశోక్‌కుమార్ డీసీపీ ట్రాఫిక్-2, డాక్టర్ బుషిరెడ్డి శంకర్‌రెడ్డి రోటరీ క్లబ్ గవర్నర్ ఆఫ్ సికింద్రాబాద్ పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ఆటో, ట్రక్కు, ఇతర డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

- విశ్వప్రసాద్, అడిషనల్ సీపీ, ట్రాఫిక్

ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. అప్పుడే రోడ్డు ప్రమాదాలను అరికట్టొచ్చు. వాహనాలను రోడ్డుమీద ఇష్టానుసారంగా పార్కు చేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అందరికీ ఎమర్జెన్సీ ఉంటుంది. నిబంధనలు పాటించి వాహనాలు నడిపితేనే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేయగలం.

సమ్మర్ డిమాండ్

- 4 వేల మెగా వాట్లు.!
- నిరంతర సరఫరాకు చర్యలు: సీఎండీ ఫరూఖీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సమ్మర్‌లో డిమాండ్ ఏ స్థాయిలో పెరిగినా నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పేర్కొన్నారు. వేసవిలో గ్రేటర్ విద్యుత్ డిమాండ్ 4 వేల మెగావాట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గతేడాదితో పోల్చితే విద్యుత్ డిమాండ్ పెరిగిందని, మార్చి, ఏప్రిల్ నెలల్లో మరింత పెరిగే అవకాశముంటుందన్నారు. సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఫిబ్రవరి 7 నాటికి విద్యుత్ మరమ్మతులు పూర్తిచేశామని, గ్రేటర్‌లో 1494 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లలో 44 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎల్‌టీ లైన్స్‌లో అదనంగా 237 కిలోమీటర్లు ఏబీ కేబుల్, 109 కిలోమీటర్ల ఓవర్ హెడ్ విద్యుత్‌లైన్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. వేసవి డిమాండ్‌కు తగినట్లు 19 ప్రాంతాల్లో 33కేవీ విద్యుత్ లైన్లు బైఫర్‌కేషన్ చేయడంతో పాటు అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులు 8.89 కిలోమీటర్ల మేర పూర్తిచేసినట్లు తెలిపారు. 228 ప్రాంతాల్లో 11 కేవీ విద్యుత్ లైన్లు, 25.1 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్‌కేబుల్ పనులు, 41.9 కిలోమీటర్ల ఏబీ కేబుల్, 149.9 కిలోమీటర్ల ఓవర్‌హెడ్ లైన్లు వేసినట్లు సీఎండీ తెలిపారు. ఫిబ్రవరి 15 నాటికి విద్యుత్ బిల్లుల జారీతోపాటు గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలన పూర్తిచేస్తామని సీఎండీ తెలిపారు. సైబర్‌సిటీ, మేడ్చల్‌తోపాటు పలు సర్కిళ్లలో 80 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని, రెండు రోజుల్లో 100 శాతం పూర్తి చేస్తామన్నారు.

నల్గొండ సభకు తరలిన గ్రేటర్ గులాబీ శ్రేణులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చలో నల్గొండ సభకు గ్రేటర్ నుంచి గులాబీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం మొదటి బహిరంగ సభ కావడంతో జన సమీకరణ, తరలింపుపై తెలంగాణ భవన్‌లో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సమావేశం నిర్వహించి కార్పొరేటర్లకు పలు సూచనలు చేశారు. గ్రేటర్ నియోజకవర్గాల్లో సభకు వెళ్లే వాహనాలర్యాలీని స్థానిక ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ప్రారంభించారు.





జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు


కె.వినోద్


బానోత్ సతీష్


బి.రాజ్ కుమార్


బానోత్ భద్ర


ఎం.గణేశ్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మేయిన్స్-1లో రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సర్కిల్ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ గిరిజన ఐఐటీ స్టడీ సెంటర్‌లో చదువుతున్న కె.వినోద్ 96.86 శాతంతో మొదటి స్థానంలో నిలిచాడని తెలిపారు. గిరిజన ఐఐటీ స్టడీ సెంటర్‌లో ఐదుగురు విద్యార్థులు 90 శాతానికిపైగా, ఎనిమిది మంది 80 శాతానికిపైగా, 11 మంది 70 శాతానికిపైగా సాధించి రాజేంద్రనగర్ గిరిజన ఐఐటీ స్టడీ సెంటర్ పేరును నిలబెట్టారని అన్నారు. మొత్తంగా తమ స్టడీ సెంటర్‌లో 60 మంది విద్యార్థులకు గాను 40 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను రీజినల్ కో ఆర్డినేటర్ పీఎస్ కళ్యాణి, గురుకుల ఉన్నతాధికారులు అభినందించారు.

గిరిజన విద్యార్థుల ప్రతిభ

రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఐటీ స్టడీ సెంటర్‌లో చదువుతూ జేఈఈ మేయిన్స్-1లో అత్యధిక శాతం మార్కులు సాధించిన వారిలో కత్రావత్ వినోద్ 96.86 శాతం, బానోత్ సతీష్ 94.51 శాతం, బుక్యా రాజ్ కుమార్ 93.27 శాతం, బానోత్ భద్ర 91.5 శాతం, ఎం.గణేశ్ 91.1 శాతం సాధించి సత్తాచాటరు. బుక్యా ఈశ్వర్ 88.2 శాతం, ధనావత్ పవన్ 86.31 శాతం, రాథోడ్ అరవిండ్ 86.07 శాతం, దారావత్ సురేందర్ 85.56 శాతం, బోడ అశోక్ 85.04 శాతం, దారావాత్ స్టీఫెన్ 82.48 శాతం, జాదవ్ వాసురామ్ 81.23 శాతం, వంకుడోతు భువన్ 80.02 శాతం సాధించి ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. వీరందరిని రాజేంద్రనగర్ ఐఐటీ స్టడీ సెంటర్ ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ అభినందించారు.


వై.సాయిరామ్ 99.46శాతం


యూ.వెంకటేష్ 99.31శాతం

సత్తాచాటిన గౌలిదొడ్డి విద్యార్థులు

రాయదుర్గం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో గౌలిదొడ్డి సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు 80 మంది ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించి తమ సత్తాచాటారు. ఏర్రంబాటి సాయిరామ్ 99.46 శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా, ఊట్కురి వెంకటేష్ 99.31 శాతంతో రెండో స్థానంలో నిలిచి ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. 22మంది విద్యార్థులు 90 శాతం పైగా, 40మంది 80 శాతం పైగా, 56 మంది 60 శాతం పైగా, 80 మంది విద్యార్థులు 50 శాతంతో జూన్‌లో జరిగే ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. మొత్తం వంద మంది కళాశాల నుంచి పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ వట్టికొండ పాపారావు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురుకుల సంస్థ కార్యదర్శి కె.సీతాలక్ష్మి, సంయుక్త కార్యదర్శి నక్కునాయక్, ఓఎస్‌డీ రంగారెడ్డి, ఆర్‌సీఓ డాక్టర్ శారద వెంకటేష్ అభినందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుపేద కుటుంబాల విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఇంతటి విజయాలు సాధించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అదిరోహించాలని వారు ఆకాంక్షించారు.

ఆకాష్ బైజూస్ అద్భుత విజయం

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ 2024లో తమ విద్యార్థి రిషి శేఖర్ శుక్లా నూటికి నూరుశాతం మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచాడని అకాష్ బైజూస్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అకాష్ బైజూస్ సంస్థ రీజినల్ డైరెక్టర్ ధీరజ్ మిశ్రా మాట్లాడుతూ రిషి శేఖర్ శుక్లా ప్రతిభకు తమ కోచింగ్‌తో అండగా నిలిచామని తెలిపారు. విద్యారంగంలో అత్యంత క్లిష్టపరీక్షలలో జేఈఈ ఒకటని, రెండు దశల్లో ఉండే పరీక్షకు సన్నద్ధం కావాలంటే అంకితభావంతో పాటు టెక్నికల్ పాయింట్స్ కూడా చాలా కీలకమన్నారు. తమ ఆకాష్ సంస్థలో ప్రిపరేషన్ టెక్నిక్స్‌తో పాటు జేఈఈ ముఖ్య ఉద్దేశ్యంపై కూడా పూర్తి స్థాయి అవగాహన విద్యార్థులకు అందిస్తామని చెప్పారు. మొదట్లో పెద్దగా ఆసక్తి కనబరచని విద్యార్థులు కూడా తమ కోచింగ్ వల్ల జేఈఈపై పూర్తి ఆసక్తి పెంచుకుని అంకితభావం ప్రదర్శించే విధంగా తయారవుతుంటారని చెప్పారు. ధీరజ్‌తోపాటు విద్యాసంస్థ ప్రతినిధులు రిషి శేఖర్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు.


రిషిశేఖర్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ ధీరజ్, ఇతర విద్యార్థులు



మాట్లాడుతున్న వెంకటేష్, పక్కన దేబాదీష్ మిత్ర, హరికృష్ణ

ఎస్‌బీఐ హౌస్‌కీపింగ్ సిబ్బందితో సంభాషణ

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ గౌరవాధ్యక్షుడు ఎం.వెంకటేశ్ మంగళవారం బేగంపేట్‌లోని స్టేట్ గెస్ట్‌హౌజ్‌లో ఎస్‌బీఐలో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ సిబ్బందితో సంభాషించారు. ఎస్‌బీఐ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులతో సమస్యలపై చర్చించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ మేనేజర్ దేబాదీష్ మిత్ర మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం సూచించిన నిబంధనలకు ఎస్‌బీఐ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో డీజీఎం జితేంద్ర, ఎస్‌బీఐ ఏజీఎం(హెచ్‌ఆర్) డి.హరికృష్ణ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జి.రామకృష్ణ పాల్గొన్నారు.

రైతుల డిమాండ్‌లను నెరవేర్చాలి : ఒవైసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధర కోసం చట్టపరమైన హామీ కోసం రైతులు చేస్తున్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం దారుల్‌సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు న్యాయసమ్మతమైన డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ 'చలో ఢిల్లీ' మార్చ్ కార్యక్రమం చేపడితే పొరుగు దేశ ప్రజలపై విరుచుకుపడినట్టుగా మిలిట్రీని పంపడం మోదీ ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. స్వామినాథన్ కమిటీ ఫార్ములాను అమలు చేయకుండా కేంద్రం ఎందుకు జాప్యం చేస్తుందని ప్రశ్నించారు. బీహార్‌లో మజ్లిస్ పార్టీ నేత అబ్దుల్ సలాం దారుణహత్యను తీవ్రంగా ఖండించారు.

వాలెంటైన్స్ డే గ్రీంటింగ్స్‌ను దహనం చేసిన బజరంగ్‌దళ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వాలంటైన్స్ డేను వ్యతిరేకిస్తూ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం అబిడ్స్‌లోని జీపీవో వద్ద గ్రీంటింగ్స్‌ను దహనం చేశారు. విదేశీ సంస్కృతి నశించాలి.. స్వదేశీ సంప్రదాయాన్ని పెంచి పోషించాలి.. విదేశీ మాఫియాను తరిమి కొట్టాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు రాహుల్, సుమంత్, ప్రవీణ్, వీహెచ్‌పీ నేతలు పగుడాకుల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. వాలంటైన్స్ డే పురస్కరించుకొని కార్యక్రమాలను నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.


ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు

పహడిషరీఫ్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కందుకూరు డివిజన్ ఆర్‌డీఓ సూరజ్‌కుమార్, బాలాపూర్ తహసీల్దార్ మాధవిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం బాలాపూర్ మండల పరిధిలోని మామిడిపల్లిలో సర్వేనెం.99-1లో నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం మామిడిపల్లి నుంచి శంషాబాద్ వెళ్లే రహదారిలో సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ ఎదురుగా గల పెద్దమ్మ తల్లి ఆలయం రహదారికి అడ్డంగా ఉందని శంషాబాద్ విమానాశ్రయం అధికారులు, జీఎంఆర్ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించామన్నారు. వివిధ పార్టీల నాయకులు, స్థానికులతో చర్చించిన తర్వాత రోడ్డు వెడల్పు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విశ్వనాథ్‌గౌడ్, విజయేందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.


'చలో నల్లగొండ' బహిరంగ సభకు జల్‌పల్లి మున్సిపాలిటీ నుంచి వెళ్లిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శంషొద్దీన్ హమీద్, అమ్జద్ ఖాన్, ఎంఏ రవూఫ్, తదితరులు - పహడిషరీఫ్, ఆంధ్రజ్యోతి

ట్రాఫిక్ జాయింట్ సీపీగా జోయల్ డేవిస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్‌గా జోయల్ డేవిస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో సోమవారం రాత్రి జరిగిన ఐపీఎస్ అధికారుల బదిలీల్లో జోయల్ డేవిస్‌ను ట్రాఫిక్ జాయింట్ సీపీగా ప్రభుత్వం నియమించింది. అక్కడ జాయింట్ సీపీగా ఉన్న నారాయణ్ నాయక్‌ను ఎస్‌సీఆర్‌బీ, సీఐడీ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా నియమించింది.


జోయల్ డేవిస్


వివరాలు ఇచ్చేందుకు లైన్‌లో నిలబడిన దరఖాస్తుదారులు

గృహజ్యోతి వివరాల అప్‌డేట్ నిరంతర ప్రక్రియ

● తెల్లరేషన్ కార్డు ఉన్న వారి వివరాల సేకరణ
● స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి వివరాల అప్‌డేట్ నిరంతర ప్రక్రియ అని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వచ్చిన 'వస్తారా.. వెళ్లాలా..?' గృహజ్యోతి వివరాల సేకరణపై అస్పష్టత అనే కథనానికి వివిధ ప్రాంతాల్లో దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న విద్యుత్ అధికారులు స్పందించారు. ప్రజాపాలనలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు స్పాట్‌బిల్లింగ్ మెషిన్ల (ఎస్‌పీఎం)లో అప్‌డేట్ చేయడంతోపాటు తెల్లరేషన్‌కార్డు ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేని వారి వివరాలు కూడా నమోదు చేసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. కాలనీలు, బస్తీల్లో విద్యుత్‌సిబ్బంది, అధికారులు ఇళ్లకు వెళ్లినప్పుడు కొంతమంది గృహాల్లో ఉండడం లేదని అలాంటి వారికోసం సమీపంలో ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి విద్యుత్ సిబ్బంది ట్యాబ్‌లు, ఫోన్లలో గృహజ్యోతి వివరాలు అప్‌డేట్ చేస్తునట్లు తెలిపారు. సర్వర్ సమస్య తలెత్తిన ప్రాంతాల్లో విద్యుత్‌సిబ్బంది కనెక్షన్‌దారుడి నుంచి తెల్లరేషన్‌కార్డు, ఆధార్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తు నంబర్, ఫోన్ నంబర్లు నమోదు చేసుకొని ఆ వివరాలను తర్వాత ఎస్‌పీఎంలో అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. అద్దె ఇళ్లల్లో నివాసముండే వారికి తెల్లరేషన్ కార్డు ఉంటే మీటర్ ఎవరిపేరు మీద ఉన్నా వారి వివరాలు కూడా స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో అప్‌డేట్ చేస్తునట్లు అధికారులు చెబుతున్నారు.

వేగంగా తాగునీటి పైపులైన్ పనులు

చార్మినార్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీలో తాగునీటి పైపులైన్ పనులు వేగంగా సాగుతున్నాయని జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం గోవింద్‌గౌడ్ తెలిపారు. మంగళవారం జల్‌పల్లి మున్సిపాలిటీలోని జల్‌పల్లి కమాన్ నుంచి జరుగుతున్న పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వాయర్ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఎర్రకుంటలో 60 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన రిజర్వాయర్‌కు నూతన పైపులైన్‌లను అనుసంధానం చేశామని తెలిపారు. పనులు పూర్తయితే పరిసర బస్తీల ప్రజలకు పుష్కలంగా తాగునీరు లభిస్తుందని తెలిపారు.


తాగునీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న అధికారులు



ధర్నాలో పాల్గొన్న దుర్గాప్రసాద్, విద్యార్థులు

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులను రక్షించండి

కార్వాన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్ల విదార్థులను రక్షించాలంటూ డీఎస్‌ఎస్ భవన్ ఎదుట ధర్మ సమాజ్ పార్టీ అండ్ ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బరిగెల దుర్గాప్రసాద్ మహరాజ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు స్పందించని స్థానిక ప్రాంత ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షం కూడా స్పందించకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టళ్లలో ఆత్మహత్య చేసుకున్న వైష్ణవి, భవ్య సంఘటనలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ మేడి కార్తీక్, కో-కన్వీనర్ సైదాబాబు, రాజ్‌కమల్, కృష్ణ, సైదులు, సురేశ్, గణేశ్, ప్రసాద్, రాజు, శివప్రసాద్, నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన దూద్‌బౌలి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్

మదీన, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సేల్ డీడ్ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయడానికి ఓ వ్యక్తి నుంచి రూ. 2లక్షలు లంచం తీసుకుంటూ దూద్‌బౌలి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. పాతనగరం దూద్‌బౌలి సబ్‌రిజిస్ట్రార్ ఆరు నెలల క్రితం బదిలీకావడంతో ఆయన స్థానంలో అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న అమీర్ ఫరాజ్ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. షాలిబండకు చెందిన సయ్యద్ షహబాజ్, అతని స్నేహితుడు పర్వేజ్‌కు చెందిన రెండు సేల్‌డీడ్ పత్రాలను ఒకటి తన పేరు మీద, మరొకటి స్నేహితునితో కలిసి జాయింట్ రిజిస్ట్రేషన్ చేయమని కోరాడు. దీనికి అమీర్ ఫరాజ్ రూ. 2లక్షలు లంచం అడిగాడు. దీనికి అంగీకరించిన సయ్యద్ షహబాజ్ రిజిస్ట్రార్ సూచన మేరకు కార్యాలయంలో హెల్పర్‌గా పనిచేసే గోపీసింగ్‌కు నగదు అందించాడు. అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు గోపీసింగ్‌ను, ప్రధాన నిందితుడైన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆమెర్ ఫరాజ్‌లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.


ఏసీబీకి చిక్కిన అమీర్ ఫరాజ్

పాతబస్తీలో ఐటీ సోదాలు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ ఫలక్‌నుమాలో మంగళవారం ఉదయం కింగ్స్ గ్రూప్ అధినేత షానవాజ్ ఇంట్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. షానవాజ్ ఇంట్లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు నవంబర్‌లో కూడా సోదాలు జరగగా, తాజాగా పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించడం పాతబస్తీలో హాట్ టాపిక్‌గా మారింది. షానవాజ్ ఇంట్లో గతంలో కూడా పలుమార్లు ఐటీ దాడులు జరిగాయి.



కింగ్స్ గ్రూప్ కార్యాలయం

ఔషధ నియంత్రణ అధికారుల దాడులు

● అక్రమంగా నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): డయాబెటిస్, బీపీల చికిత్సలకు తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తూ.. అక్రమంగా నిల్వ ఉంచిన మందులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ఓ సంస్థపై మంగళవారం ఔషధ నియంత్రణ అధికారులు దాడులు నిర్వహించారు. గోల్కొండలోని మొహల్లా గంజ్‌లో 'సాహెత్ కేర్ పౌడర్'ను భారీగా విక్రయిస్తున్నారని సమాచారం అందుకున్న ఔషధ నియంత్రణ అధికారులు దాడులు చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబందించిన చాంద్రాయణగుట్ట, బండ్లగూడలో ఏర్పాటు చేసిన ఓ క్లినిక్‌పై కూడా దాడులు నిర్వహించి అక్రమ నిల్వలను గుర్తించారు. యాంటీబయాటిక్స్, అనాల్జెసిక్స్, యాంటీ అల్సర్ డ్రగ్స్, యాంటీహైపెర్టెన్సివ్స్, యాంటీ డయాబెటిక్స్ తదితర రకాల మందుల నిల్వలను ప్రాంగణంలో గుర్తించారు. లక్ష విలువైన స్టాక్‌ను డీసీఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాడి సమయంలో క్లినిక్‌లో అనేక యాంటీబయోటిక్ ఇంజెక్షన్లను నిల్వచేస్తున్నట్లు గుర్తించారు. కొన్ని వ్యాధులు, రుగ్మతల చికిత్స కోసం, కొన్ని మందుల ప్రకటనలను ఔషధ నియంత్రణ సంస్థ నిషేధించిందని తెలిపారు. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకరమైన ప్రకటనలు) చట్టంలో సూచించిన వ్యాధులు, రుగ్మతలకు సంబంధించిన ప్రకటనల ప్రచురణలో ఏ వ్యక్తి కూడా పాల్గొవద్దని అధికారులు తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ టి.రాజమౌళి, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు సంతోష్, స్వప్న, అజయ్ తదితర అధికారులు దాడులు నిర్వహించారు.

స్త్రీల అస్తిత్వ సమస్యలపైనే నా రచనలు

● శీలా సుభద్రాదేవి

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కులం, జెండర్ పడగల నీడ కింద నలిగిపోతూ స్త్రీలు తమ అస్తిత్వం కోసం పడే సంఘర్షణ తన రచనల్లో ఎక్కువగా కనిపిస్తుందని ప్రముఖ కవయిత్రి, రచయిత్రి శీలా సుభద్రాదేవి తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న ప్రఖ్యాత కవి రచయితల స్వీయ సాహిత్య, జీవిత విశేషాల ప్రసంగ పరంపర 'నేను-నా-రచనలు' కార్యక్రమంలో ఆమె మంగళవారం ప్రసంగించారు. కథా రచనతో సాహిత్య రంగంలో అడుగుపెట్టిన కవిత్వంపై మొగ్గు చూపానని.. అయితే, ఇతర ప్రక్రియలను అలక్ష్యం చేయలేదని చెప్పారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ నేటి కవులు, రచయితలు ముందు తరం సృజనకారుల రచలను చదివి వారి నుంచి స్ఫూర్తి పొంది ముందుకు సాగాలని సూచించారు. సుభద్రదేవి రెండు కథా సంపుటాలను 11 కవితా సంపుటాలను వెలువరించారని.. స్త్రీల సమస్యల చిత్రణకు ప్రాధాన్యమిచ్చారని పేర్కొన్నారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ శీలా సుభద్రాదేవి భర్త ప్రముఖ రచయిత, కవి శీలా వీర్రాజుతో పోటీపడి రచనలు చేస్తూ సాహిత్య వ్యక్తిత్వాన్ని కాపాడుకున్నారని తెలిపారు. ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సిల్మానాయక్ సమన్వయకర్తగా వ్యవహరించారు.


నేను-నా-రచనలు కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి, రచయిత్రి శీలా సుభద్రాదేవి, తదితరులు

ఎంజీఐటీలో ఆర్‌ఏఎంఎంపీ-2024 సదస్సు


సదస్సుకు హాజరైన ప్రముఖులు


సభావేదికపై బి.ఎస్.మూర్తి, డాక్టర్ ముత్తు కుమార్, చంద్రమోహన్‌రెడ్డి, తదితరులు

నార్సింగ్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎంజీఐటీలో ఆర్‌ఏఎంఎంపీ- 2024 పై ఒక రోజు సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రభుత్వేతర సాంకేతిక కళాశాలలో ఎంజీఐటీలో మాత్రమే మెటలర్జికల్ అండ్ మెటీరియల్ ఇంజనీరింగ్, మెకట్రానిక్స్ వంటి విభాగాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కళాశాల యాజమాన్యం ఎంతో శ్రద్ధతో తమ విధులు నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. నూతన పోకడలను, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్‌లోని విప్లవాత్మక మార్పులు, తదితర అంశాలపై విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ముత్తు కుమార్, ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.





ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీనివాస్, పుల్లారెడ్డి

స్విమ్మింగ్‌లో సత్తాచాటిన అత్తాపూర్‌వాసులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గోవాలో జరిగిన స్విమ్మింగ్ పోటీలో రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడకు చెందిన ఇద్దరు ఈతగాళ్లు సత్తా చాటారు. మాస్టర్స్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీలో హైదర్‌గూడకు చెందిన ఆర్టీసీ ఉద్యోగి కొంగళ్ల శ్రీనివాస్ సిల్వర్ మెడల్ సాదించారు. ఆయనకు నిర్వాహకులు మంగళవారం మెడల్‌తోపాటు ప్రశంసాపత్రం అందజేశారు. హైదర్‌గూడకు చెందిన జి.పుల్లారెడ్డి 100 మీటర్లు, 200 మీటర్ల పోటీలో రెండు మెడల్స్ సాదించారు. వీరిని హైదర్‌గూడకు చెందిన పలువురు అభినందించారు. త్వరలోనే జరగనున్న అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలో గోల్డ్ మెడల్స్ సాదించాలని వారు ఆకాంక్షించాంరు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ప్రత్యేక ప్రోత్సాహం వల్ల తాను మెడల్స్ సాదించగలుగుతున్నానని శ్రీనివాస్ తెలిపారు.

గోల్ఫ్ సెమీస్‌లో హైల్యాండర్స్, డీఎస్ఆర్ జట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ సీజన్-4లో విలేజియో హైల్యాండర్స్, డీఎస్ఆర్, సామ ఏంజెల్స్, టీమ్ ఆల్ఫా జట్లు సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో మేవరిక్స్‌పై హైల్యాండర్స్, టిరూట్స్‌పై ఏంజెల్స్, రైడర్స్‌పై ఆల్ఫా, టీమ్ క్లేమపై డీఎస్ఆర్ జట్టు గెలిచి, టైటిల్‌కు చేరువయ్యాయి. ఫైనల్‌ను దుబాయ్‌లో నిర్వహించనున్నారు.


పోటీల్లో పాల్గొన్న గోల్ఫ్ క్రీడాకారులు

ఆర్మీ స్పోర్ట్స్ స్కూల్‌కు హైదరాబాద్ సెయిలర్లు ఎంపిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హుస్సేన్‌సాగర్ తీరంలోని యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (వైసీహెచ్)లో శిక్షణ పొందుతున్న సెయిలర్లు బి.బన్నీ, అక్షయ్ కుమార్ మైసూర్‌లోని ఆర్మీ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో నెగ్గి, సబ్ జూనియర్ ఫ్లీట్ విభాగంలో వీరికి ఆర్మీ స్కూల్‌లో ప్రవేశం లభించింది. బన్నీ పేద రైతు కుటుంబం నుంచి రాగా, అక్షయ్ తండ్రి క్యాబ్ డ్రైవర్. ప్రస్తుతం బన్ని సబ్ జూనియర్ విభాగంలో భారత్ నెంబర్ 2 ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.



ఎంపికైన యాచ్ క్లబ్ సెయిలర్లు



నారా బ్రాహ్మణికి స్వాగతం పలుకుతున్న ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ తదితరులు

జోగులాంబ సన్నిధిలో నారా బ్రాహ్మణి

● అమ్మవారికి ప్రత్యేక పూజలు

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో జరుగుతున్న జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో మాజీ సీఎం చంద్రబాబునాయుడు కోడలు నారా బ్రాహ్మణి పాల్గొన్నారు. మంగళవారం ఆమె తన స్నేహితురాలితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఈవో పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మలు సాదరస్వాగతం పలికారు. ఆమె మొదట స్వామివారి సన్నిధిలో పూజలు, తర్వాత అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన చేశారు. ఆ తర్వాత ఆమెను ఆలయ కార్యాలయానికి ఆహ్వానించిన అధికారులు జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు. బ్రాహ్మణిని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు సన్మానించారు.

గద్దర్ పేరిట కళానిలయాన్ని ఏర్పాటు చేయాలి

● బయోపిక్ తీస్తే ఆస్కార్ అవార్డ్ వస్తుంది.. ● తెలంగాణ సినీ పరిశ్రమకు బడ్జెట్లో 5 శాతం కేటాయించాలి ● రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న కంచె ఐలయ్య, పాల్గొన్న అతిథులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సినీ పరిశ్రమకు బడ్జెట్లో 5 శాతం నిధులు కేటాయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గద్దర్ గళం సంస్థ ఆధ్వర్యంలో గాయకుడు పి.రవీందర్ అధ్యక్షతన మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గద్దర్ అవార్డ్, 'సినిమా ఇండస్ట్రీ అవుట్ లుక్ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు బి.నర్సింగరావు మాట్లాడుతూ గద్దర్ పాటకు ఎన్నో రూపాలున్నాయని అన్నారు. జనం పాట అనే ఒక ఇనిస్టిట్యూట్‌ను గద్దర్ పెట్టాలనుకున్నాడని, ప్రభుత్వం ఆయన పేరిట ఐదెకరాల స్థలంలో ఒక కళానిలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అది ప్రజా పాటకు అంకితమై ఉండాలన్నారు. నగరంలో ప్రధాన కూడలిలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఈ సందర్భంగా కోరారు. ప్రొఫెసర్ కంచె ఐలయ్య మాట్లాడుతూ నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అవార్డు ఇస్తే గద్దర్ గురించి భావితరాలకు తెలుస్తుందన్నారు. హరప్పా కాలం నుంచి ఇప్పటి వరకు గద్దర్ లాంటి కళాకారుడు పుట్టలేదని, ఆయన బయోపిక్ తీస్తే ఆస్కార్ అవార్డు వస్తుందన్నారు.

అంతర్జాతీయ జానపద అవార్డులివ్వాలి

ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ అంతర్జాతీయ జానపద అవార్డులను కూడ ప్రభుత్వం ప్రకటించాలని సూచించారు. గద్దర్ పేరిట ఢిల్లీ స్థాయిలో జానపద పీఠం అవార్డు, గ్రామీణ అవార్డులు ఉండాలని, ప్రతి జిల్లాలో ఆయన పేరుతో ఆడిటోరియాలను నిర్మించాలని కోరారు. సినిమా డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ గద్దర్ ఫౌండేషన్‌కు అన్ని విధాలా సహకారమందిస్తామని చెప్పారు. సినీ పరిశ్రమలో చాలా మంది గద్దర్ గొప్పతనాన్ని గుర్తించలేదని టీపీసీసీ అధికార ప్రతినిధి ప్రొ. రియాజ్ అన్నారు. దర్శకుడు నెల్లుట్ల ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా గద్దర్ అవార్డు స్థిరంగా ఉండేలా జీవో తీసుకు రావాలన్నారు. గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ మాట్లాడుతూ ఆయన రాసిన ఉత్తరాలు, పాటలు, నోట్‌బుక్స్, వీడియోలను భద్రపరిచామని, ఆయన సాహిత్యాన్ని కాపాడుకోవాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ గద్దర్ పేరుతో ఫోక్ యూనివర్సిటీ పెట్టాలని కోరారు. సినీ దర్శకులు ప్రేమ్‌రాజ్, అక్షర కుమార్ మాట్లాడారు. సమావేశంలో పసునూరి రవీందర్, దళిత నాయకుడు జె.బి.రాజు, సినీ దర్శకుడు సయ్యద్ రఫీ, మేధావులు, కళాకారులు, పాల్గొన్నారు.

అత్యుత్తమ రియల్ ఎస్టేట్ మార్కెట్‌గా హైదరాబాద్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో అత్యుత్తమ రియల్ ఎస్టేట్ మార్కెట్‌గా హైదరాబాద్ ఎదిగిందని, దేశంలోని ఇతర నగరాలతో పోల్చితే శరవేగంగా అభివృద్ధి చెందుతోందని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. నగరంలోని ప్రముఖ హోటల్‌లో రియల్టీ కాన్‌క్లేవ్ అండ్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2024 నిర్వహించగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌కు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చలు నిర్వహించారు. ప్రముఖులతో నాలెడ్జ్ షేరింగ్ కాన్‌క్లేవ్‌లను నిర్వహించారు. రియల్టీ సెగ్మెంట్లలో వృద్ధి కనిపిస్తున్నదని, పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో టీడబ్ల్యూ బిజినెస్ వరల్డ్ మీడియా గ్రూప్ చైర్మన్ డాక్టర్ అనూరాగ్ బాత్రా, సీఐఐ తెలంగాణ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు వి.రాజశేఖర్ రెడ్డి, కాన్సెప్ట్ అంబియెన్స్ చైర్మన్ మహబీర్ ప్రసాద్ అగ్రవాల్, రామ్కీ ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర వసంతం



పుస్తకాల పరిశీలనలో సందర్శకులు

ఎన్టీఆర్ స్టేడియం గద్దర్ ప్రాంగణంలో కొలువుదీరిన 36వ జాతీయ పుస్తక మహోత్సవానికి విశేష ఆదరణ లభిస్తోంది. పుస్తకాభిమానులతో అలరారుతోన్న ఆ ప్రాంగణం అక్షర వసంతాన్ని తలపిస్తోంది. గడిచిన ఐదు రోజుల్లో మూడు లక్షల మందికి పైగా బుక్ ఫెయిర్‌ను సందర్శించినట్లు కార్యదర్శి వాసు తెలిపారు. పుస్తక ప్రపంచాన్ని చుట్టేయాలనుకొన్న వారికి మరో ఐదు రోజులు మాత్రమే అవకాశం.

- హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి)

పుస్తకానికి సోషల్ మీడియా అండ



పాత, కొత్త పుస్తకాలకు సోషల్‌మీడియా అండగా నిలుస్తోంది. రచయితలు తమ రచనలు, కొత్త ప్రచురణల సమాచారాన్ని పాఠకులకు తెలియజేసేందుకు, వాటికి తగిన ప్రచారం కల్పించేందుకు ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించుకుంటున్నారు. ఇదే వేదికగా కొందరు పుస్తక సమీక్షలు రాస్తుండటంతో, కొత్త పుస్తకాలకు తగిన ప్రాచుర్యం లభిస్తోంది. సామాజిక మాధ్యమాల ద్వారా పుస్తకాల గురించి తెలుసుకొని, నచ్చిన పుస్తకాన్ని బుక్‌ఫెయిర్‌కు వచ్చి కొనుగోలు చేయడం ఇప్పటి ట్రెండ్‌గా కనిపిస్తోంది. దాంతో రచయితలు, కవులు, ప్రచురణ కర్తలు తమ పుస్తకాలకు సంబంధించిన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.



తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పుస్తక మహోత్సవ ప్రాంగణంలో కళాకారులు బోనం ఎత్తుకొని, కోలాటం ఆడుతూ లయబద్ధంగా అడుగులు వేస్తూ నృత్య ప్రదర్శన చేశారు.

నేటి కార్యక్రమాలు

- మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు బృంద నృత్యాలు, డ్యూయెట్ సాంగ్స్
- సాయంత్రం 4గంటలకు 'హృదయం రాగం' పుస్తకావిష్కరణ
- సాయంత్రం 4.45గంటలకు 'పిలుపు' పుస్తకావిష్కరణ
- సాయంత్రం 5.30 గంటలకు 'విద్యకు విముక్తి' ఆవిష్కరణ
- 6.15 గంటలకు 'నేటి సామాజిక పరిణామం - రచయితల స్పందన' సాహిత్య సదస్సు
- సాయంత్రం 7.15 గంటలకు 'హమీద్ దల్వాయి' కథ ఆవిష్కరణ



హరివిల్లు కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

ఆలూరి విల్సన్ 'హరివిల్లు' ఆవిష్కరణ

గద్దర్ ప్రాంగణంలోని రవ్వా శ్రీహరి వేదికపై భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆలూరి విల్సన్ కవితా సంపుటి 'హరివిల్లు' ను ప్రముఖ సాహితీవేత్త పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలూరి విల్సన్ నిరంతరం సమకాలీన పరిస్థితులపై కవిత్వం రాస్తూ తనదైన శైలిలో సాహిత్య సేవ చేస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత మాణిక్యరెడ్డి, చొక్కాపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో మేరు శిఖరం 'రవ్వా శ్రీహరి'



సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య పిల్లల రాములు

వెనుకబడిన కులాలు వృద్ధిలోకి రావాలంటే చదువులో ముందుండాలని రవ్వా శ్రీహరి నేర్పిన పాఠం విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోరాదని పలువురు వక్తలు అన్నారు. సంస్కృత వ్యాకరణానికి భాష్యం చెప్పిన తెలుగు సాహిత్య మార్గదర్శకుడు రవ్వా శ్రీహరి అని కొనియాడారు. మంగళవారం హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రాంగణంలో 'రవ్వా శ్రీహరి రచనలు-విహంగ వీక్షణం'పై సదస్సు జరిగింది. ఈ సభలో చెన్నప్ప మాట్లాడుతూ రవ్వా శ్రీహరికి వ్యాకరణం ప్రాణమని, శబ్దం మీద పట్టు ఉన్నవాడని కొనియాడారు. ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని విశ్లేషించిన రవ్వా శ్రీహరి చెప్పే పాఠాలు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ భాషా సాహిత్యాలు ఉన్నంతవరకు రవ్వా శ్రీహరి పేరు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా ఉంటుందన్నారు. సదస్సులో తెలుగు అకాడమీ మాజీ సంచాలకులు ప్రొఫెసర్ కె.యాదగిరి, డాక్టర్ ఎస్.రఘు, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు జూలూరు గౌరీ శంకర్, బుక్ ఫెయిర్ సెక్రటరీ ఆర్.వాసు, పరిశోధక విద్యార్థి యాదగిరి పాల్గొన్నారు.



సాహిత్య విమర్శనా వ్యాసాలు 'తదేక' ఆవిష్కరణ

డాక్టర్ మహమ్మద్ హసేన్ రచించిన సాహిత్య విమర్శనా వ్యాసాలు 'తదేక' ను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వర్లు మంగళవారం బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సభలో ఓయూ తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు సూర్యాధనంజయ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కవి కె.ఆనందాచారి, డా.పి.సురేందర్ రెడ్డి, డా. వెల్దండ శ్రీధర్, డా. పి. మధుసూదన్ రెడ్డి, డా. ఎస్. రాజారామ్, కవి యాకూబ్, టి.భాస్కర్ రెడ్డి, అనంతోజు మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ భాషల్ని ఇముడ్చుకునే శక్తి తెలుగుకే ఉంది



మాట్లాడుతున్న మేడసాని మోహన్

రాయదుర్గం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని అనేక భాషలను తనలో కలుపుకోగలిగి సహజత్వాన్ని కోల్పోని మహత్తరశక్తి తెలుగుభాష సొంతమని మహాసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ పేర్కొన్నారు. హెచ్‌సీయూ తెలుగుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మానవీయ శాస్త్రాల ఆడిటోరియంలో 'వెయ్యి ఏళ్ల తెలుగు సాహిత్య వైభవం' అంశంపై ప్రత్యేక ప్రసంగాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ మేడసాని హాజరవగా తెలుగుశాఖ అధ్యక్షుడు దార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆచార్య వి.కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఆచార్యులు పిల్లలమర్రి రాములు, గోనానాయక్, షమ్మి పవన్‌కుమార్, డి.విజయలక్ష్మి, వారిజారాణిలతోపాటు డాక్టర్ భూక్యాతిరుపతి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, డాక్టర్ డి.విజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు, మేధావులు అన్యాయాన్ని ప్రశ్నించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రొ.కె.నాగేశ్వర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై స్పందించని, తప్పులు జరుగుతున్నప్పుడు వ్యవస్థలను ప్రశ్నించని మేధావులు సమాజంలో ఉన్నా.. లేకున్నా ఒకటేనని మాజీ ఎమ్మెల్సీ ప్రొ.కె.నాగేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ మాజీ వైస్ చాన్సలర్ ప్రొ.ఎస్.బషీరుద్దీన్ జయంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో మంగళవారం స్మారకోపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా బషీరుద్దీన్ చిత్ర పటానికి నివాళి అర్పించి 'ప్రజా మేధావిగా పాత్రికేయుడు' అంశంపై స్మారకోపన్యాసం చేశారు. విశ్వవిద్యాలయాల్లో ఉండే అధ్యాపకులు, మేధావివర్గం ప్రభుత్వాలు చేసే తప్పులను, ప్రజావ్యతిరేక నిర్ణయాలను ఎప్పటికప్పుడు ప్రశ్నించి, గొంతులేని సామాన్య ప్రజల పక్షాన నిలబడాలని సూచించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ.కె.సీతారామారావు మాట్లాడుతూ తెలంగాణా మేధావి వర్గంలో ప్రొ.బషీరుద్దీన్ ఒకరని, అంబేడ్కర్ వర్సిటీలో మౌలిక సదుపాయాలు, వసతుల ఏర్పాటులో ఆయన పాత్ర చాలా గొప్పదని వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొ.ఎ.వి.ఎన్.ఆర్.రెడ్డి, మాజీ అధ్యాపకులు ప్రొ.ఘంటా చక్రపాణి, ప్రొ.సి.వెంకటయ్య. ప్రొ.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల హక్కులను కాపాడుకోవాలి

● కమిషన్ చైర్మన్ వెంకటేష్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల హక్కుల్ని కాపాడుకోవాలని జాతీయ సఫాయి కరమ్‌చారి కమిషన్ చైర్మన్ వెంకటేష్ సూచించారు. మంగళవారం గాంధీ ఆస్పత్రిని సందర్శించిన ఆయన వైద్యుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య, ఔట్‌సోర్సింగ్ కార్మికుల హక్కులను ముందుగా అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిబంధనల ప్రకారం రోజుకు ఎన్ని గంటలు పనిచేస్తున్నారు, వేతనాలు ఎంత ఇస్తున్నారు? ప్రతి నెలా జీతాలు ఇస్తున్నారా లేదా అనే అంశాలపై చర్చించారు. గాంధీ ఆస్పత్రిలో మహిళా ఉద్యోగులకు వేధింపుల సమస్యలుంటే ఫిర్యాదు చేయడానికి మహిళా ఉన్నతాధికారిని నియమించాలని సూచించారు. అనంతరం ఓ కంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వద్దకు వచ్చి ఫోన్ ఇవ్వాల్సిందిగా చైర్మన్ కోరాడు. తమ వద్ద సెల్‌ఫోన్లు లేవని వారు చెప్పడంతో ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి వద్ద సెల్‌ఫోన్ ఉంటుందని, లేవని ఎందుకు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సమావేశంలో గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్, గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, ఆర్‌ఎంఓ డాక్టర్ జయకృష్ణ, సఫాయి మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే గాంధీ ఆస్పత్రికి జాతీయ సఫాయి కరమ్‌చారి కమిషన్ చైర్మన్ వస్తున్నాడని ముందస్తు సమాచారం తెలుసుకున్న కాంట్రాక్టర్లు పారిశుధ్య కార్మికులకు నోరు విప్పొద్దని బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది.

పీవీకి భారతరత్నపై హర్షం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధానమంత్రి, బహుభాషా కోవిదుడు పీవీ నర్సింహారావుకు కేంద్రప్రభుత్వం భారతరత్న బిరుదును ప్రకటించడంపై బ్రాహ్మణ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. పీవీమార్గం రోటరీ చౌరస్తాలోని నర్సింహారావు విగ్రహం నుంచి ఆయన ఘాట్ వరకు స్మారక ర్యాలీ నిర్వహించాయి. ప్రముఖ సినీనటులు తనికెళ్ల భరణి, సినీగేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ర్యాలీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గీతామూర్తితోపాటు నాయకులు రామకృష్ణ, అనూరాధ, సూర్య ప్రకాష్, నిరంజన్ దేశాయ్, ఆలూరి, సుధాకర్ శర్మ పాల్గొన్నారు.

ఐఏసీటీఎస్ అధ్యక్షుడిగా డాక్టర్ లోకేశ్వరరావు సజ్జా



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కార్డియోవాస్క్యులర్ థొరాసిక్ సర్జన్స్ (ఐఏసీటీఎస్) 54వ అధ్యక్షుడిగా స్టార్ ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్, కార్డియాక్ సర్జన్ డాక్టర్. లోకేశ్వరరావు సజ్జా ఎన్నికయ్యారు. కోయంబత్తూరులో జరిగిన 69వ ఐసీటీఎస్‌లో ఈవిషయాన్ని వెల్లడించారు.

దెబ్బతిన్న కణాల భర్తీకి మూలకణాల చికిత్స మేలు



స్టెమ్ సెల్స్ రీజెనరేటివ్ రీసెర్చ్ ల్యాబ్ ఇంక్‌ను ప్రారంభించిన మహమ్మద్ షబ్బీర్ అలీ

దెబ్బతిన్న కణాలను తిరిగి భర్తీ చేయడంలో మూలకణాల చికిత్స చాలా ఉపయోగపడుతుందని వైద్యులు వివరించారు. వృద్ధాప్యంలో వచ్చే జబ్బులు, జన్యుపరమైన రుగ్మతలను పరిష్కరించగల సామర్థ్యాన్ని స్టెమ్ సెల్ థెరపీ కలిగి ఉంటుందన్నారు. టోలీచౌకీలో స్టెమ్ సెల్స్ రీజెనరేటివ్ రీసెర్చ్ ల్యాబ్ ఇంక్‌ను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనారిటీ సంక్షేమ సలహాదారుడు షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ స్టెమ్‌సెల్ సదస్సులో యూఎస్ఏ, మిడిల్ ఈస్ట్, సౌదీ అరేబియా, వియత్నాం నుంచి జాతీయ, అంతర్జాతీయ వక్తల బృందం పాల్గొన్నది. ఈ కార్యక్రమంలో యశోద ఆస్పత్రి డాక్టర్ మహ్మద్ ఏజాజ్ ఉద్దీన్, వియత్నాం నుంచి డాక్టర్ లిపి సింగ్, ప్రొఫెసర్ అలీమ్ అహ్మద్ ఖాన్, ప్రొఫెసర్ హైఫా తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీకి ఘరానా డ్రగ్స్ స్మగ్లర్ స్టాన్లీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఘరానా డ్రగ్స్ స్మగ్లర్ ఉవాల ఉడొక స్టాన్లీని అయిదు రోజులపాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి న్యాయస్థానం అనుమతించింది. దాంతో తెలంగాణ నార్కొటిక్ బ్యూరో, పంజాగుట్ట పోలీసులు నిందితున్ని మంగళవారం చంచల్‌గూడ జైలు నుంచి అదుపులోకి తీసుకున్నారు. స్టాన్లీ అరెస్టుతో గోవా, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, పుణెలోని స్మగ్లర్స్‌లో వణుకు మొదలైనట్లు తెలుస్తోంది. స్టాన్లీ నెట్‌వర్క్‌లో దేశవ్యాప్తంగా 500 మంది, హైదరాబాద్ నగరంలో ఏడుగురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల అరెస్టయిన స్టాన్లీ వద్ద పోలీసులు రూ.8కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. దాంతో అతన్ని పోలీసులు లోతుగా విచారించిన క్రమంలో అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లర్స్ లింకులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

కెమికల్ పరిశ్రమలో పేలుడు..

(3వ పేజీ తరువాయి)

కెమికల్ పరిశ్రమలో మంగళవారం రియాక్టర్ పేలడంతో భారీ స్థాయిలో మంటలు ఎగిసిపడ్డాయి. సంఘటనాస్థలంలో పని చేస్తున్న పది మంది కార్మికులు గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ఇద్దరు కార్మికుల ఆచూకీ తెలియకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మంటలు పక్క పరిశ్రమకు కూడా వ్యాపించాయి. పటాన్‌చెరు ఫైర్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

గుండు చేసి.. మీసాలు తొలగించి..

రామగుండం మెడికల్ కళాశాలలో సీనియర్ల ర్యాగింగ్.. విద్యార్థుల ఆందోళన

గోదావరిఖని, ఫిబ్రవరి 13: పెద్దపల్లి జిల్లా రామగుండం మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ భూతం జడలు విప్పింది. ఇద్దరు జూనియర్ విద్యార్థులను నలుగురు సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారు. కళాశాలలోని హాస్టల్‌లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు జూనియర్ విద్యార్థులను అడ్డుకొని జుట్టు ఎందుకు పెంచుతున్నారంటూ ప్రశ్నించారు. అనంతరం ట్రిమ్మర్‌తో ఇద్దరికీ గుండు చేసి, మీసాలు తొలగించారు. ఈ ఘటనపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలంటూ జూనియర్ విద్యార్థులు వైస్ ప్రిన్సిపల్ చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కళాశాలలో విచారణ చేపట్టారు. సీనియర్లపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత విద్యార్థులు కాలేజీ ప్రిన్సిపల్ హిమబిందుకు ఫిర్యాదు చేశారు. కాగా ర్యాగింగ్‌కు పాల్పడిన నలుగురు విద్యార్థులపై జూనియర్ విద్యార్థులు ఫిర్యాదు చేశారని ప్రిన్సిపల్ హిమబిందు తెలిపారు. ర్యాగింగ్ చేసిన విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ర్యాగింగ్‌కు ఎవరు పాల్పడినా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

ప్రతి పోలీసు స్టేషన్‌లో ఓ సైబర్ వారియర్

- 858 మంది కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న సైబర్ నేరాల కట్టడిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ప్రత్యేక దృష్టి సారించింది. పోలీసుస్టేషన్లలో నమోదయ్యే సైబర్ నేరాల దర్యాప్తును వేగవంతంగా జరిపేందుకు, బాధితులకు సత్వర న్యాయం చేకూర్చేందుకు ప్రతి పోలీసు స్టేషన్‌లో ఒక సైబర్ వారియర్ ఉండేలా సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల నుంచి ఎంపిక చేసిన 858 మంది కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ స్థాయి అధికారులకు హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెండు వారాల ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మంగళవారం ముగిసిన ఈ శిక్షణలో సైబర్ కేసుల దర్యాప్తునకు అవసరమైన అనేక అంశాల్ని వారికి వివరించారు. నేషనల్ సైబర్ క్రైం పోర్టల్, హెల్ప్‌లైన్ నెంబరు- 1930, సోషల్ మీడియా, ఆర్థిక నేరాల దర్యాప్తు, సైక్యాప్స్ అప్లికేషన్ వినియోగం, వారెంట్‌ల జారీ, విధులు, బాధ్యతలు ఇలా అనేక అంశాలపై శిక్షణ ఇచ్చారు. పోలీసుస్టేషన్, టీఎస్‌సీఎస్‌బీకి మధ్య సైబర్ వారియర్లు సమన్వయ కర్తలుగా పని చేస్తారని బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు. శిక్షణ పొందిన వారు విధులు నిర్వహించే పోలీసుస్టేషన్లలో నమోదయ్యే సైబర్ నేరాల విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉంటారని చెప్పారు.

రెండేళ్ల పాపకు అరుదైన వ్యాధి!

మందులకు నెలకు 2.5 లక్షలు!

ప్రజావాణి తలుపుతట్టిన నిరుపేదలైన తల్లిదండ్రులు.. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు 500 ప్లాట్లను కబ్జా చేశారు

- ఫిర్యాదు చేసిన కృష్ణానగర్ ప్లాట్స్ ఓనర్స్ సభ్యులు
- గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల ఏకరువు
- ప్రజావాణికి 2056 అర్జీలు

బేగంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల పాప ఓ అరుదైన వ్యాధితో బాధపడుతోంది. చిన్నారికి మందుల కోసం నెలకు రూ.2.5 లక్షలు ఖర్చవుతున్నాయి. ఆటో తోలుకొని బతికే ఆ తల్లిదండ్రులు ఇంత ఖర్చును ఎలా భరించగలరు? సాయం కోసం 'ప్రజావాణి' తలుపు తట్టారు. షేక్‌పేట దర్గాకు చెందిన మాలిక్ బాషా దంపతులకొచ్చిందీ సమస్య! బాషా దంపతుల వివరాల ప్రకారం.. పాపకు కాళ్లు సన్నబడటం, పొట్ట ఉబ్బడంతో ఓ పెద్దాస్పత్రిలో చూపించగా.. ఆ చిన్నారి ప్రపంచంలోనే చాలా అరుదైన గౌచర్ అనే వ్యాధితో బాధపడుతోందని, పూర్తిగా నయం కావాలంటే రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల దాకా ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ప్రస్తుతం మందులకు నెలకు రూ.2.5 లక్షలు అవుతున్నాయి. అయితే పాపకు అవసరమైన వైద్య సేవలు అందించడంతోపాటు మందులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న ఆరోగ్య శ్రీ అధికారులను నోడల్ అధికారి దివ్యా దేవరాజన్ ఆదేశించారు. కాగా మంగళవారం ప్రజావాణి కోసం ప్రజాభవన్ వద్ద పెద్ద ఎత్తున జనం బారులుతీరారు. మొత్తంగా 2056 దరఖాస్తులొచ్చాయి.



తమ సమస్యలను పరిష్కరించాలంటూ ప్రజాభవన్ వద్దకు ర్యాలీగా వచ్చిన గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయులు

కాగా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు 500 ప్లాట్లను కబ్జా చేశారని కృష్ణానగర్ ప్లాట్స్ ఓనర్స్ సభ్యులు ఫిర్యాదు చేశారు. కుమార్తె ఇంట్లో నుంచి బయటకు గెంటేసిందని, న్యాయం చేయాలని మల్కాజిగిరికి చెందిన సంగమేశ్వరరావు ప్రజావాణికి రావడంతో అతడిని బేగంపేటలోని నైట్ షెల్టర్‌లో చేర్పించారు. ఖైరతాబాద్‌లోని ఎం.ఎస్ మక్తా సమీపంలోని రాజ్‌నగర్‌లో మూడు నెలలుగా తాగునీరు సక్రమంగా రావడంలేదని పలువురు మహిళలు ఖాళీ బిందెలతో ప్రజావాణికి వచ్చారు. మేడిపల్లిలోని పర్వతాపూర్‌లో తమకు ఇచ్చిన 123 డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానిక కార్పొరేటర్ అనుచరులు కబ్జా చేశారని బాధితులు సుందర్‌రావు, చాంద్‌పాషా, శ్రీను ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు చేపట్టాలని పలువురు ప్రజావాణిలో విన్నవించారు. వీటితో పాటు ధరణి సమస్యలు, పెన్షన్లకు సంబంధించి దరఖాస్తులొచ్చాయి.

బైఠాయించిన గురుకుల సిబ్బంది

ప్రభుత్వ గురుకుల పాఠశాలు, కళాశాలల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగ-ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లపై నిర్ణయం తీసుకున్న అనంతరమే నూతన నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ 200 మంది గురుకుల ఉద్యోగ-ఉపాధ్యాయ జేఏసీ ప్రతినిధులు ప్రజావాణికి వచ్చారు. జీవో 317ను తక్షణమే పరిష్కారం చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు చెల్లించాలని, అన్ని గురుకుల సంస్థలను ఒకే కాల నిర్ణయం పట్టికకు ఉత్తర్వులివ్వాలని, ఉపాధ్యాయులకు ప్యారోటి స్కేల్స్ వర్తింప చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. సమస్యలపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని ప్రజావాణిలోనే బైఠాయించడంతో నోడల్‌అధికారి దివ్య దేవరాజన్ వారితో మాట్లాడారు. విద్యాశాఖ కార్యదర్శిని ప్రజావాణికి రప్పించి వారితో చర్యలు జరపడంతో వారు శాంతించారు.

మంత్రాల నెపంతో..

తల్లీకొడుకుల దారుణ హత్య



సమ్మక్క(ఫైల్)



సమ్మయ్య(ఫైల్)

పట్టపగలు నడిరోడ్డుపై ఆటోడ్రైవర్ ఘాతుకం

- ఇనుప రాడ్డుతో దాడి.. మరొకరికి తీవ్ర గాయాలు
- మహబూబాబాద్ జిల్లా గూడూరులో ఘటన

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 13 : ఓ మహిళ చేస్తున్న మంత్ర ప్రయోగం వల్ల తన కుటుంబసభ్యులు అనారోగ్యానికి గురవుతున్నారని అనుమానం పెంచుకున్న ఓ ఆటో డ్రైవర్ ఘాతుకానికి పాల్పడ్డాడు. పట్టపగలు నడిరోడ్డుపై దాడి చేసి ఆ మహిళతోపాటు ఆమె కొడుకు ప్రాణం కూడా తీశాడు. ఆమె భర్తను కూడా తీవ్రంగా గాయపరిచాడు. మహబూబాబాద్ జిల్లా గూడూరులో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో ఆలకుంట్ల సమ్మక్క(55), సమ్మయ్య(40) అనే తల్లీకొడుకులు హత్యకు గురయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. గూడూరు మండలం బొల్లెపల్లికి చెందిన అలకుంట్ల సమ్మక్క, కొమురయ్య దంపతులు కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. వివాహితుడైన వారి కొడుకు సమ్మయ్య ఆటో నడుపుకుంటూ తన కుటుంబంతో కలిసి వేరుగా ఉంటున్నాడు. సమ్మయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కొడుకు ఉన్నారు. బొల్లెపల్లికే చెందిన శివరాత్రి కుమారస్వామి అనే ఆటోడ్రైవర్ కుటుంబసభ్యులు కొంతకాలంగా తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. సమ్మక్క చేసిన మంత్ర ప్రయోగమే ఇందుకు కారణమని కుమారస్వామి అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంలో ఇరు కుటుంబాల మధ్య పలుమార్లు గొడవలు జరగ్గా.. పోలీసులకు పరస్పర ఫిర్యాదులు కూడా చేసుకున్నాయి. ఇదే వివాదం విషయమై సమ్మక్క, కొమురయ్య, సమ్మయ్య మంగళవారం ఉదయం గూడూరు పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సమ్మయ్య ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా తన ఆటోలో వచ్చిన కుమారస్వామి బొల్లెపల్లి సమీపంలోని జాతీయరహదారిపై వాళ్లని అడ్డుకుని వాగ్వాదానికి దిగాడు. ఆపై, వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డుతో సమ్మక్క, సమ్మయ్యపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన వారిద్దరూ అక్కడికక్కడే మరణించారు. అనంతరం కొమురయ్యపై దాడి చేస్తుండగా కుమారస్వామిని అడ్డుకున్న స్థానికులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కొమురయ్య ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

2,090 మందికి గురుకుల కొలువులు

- నేడు లేదా రేపు సీఎం చేతులమీదుగా నియామక పత్రాలు
- పీజీటీ, లైబ్రేరియన్, పీడీ పోస్టుల భర్తీ
- అర్ధరాత్రి ఫలితాల అప్‌లోడ్‌పై అభ్యర్థుల ఆవేదన

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సాధారణ గురుకుల్లాలో పలు పోస్టులు భర్తీ కానున్నాయి. వీటిలో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్, డిగ్రీ, జూనియర్ కాలేజీలు, పాఠశాలల్లోని లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఉన్నాయి. ఈ మేరకు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) ఆధ్వర్యంలో దాదాపు 2,090 మందికి నియామక పత్రాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15న ఎల్బీ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమంలో ఎంపికైన అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించనున్నట్టు సమాచారం. మిగతా పోస్టులను కూడా త్వరలోనే భర్తీ చేసేలా బోర్డు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గురుకుల బోర్డు పరిధిలో మొత్తం 9,210 పోస్టులకు గతేడాది ఆగస్టులో పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ట్రిబ్ ఆధ్వర్యంలో ఇటీవల వెల్లడించిన మెరిట్ జాబితా.. అనంతరం నిర్వహించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూల్లో గందరగోళం ఏర్పడిందని, సీక్వెన్స్ తప్పిందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల సమయంలో, ఆ తర్వాత కూడా అవరోహణ క్రమంలోనే భర్తీలు ఉంటాయని ట్రిబ్ చెబుతూ వచ్చింది. కానీ అమలులో అందుకు విరుద్ధంగా ఉన్నట్టు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. త్వరలో విడుదల చేయబోయే ఇతర పోస్టుల వివరాలనైనా ముందుగా తెలపాలని, వెబ్‌సైట్‌లో కూడా ముందుగా అప్‌లోడ్ చేయాలని కోరుతున్నారు.


అర్హత లేకున్నా 'అందాని'కి వైద్యం

- డెర్మటాలజిస్టుల పేరుతో చికిత్సలు
- 18 మందిపై డెర్మటాలజీ అసోసియేషన్ ఫిర్యాదు
- వారికి రాష్ట్ర వైద్యమండలి నోటీసులు
- ధ్రువపత్రాలతో రావాలని ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు, యువత ఇటీవలి కాలంలో అందానికి ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. అందంగా కనిపించేందుకు వైద్యుల (డెర్మటాలజిస్టు)ను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు నకిలీ వైద్యులు అమాయకుల నుంచి భారీగా డబ్బు దండుకుంటున్నారు. హైదరాబాద్ నగరంలో సరైన అర్హతలు లేకుండా ఇలాంటి చికిత్స చేస్తున్న కొందరు వైద్యుల బాగోతం బయటపడింది. నకిలీ డెర్మటాలజిస్టులపై చర్యలు తీసుకోవాలంటూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్, వెనెరియాలజిస్ట్స్, లెప్రొలాజిస్ట్స్ తెలంగాణ విభాగం తాజాగా రాష్ట్ర వైద్యమండలికి ఫిర్యాదు చేసింది. వారిపై చర్యలు తీసుకోవాలని కోరింది. అసోసియేషన్ ఫిర్యాదు మేరకు 18 మందికి రాష్ట్ర వైద్యమండలి మంగళవారం నోటీసులు ఇచ్చింది. దంత, ఆయుష్, ఆయుర్వేద వైద్యులతో పాటు ఫిజియోథెరపీ డిగ్రీ చేసినవారు కొందరు అర్హతలు లేకపోయినప్పటికీ డెర్మటాలజిస్టులమంటూ బోర్డులు పెట్టుకున్నారని, ఆ పేరుతో వైద్యం అందిస్తున్నారని అసోసియేషన్ తన ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాక కొన్ని చర్మసంబంధిత చికిత్సలు కూడా చేస్తున్నారని, సరైన విద్యార్హతలు లేకుండా ఇలా చేయడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని తెలిపింది. విచక్షణారహితంగా షెడ్యూల్ హెచ్ డ్రగ్స్ (సెర్వాయిడ్స్, ఇమ్యూనోసప్రెసివ్ డ్రగ్స్) రోగులకు రాసేస్తున్నారని, దాంతో వారి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. అసోసియేషన్ లేఖతో రాష్ట్ర వైద్యమండలి అప్రమత్తమైంది. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో డెర్మటాలజిస్టు పేరుతో వైద్య సేవలందిస్తున్న 18 మందికి నోటీసులు పంపింది. మూడు రోజుల్లోగా వారి విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలతో రాష్ట్ర వైద్యమండలికి రావాలని ఆదేశించింది. నోటీసులు అందుకున్న వారంతా తప్పకుండా ధ్రువపత్రాలతో రావాలని, లేకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వైద్యమండలి రిజిస్ట్రార్ డాక్టర్ హనుమంతరావు నోటీసుల్లో హెచ్చరించారు. తనిఖీల్లో సర్టిఫికెట్లు నకిలీవని తేలితే జాతీయ వైద్య మండలి చట్టం ప్రకారం వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని, ఐదు లక్షల జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష పడే అవకాశం ఉందని వైద్యమండలి సభ్యుడు డాక్టర్ గుండగాని శ్రీనివాస్ చెప్పారు. కాగా, ఇప్పటికే నలుగురు నకిలీ వైద్యులపై కేసులు పెట్టినట్లు వైద్యమండలి వర్గాలు తెలిపాయి.

కాళేశ్వరంపై సీబీఐ విచారణకు కేంద్రం సిద్ధం

- మేడిగడ్డపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలాడుతున్నాయ్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హనుమకొండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారాన్ని ఉపయోగించుకుని రాజకీయంగా లబ్ధిపొందేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కూడబలుక్కుని డ్రామాలాడుతున్నాయని మండిపడ్డారు. ఓ పార్టీ కృష్ణా జలాలపై, మరో పార్టీ కాళేశ్వరంపై రచ్చ చేస్తూ.. లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధికి విన్యాసాలు చేస్తున్నాయని విమర్శించారు. మంగళవారం ఆయన హనుమకొండలో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత హంటర్‌రోడ్‌లో బీజేపీ వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించారు. వేయిస్తంభాల ఆలయం వద్ద పనులను పరిశీలించారు. అంతకు ముందు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి వెళ్లని కేసీఆర్.. కృష్ణా జలాలపై నల్లగొండలో బహిరంగ సభకు వెళ్లడం విడ్డూరంగా ఉంది. కేసీఆర్‌కు పోటీగా సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలతో మేడిగడ్డకు పోలోమని బయలుదేరారు. ఇంతకు ముందే మేడిగడ్డకు రాహుల్‌గాంధీ, ఒకరి వెనక ఒకరు క్యూకట్టి మంత్రులు వెళ్లారు కదా? ఇప్పుడు మళ్లీ వెళ్లాల్సిన అవసరమేంటి?" అని ప్రశ్నించారు. సీబీఐ విచారణకు కేంద్రం సిద్ధమేనని, ఆమేరకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినా.. స్పందన లేదని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ అక్టోబరు 21న కుంగిందని, ఆ వెంటనే కేంద్ర జలశక్తి శాఖ రంగంలోకి దిగి.. విచారణ జరిపిందని గుర్తుచేశారు. కేంద్ర జలశక్తి శాఖ నివేదికలో ఉన్న అంశాలనే విజిలెన్స్ ప్రస్తావించింది. కాంగ్రెస్ సర్కారు దీనిపై చర్యలు తీసుకోవడానికి బదులుగా.. రాజకీయ లబ్ధికి వినియోగించుకోవాలని ప్రయత్నిస్తోంది. లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్-బీఆర్ఎస్ కూడబలుక్కుని నాటకాలు ఆడుతున్నాయి" అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలను బీజేపీ గెలుస్తుందన్నారు. హైదరాబాద్‌లో ఒవైసీని సైతం సవాల్ చేస్తామన్నారు. అనంతరం కిషన్‌రెడ్డి వేయి స్తంభాల ఆలయంలో జరుగుతున్న కల్యాణ మండపం పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర పురావస్తు చట్టంలో త్వరలో కొన్ని సవరణలను తీసుకురానున్నట్లు వెల్లడించారు. "ప్రస్తుత చట్టంలోని కఠిన నిబంధనల వల్ల పురావస్తు శాఖ పరిధిలోని ఆలయాల సందర్శనకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పూజల నిర్వహణలో ఆటంకాలెదురవుతున్నట్లు గుర్తించాం. ములుగు జిల్లాలో రూ.900కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న గిరిజన విశ్వవిద్యాలయం తరగతులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తామన్నారు. ఈ వర్సిటీపై అవగాహన కల్పించేందుకు సమ్మక్క-సారలమ్మ జాతరలో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

కాంగ్రెస్‌లోకి గ్రేటర్ డిప్యూటీ మేయర్!

- సీఎం రేవంత్‌ను కలిసిన శ్రీలతా రెడ్డి దంపతులు
- రెండు, మూడు రోజుల్లో చేరిక.. బీఆర్ఎస్‌కు మరో షాక్



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన శ్రీలతా శోభన్‌రెడ్డి దంపతులు

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో బీఆర్ఎస్‌కు మరో షాక్! జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి దంపతులు పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. రెండు, మూడు రోజుల్లో వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరే అవకాశముంది. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి శోభన్‌రెడ్డి ఆ పార్టీలో ఉన్నారు. 2021లో ఆయన భార్య శ్రీలతారెడ్డికి డిప్యూటీ మేయర్‌గా అవకాశం దక్కింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఆయన భావించారు. పద్మారావునే పార్టీ మరోసారి బరిలో నిలపడంతో వెనక్కి తగ్గారు. ప్రస్తుతం సికింద్రాబాద్ ఎంపీగా బరిలో నిలిచేందుకు అవకాశం కల్పించాలని కేటీఆర్‌ను కలిసి కోరారు. ఇదే విషయమై పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసేందుకు ఐదారు రోజుల క్రితం నంది నగర్‌లోని నివాసానికి వెళ్లారు. నాలుగు గంటలు వేచి చూసినా కలిసేందుకు కేసీఆర్ ఆసక్తి చూపలేదని, అంతకుముందు ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లినా అనుమతించలేదని సమాచారం. ఈ నేపథ్యంలో వారు తాజాగా సీఎంను కలవడంతో వారు హస్తం గూటికి చేరడం దాదాపు ఖాయమైంది. బీఆర్ఎస్‌లో ఉద్యమకారులకు అన్యాయం జరుగుతోందని, ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇచ్చే విషయాన్ని పక్కన పెడితే కనీసం అగ్రనేతలను కలిసే పరిస్థితి లేకపోవడం విచారకరమని శోభన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఆర్టీసీ జేడీగా అపూర్వరావు బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఆర్టీసీ నూతన జాయింట్ డైరెక్టర్(జేడీ)గా కే అపూర్వ రావు బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం బస్‌భవన్‌లో ఆమె ఈ బాధ్యతలు చేపట్టారు. టీఎస్ఆర్టీసీ జేడీగా ఒక మహిళా అధికారిణి నియమితులవడం ఇదే తొలిసారి. జేడీగా బాధ్యతలు స్వీకరించిన కె.అపూర్వరావుకు సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ శుభాకాంక్షలు తెలియజేశారు. సంస్థ అభివృద్ధికి నిబద్ధతతో పనిచేయాలని ఆమెకు సూచించారు. ఈ సందర్భంగా అపూర్వరావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకం విజయవంతంగా అమలవుతోందని, దానిని మరింత సమర్థవంతంగా అమలుచేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

ఇంటికే 'మేడారం' ప్రసాదం డెలివరీ

మేడారం సమ్మక్క- సారలమ్మ ప్రసాదాన్ని భక్తులకు ఇంటికే అందించేందుకు టీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ఇందుకు దేవాదాయ శాఖతో టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం ఒప్పందం కుదుర్చుకుంది. ఈనెల 14 నుంచి 25 వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో భక్తులు ప్రసాదాన్ని బుక్ చేసుకునే సదుపాయాన్ని ఆర్టీసీ కల్పించింది. అందుకు రూ.299 చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో అయితే htpps://Rb.gy/q5rj68 లింక్ ద్వారా లేదా పేటీఎం ఇన్‌సైడర్ యాప్‌లో బుక్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు సమీపంలోని లాజిస్టిక్స్ కౌంటర్లను లేదా టీఎస్ఆర్టీసీ కాల్‌సెంటర్ నంబర్లు 040-69440069, 040-69440000, 040-23450033 లను సంప్రదించాలని సూచించారు.

డిప్యూటీ సీఎం భట్టికి సోదర వియోగం

- ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు కన్నుమూత



వైరా, ఫిబ్రవరి 13: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సోదరుడు విశ్రాంత ఆయూష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు(72) మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. భట్టికి ఆయన స్వయానా అన్నగారు కాగా, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవికి తమ్ముడు. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన మల్లు అఖిలాండం, మాణ్యక్యమ్మ దంపతుల తొమ్మిదిమంది సంతానంలో వెంకటేశ్వర్లు ఒకరు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉమ్మడి ఏపీలో హోమియోపతి డాక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఉద్యోగవిరమణ అనంతరం ఖమ్మం, వైరాల్లో హోమియో మందులు పంపిణీ చేస్తూ వందలాదిమంది రోగులకు సేవలందించారు. భౌతికకాయాన్ని స్థానికుల సందర్శనార్థం వైరాలోని ఆయన నివాసం వద్ద ఉంచారు. కాగా, స్వగ్రామంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. సోదరులు భట్టి, మల్లురవి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

నిషేధిత జాబితాలోకి శివబాలకృష్ణ ఆస్తులు!

- రిజిస్ట్రేషన్ల శాఖ, కలెక్టర్లకు ఏసీబీ లేఖలు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు దర్యాప్తులో అవినీతి ఏసీబీ మరో అడుగు ముందుకేసింది. శివబాలకృష్ణ అక్రమంగా సంపాదించిన ఆస్తులను నిషేధిత జాబితాలోకి చేరుస్తోంది. కేసు తేలేవరకు ఆయా భూములు, ఇతర ఆస్తుల క్రయవిక్రయాలు జరగకుండా ఈ చర్యలు తీసుకుంటోంది. ఆ మేరకు ఏసీబీ ఉన్నతాధికారులు ఆయా జిల్లాల కలెక్టర్లు, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులకు లేఖలు రాశారు. ఏపీలోనూ శివబాలకృష్ణ ఆస్తులు ఉండడంతో.. ఆ పత్రాలను స్వాధీనం చేసుకున్న ఏసీబీ.. అక్కడి భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చాలని కోరుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. మరోవైపు..శివబాలకృష్ణ బినామీలను అధికారులు విచారిస్తున్నారు.

జాతీయ చలనచిత్ర అవార్డుల్లో కీలక మార్పులు

ప్రతిభ ప్రదర్శించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, ఉత్తమ విలువలు కలిగిన చిత్రాలను ఎంపిక చేసి ప్రతి ఏటా ఇచ్చే జాతీయ చలనచిత్ర అవార్డుల్లో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇప్పటి వరకూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరు మీద ఇచ్చే 'ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు' అవార్డ్‌ను ఇకపై ఆ పేరుతో కాకుండా 'ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు' పేరుతో ఇస్తారు. అంటే అందులో ఉన్న 'ఇందిరాగాంధీ' పేరు తొలిగించారన్న మాట. ఈ విభాగంలో దర్శకుడితో పాటు నిర్మాతకు కూడా ప్రైజ్ మనీ ఇచ్చేవారు. ఇకపై దర్శకుడికి మాత్రమే ప్రైజ్ మనీ ఇస్తారు.

అలాగే బాలీవుడ్ నటి నర్గిస్ పేరు మీద జాతీయ సమైక్యతను పెంపొందించే చిత్రానికి ఓ అవార్డ్ ఇస్తున్నారు. ఇకపై ఆ అవార్డులో నర్గిస్ పేరు కూడా ఉండదు. 'జాతీయ, సామాజిక, పర్యావణ విలువలు పెంపొందించే ఉత్తమ చిత్రం' పేరుతో ఆ అవార్డ్ అందజేస్తారు.

కేంద్ర సమాచార శాఖ అదనపు కార్యదర్శి నీర్జా శేఖర్ నేతృత్వంలోని కమిటీ సమావేశమై జాతీయ చలనచిత్ర అవార్డులలో కీలక మార్పులు చేస్తూ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో పాటు సెన్సార్ బోర్డ్ చైర్మన్ ప్రసూన్ జోషి, సినీ ప్రముఖులు ప్రియదర్శన్, విపుల్ షా, ఛాయాగ్రాహకుడు నల్లముత్తు కూడా ఉన్నారు. జాతీయ చలనచిత్ర అవార్డులు 2022 కోసం ఎంట్రీలు స్వీకరించడానికి జనవరి 30తో గడువు ముగియడంతో ఈ కమిటీ సమావేశమై పలు కొత్త నిర్ణయాలు తీసుకుంది. ఈ విషయాన్ని కమిటీ సభ్యుడైన దర్శకుడు ప్రియదర్శన్ ధ్రువీకరించారు. 'నేను కూడా కొన్ని సూచనలు చేశాను. సౌండ్ విభాగానికి కూడా అవార్డులు ఇవ్వాలన్నది వాటిలో ఒకటి' అని ఆయన వెల్లడించారు.

కీలక మార్పులు ఇవే

- చలనచిత్ర పరిశ్రమకు ఇతోధిక సేవలు అందించిన చలనచిత్ర ప్రముఖులకు ఇచ్చే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్‌కు ఇంతవరకూ రూ పది లక్షలు నగదు ఇస్తున్నారు. ఆ మొత్తాన్ని ఇప్పుడు రూ 15 లక్షలకు పెంచారు.
- స్వర్ణకమలం అవార్డ్ పొందిన వారికి ఇకపై రూ. మూడు లక్షలు, రజిత కమలం పొందిన వారికి రూ రెండు లక్షలు అందజేస్తారు. ఉత్తమ చిత్రం, ఉత్తమ తొలి చిత్రం, పూర్తి వినోదాత్మక చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ బాలల చిత్రం .. విభాగాలకు స్వర్ణ కమలం అందిస్తారు. ఇక మిగిలిన అన్ని విభాగాలు.. అంటే ఉత్తమ ప్రబోధాత్మక చిత్రం, నటనా విభాగంలో వచ్చే అవార్డులు, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ సంగీత దర్శకుడు.. ఇలాంటి అన్ని అవార్డులకు రజిత కమలం అందిస్తారు.
- ఇప్పటివరకూ బెస్ట్ ఏనిమేషన్ ఫిల్మ్', 'బెస్ట్ స్పెషల్ ఎఫెక్ట్స్ ఫిల్మ్' అంటూ విడివిడిగా అవార్డులు ఇస్తున్నారు. ఇకపై ఈ రెంటినీ కలిపేసి 'బెస్ట్ ఎవిజీసీ(యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) పేరుతో అవార్డులు ఇస్తారు.
- బెస్ట్ ఆడియోగ్రఫీ విభాగంలో మూడు సబ్ కేటగిరిలు ఉన్నాయి. 'సౌండ్ రికార్డిస్ట్', 'సౌండ్ డిజైనర్', 'ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్ రికార్డిస్ట్' అని. ఇకపై ఇవన్నీ కలిపి 'బెస్ట్ సౌండ్ డిజైనర్' పేరుతో అవార్డ్ ఇస్తారు. ప్రైజ్ మనీని కూడా యాభై వేల నుంచి రెండు లక్షల రూపాయలకు పెంచారు.
- ఉత్తమ సంగీత దర్శకుడు పేరుతో ఇచ్చే అవార్డ్‌ను ఇకపై 'ఉత్తమ నేపథ్య సంగీతం' పేరుతో ఇవ్వనున్నారు.
- ప్రత్యేక జ్యూరీ అవార్డ్‌ను తొలగించి ఆ స్థానంలో ఫీచర్ ఫిల్మ్‌కు ఒక అవార్డ్, నాన్ ఫీచర్ ఫిల్మ్‌కు ఒక అవార్డ్ ను ఇచ్చే అధికారాన్ని జ్యూరీకి ఇచ్చారు
- నాన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఇచ్చే కొన్ని అవార్డులు తొలిగించారు. మరికొన్ని కలిపేశారు. 'బెస్ట్ స్క్రిప్ట్' పేరుతో కొత్తగా ఒక అవార్డును ఏర్పాటు చేశారు.



మరోసారి జోడీ

మాధవన్, కంగనా రనౌత్ జంట ముచ్చటగా మూడోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'తను వెడ్స్ మను', 'తను వెడ్స్ మను రిటర్న్స్' చిత్రాలు సూపర్ హిట్ అయ్యాయి. తాజాగా మరోసారి ఈ జంట స్కీన్ షేర్ చేసుకోబోతోంది. ఈ విషయాన్ని కంగన, మాధవన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సోమవారం ప్రకటించారు. 'ఓ సర్ప్రైజ్ మూవీ కోసం నా అభిమాన నటుడితో మరోసారి కలసి నటించబోతున్నాను' అని కంగన తెలిపారు. మాధవన్‌తో దిగిన ఫొటోను ఆమె షేర్ చేశారు. ప్రతిభావంతురాలైన కంగనా రనౌత్‌తో కలసి నటించేందుకు ఆసక్తిగా ఉన్నాను అని మాధవన్ పేర్కొన్నారు. అయితే వీరు చేయబోయే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా ప్రకటించాల్సి ఉంది.

పాచికల ఆట నేపథ్యం



వైవిధ్యమైన కథాంశాలు ఎన్నుకుని సినిమాల్లో నటించే మలయాళ అగ్ర నటుడు మమ్ముట్టి తెలుగు ప్రేక్షకులకూ సుపరిచితులే. అనువాద చిత్రాలతో కాకుండా నేరుగా కొన్ని తెలుగు సినిమాల్లో ఆయన నటించారు. ఇప్పుడు మరో విభిన్న కథా చిత్రం 'భ్రమ యుగం'తో ఆయన ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో వైనాట్ స్టూడియో నిర్మించిన చిత్రం ఇది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రం ట్రైలర్‌ను ఇటీవల అబుదాబీలో విడుదల చేశారు. చాలా కాలం తర్వాత బ్లాక్ అండ్ వైట్‌లో తయారైన ఈ సినిమా ట్రైలర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగిస్తోంది. పాచికల ఆట నేపథ్యంలో అనుక్షణం ఉత్కంఠ కలిగించే విధంగా చిత్రం ఉంటుందని దర్శకనిర్మాతలు చెబుతున్నారు. ఓ గాయకుడి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. మొదట మలయాళంలో మాత్రమే విడుదల చేసి, ఆ తర్వాత మిగిలిన భాషల్లో రిలీజ్ చేయాలని నిర్మాణ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. 'భ్రమయుగం' చిత్రానికి సినిమాటోగ్రఫీ: షెహనాద్ జలాల్, సంగీతం: క్రిస్టో జేవియర్, మాటలు: టి.డి. రామకృష్ణన్, నిర్మాతలు: చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్.

వినోదాల విందు



హీరో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రుతో కలసి నిర్మిస్తున్న చిత్రం 'సుందరం మాస్టర్'. హర్ష చెముడు, దివ్యశ్రీపాద ప్రధాన పాత్రలు పోషించారు. కల్యాణ్ సంతోష్ దర్శకుడు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. మిర్యాల మెట్ట అనే మారుమూల గ్రామానికి ఇంగ్లీష్ టీచర్‌గా వెళ్లిన సుందరం అక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడనేది వినోదాత్మకంగా తెరకెక్కించినట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల. సినిమాటోగ్రఫీ: దీపక్

హ్యాట్రిక్ సాధిస్తామనే నమ్మకం ఉంది

రాజేశ్ దండా



'పంపిణీదారుడిగా నాకు పన్నెండేళ్ల అనుభవం ఉంది. సందీప్ కిషన్, నేను, దర్శకుడు ఆనంద్ స్నేహితులం. హాస్య మూవీస్ సంస్థను ప్రారంభించి తీయాలనుకున్న మొదటి సినిమా 'ఊరు పేరు భైరవకోన'. ఆనంద్ చెప్పిన కథ కొత్తగా ఉండడంతో ఇలాంటి కంటెంట్‌తో సినిమా తీస్తే హిట్ అవుతుందనే నమ్మకంతోనే ఈ సినిమా తీశాం. సందీప్ కిషన్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్ చిత్రం ఇది. బిజినెస్ కూడా అదే స్థాయిలో జరిగింది. అందుకే విడుదలకు ముందే హ్యాపీగా ఉన్నాం' అన్నారు నిర్మాత రాజేశ్ దండా. సందీప్ కిషన్ హీరోగా ఆయన నిర్మించిన 'ఊరు పేరు భైరవకోన' చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో చిత్ర విశేషాలు పంచుకొన్నారు. నచ్చిన కథలు చేసుకుంటూ వెళుతున్నామని చెబుతూ 'మా సంస్థ సక్సెస్ ట్రాక్‌ను 'ఊరు పేరు భైరవకోన' కొనసాగించి హ్యాట్రిక్ అందిస్తుందనే నమ్మకం ఉంది. ప్రీమియర్ షోలన్నీ ఫుల్ కావడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు అద్దం పడుతుంది. మా దర్శకుడు చెబితే సినిమాకు కచ్చితంగా సీక్వెల్ ఉంటుంది. ఈ కథకు సీక్వెల్, ప్రీక్వెల్ .. రెండూ చేయచ్చు. ఆ ఆలోచన ఉంది' అని ఆయన చెప్పారు. చిత్రంలోని అంశాల గురించి వివరిస్తూ 'ఇదొక ఫాంటసీ థ్రిల్లర్. 'భైరవకోన' అనే ఊరులో ఎవరూ ఊహించని సంఘటనలు జరుగుతుంటాయి. అలాగే గరుడ పురాణం పుస్తకంలో మిస్ అయిన పేజీలకు, ఈ కథకు ఉన్న లింక్ కూడా ఆసక్తికరంగా ఉంటుంది. చిత్రంలో 47 నిముషాల అద్భుతమైన సీజీ వర్క్ ఉంది. సందీప్ కిషన్ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. తనే ఈ సినిమాకు హెల్ప్ అయ్యాడనే విధంగా నటించాడు. ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిచ్చే సినిమా ఇది' అని రాజేశ్ చెప్పారు. నిర్మాత అనిల్ సుంకరతో ఉన్న అనుబంధం గురించి చెబుతూ 'మొదట నేను కథ వింటాను. నాకు నచ్చితే అనిల్ వింటారు. అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు. ఈ సినిమాలో కూడా ఆయన ఓ విలువైన సూచన చేశారు. అది బాగా హెల్ప్ అయింది' అని తెలిపారు.

సామాజిక బాధ్యతతో సినిమా తీశాం



వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'రాజధాని ఫైల్స్'. అఖిలన్, వీణ, వినోద్‌కుమార్, వాణీ విశ్వనాథ్ కీలక పాత్రలు పోషించారు. భాను దర్శకత్వంలో కంఠంనేని రవిశంకర్ నిర్మించారు. ఈ నెల 15న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో నిర్మాత మాట్లాడుతూ రైతులు స్వచ్ఛందంగా ఇన్ని వేల ఎకరాల భూములు ఇస్తే దానిని ఎగతాళి చేస్తూ, వారిని మానసిక క్షోభకు గురి చేసిన సంఘటనలు ఈ మధ్య కాలంలో చోటు చేసుకున్నాయి. దానిని స్ఫూర్తిగా తీసుకుని రైతుల పక్షాన ఒక సినిమా తీయాలని అనుకున్నాం. అయితే ఈ సినిమా ఏ పార్టీకి వ్యతిరేకం కాదు. రైతుల కన్నీళ్లు తుడిచే విధంగా సమాజాన్ని చైతన్యపరుస్తూ ఓ సామాజిక బాధ్యతతో ఈ సినిమా నిర్మించాం.. దర్శకుడు భాను అద్భుతంగా తీశారు. సినిమాకు అఖండ విజయం అందించి రైతులకు సంఘీభావం తెలియజేయాలి' అని కోరారు. ఇందులో తను రైతు పాత్ర పోషించాననీ, ఇది పొలిటికల్ ఫిల్మ్ కాదనీ, రైతుల ఆవేదనని తెలియజేసే కథ అని వినోద్‌కుమార్ చెప్పారు. ఈ సినిమాలో తను భాగం అయినందుకు ఆనందంగా ఉందని వాణీ విశ్వనాథ్ చెప్పారు. ఏడు వందల మంది రైతులతో ఈ సినిమా తీశామని దర్శకుడు భాను చెప్పారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు, మహిళలు ఇందులో నటించారని తెలిపారు. అందరికీ ఉపయోగపడే సినిమా ఇదన్నారు.

శివనాగిని విడుదలకు సిద్ధం

సురేశ్, మమతా రాహుత్ హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'శివనాగిని'. సుమన్, షాయాజీషిండే, అజయ్ ఘోష్ కీలకపాత్రలు పోషించారు. మొండెం శ్రీధర్ దర్శకత్వంలో చదలవాడ హరిబాబు నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "శివనాగిని'లో 30 నిమిషాల గ్రాఫిక్ సీక్వెన్స్ ఉంది. మారెడుమల్లి అడవుల్లో అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరణ చేశాం. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జాన్ పోట్ల. సినిమాటోగ్రఫీ: యామేష్



ఎమోషనల్ సిద్ధాంతం



ఒకప్పటి బాలనటుడు దీపక్ సరోజ్ హీరోగా అరంగేట్రం చేస్తున్న 'సిద్ధార్థ్ రాయ్' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. యశస్వీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలోని నువ్వు నమ్మిన 'సిద్ధాంతం' అంటూ సాగే పాటను మంగళవారం విడుదల చేశారు. సినిమాలో చాలా కీలకమైన ఈ పాటను సంగీత దర్శకుడు రధన్ పవర్‌ఫుల్ ఎమోషనల్ నంబర్‌గా కంపోజ్ చేశారు. బాలాజీ రాసిన ఈ పాట కథలోని లోతుని తెలియజేస్తుంది. సింగర్ శరత్ సంతోష్ మనసుని హత్తుకొనే విధంగా ఈ పాట పాడారు.. ఈ పాటలో దీపక్ అభినయం ఆకట్టుకొనే విధంగా ఉంది. యూనిక్ కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మిస్తున్నారు.

స్నేహ గీతం



ఇంద్ర, కోమల్ నాయర్, దీపు, స్వాతి శర్మ ప్రధాన తారాగణంగా స్నేహం గొప్పతనాన్ని తెలిపే కథాంశంతో రూపొందిన చిత్రం 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు'. లక్ష్మణ్ జెల్ల దర్శకత్వంలో చంద్ర ఎస్ చంద్ర, డాక్టర్ విజయ రమేశ్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'నా కల' అంటూ సాగే గీతాన్ని సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'చిత్రీకరణ దాదాపు పూర్తయింది. కొత్త, పాత నటుల కాంబినేషన్‌లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం' అన్నారు. గాయని సునీత ఆలపించిన ఈ గీతం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు అన్నారు. ఇందులో తన పాత్ర సరికొత్తగా ఉండబోతోందని ఇంద్ర చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రావణ్ భరద్వాజ. సినిమాటోగ్రఫీ: రాహుల్ మాచినేని

హృదయాన్ని కదిలించే ప్రేమకథ



అభిషేక్ పచ్చిపాల, నజియాఖాన్ జంటగా నటించిన చిత్రం 'జస్ట్ ఎ మినిట్'. పూర్ణస్ యశ్వంత్ దర్శకత్వంలో అర్షద్ తన్వీర్, డాక్టర్ ప్రకాశ్ ధర్మపురి నిర్మించారు. ఇటీవలే చిత్రబృందం ఆడియోను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'గాఢతతో నిండిన ప్రేమకథాంశంతో రూపొందించిన చిత్రం 'జస్ట్ ఎ మినిట్'. ఈ సినిమాకు సంగీతం ప్రత్యేకాకర్షణ' అన్నారు. 'ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించి, ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథా చిత్రం ఇది' అని నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్ కే బాజీ. సినిమాటోగ్రఫీ: అమీర్

ఎంఎస్‌పీకి చట్టబద్ధత ఎందుకు?

» రైతులెందుకు పట్టుబడుతున్నారు?

» ప్రభుత్వానికి ఉన్న ఇబ్బందులేంటి?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ రైతులు ఆందోళనకు దిగారు. దీనికి ప్రధాన కారణం ప్రైవేటు వ్యాపారుల దోపిడీనే అనేది రైతు సంఘాలు చెబుతున్న మాట. ప్రస్తుతం ప్రభుత్వం సేకరించే బియ్యం, గోధుమలకు ఎంఎస్‌పీ నిర్ణయిస్తోంది. అయితే.. దీనికి చట్టబద్ధత లేనికారణంగా ప్రైవేటు వ్యాపారులు తమకు తోచినంత చేతిలో పెడుతున్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్క చెరకుకు మాత్రమే దేశవ్యాప్తంగా ఎంఎస్‌పీ హామీ ధర లభిస్తోంది. చక్కెర కర్మాగారాలు చట్టబద్ధంగా చెరకుకు ధర చెల్లిస్తున్నాయి. మిగిలిన పంటలకు ఈ తరహా హామీ లేదు. కేంద్రం తీసుకువచ్చిన వివాదాస్పద మూడు రైతు చట్టాలను వెనక్కి తీసుకున్న అనంతరం.. మోదీ ప్రభుత్వం రైతు సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ శాఖ మాజీ సెక్రటరీ సంజయ్ అగర్వాల్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. దీనిలో పలువురు మేధావులు, మంత్రులు సహా నాలుగు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులను కూడా నియమించింది. అయితే, పంజాబ్, హరియాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు ఈ కమిటీలో అవకాశం కల్పించలేదు. ఈ కమిటీ ఇప్పటి వరకు నివేదికను సమర్పించలేదు. ఈ కమిటీ పరిశీలనకు పంపించిన విషయాల్లో ఎంఎస్‌పీకి చట్టబద్ధత అంశాన్ని పేర్కొనకపోవడం గమనార్హం. అయితే, ఎంఎస్‌పీకి సంబంధించిన అంశాలపై సూచనలు చేయాలని మాత్రం పేర్కొన్నారు. కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్(సీఏసీపీ)ను మరింత స్వతంత్రంగా పనిచేసేలా సూచనలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ మార్కెట్ల వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా రైతుల ఉత్పత్తులకు అత్యధిక విలువ దక్కేలా చూడడం, ఎగుమతుల అవకాశాలను పెంచడంపై దృష్టి సారించడం వంటి బాధ్యతలను అప్పగించారు. ఇదిలావుంటే, సీఏసీపీ సిఫారసుల మేరకు 22 పంటలకు ఎంఎస్‌పీలను ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత చట్టం కింద గోధుమలు, బియ్యం సేకరణకే పరిమితమైంది. దీంతో వాటికే ఎంఎస్‌పీ లభిస్తోంది. వీటితోపాటు కొన్నింటిని(పత్తి, ఆవాలు, శనలు, వేరు శనగలు, పప్పులు) అప్పుడప్పుడు మాత్రమే సేకరిస్తున్నారు. దీంతో రైతులు వీటిని ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎంఎస్‌పీకి చట్టబద్ధతను కోరుతున్నారు.

ఇవీ సంక్లిష్టతలు

- ఎంఎస్‌పీ పరిధిలోకి వచ్చే ఉత్పత్తులు ఏపీఎంసీ (మార్కెట్ కమిటీలు)ల్లో విక్రయించడం లేదు. దీంతో కొనుగోలుదారు, విక్రయించిన రైతుల రికార్డులు అందుబాటులో ఉండడం లేదు. ఇలాంటి లావాదేవీలకు ఎంఎస్‌పీ గ్యారెంటీ సాధ్యం కాదు.
- చిన్నకారు రైతులు తమ ఉత్పత్తులను గ్రామీణ వ్యాపారులకే విక్రయిస్తున్నారు. వీరంతా ఏపీఎంసీ పరిధిలో లేరు.
- 2018లో మహారాష్ట్రలో ఎంఎస్‌పీని అమలు చేశారు. ఎంఎస్‌పీని ఉల్లంఘించిన వ్యాపారులను జైలుకు కూడా పంపించారు. దీంతో వ్యాపారులు పంట కొనుగోళ్లను బహిష్కరించారు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది.
- ఉత్పత్తులు ఇబ్బడిముబ్బడిగా పెరిగినప్పుడు ఎంఎస్‌పీ చెల్లించి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు సిద్ధంగా లేకపోతే.. ఆ ఉత్పత్తులను రైతుల నుంచి కొనుగోలు చేసి, నిల్వ చేసుకునే పరిస్థితి ప్రభుత్వానికి లేదు.

లోకం తీరు



రైతుల చలో ఢిల్లీ ఉద్రిక్తం

డ్రోన్లతో బాష్పవాయు ప్రయోగం చేసిన పోలీసులు.. రణరంగంలా పంజాబ్, హరియాణా సరిహద్దులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పొలాలనన్నీ హలాలదున్నీ ఇలాతలంలో హేమం పిండగ, జగానికంతా సౌఖ్యం నిండగ విరామమెరుగక పరిశ్రమించే.. రైతన్నల 'చలో ఢిల్లీ' కార్యక్రమం ఉద్ధృతంగా సాగుతోంది. రైతే రాజు అనే పాలకులే.. రాజధానికి చేరకుండా రైతులకు అడుగడుగునా సృష్టించిన అడ్డంకులను ఎదుర్కొంటూ, బాష్పవాయు ప్రయోగాలను, పోలీసు బలప్రయోగాలను, నిర్బంధకాండను ఛేదించుకుంటూ ముందుకు సాగుతోంది. అన్ని పంటలకు కనీస మద్దతు ధర హామీ చట్టం, రుణమాఫీ, రైతులకు పింఛన్లు తదితర డిమాండ్ల అమలు కోసం సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా 'చలో ఢిల్లీ' నిరసనకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. సోమవారం అర్ధరాత్రి కేంద్రమంత్రులతో రైతు నేతల చర్చలు విఫలం కావడంతో మంగళవారం ఉదయం 10 గంటలకు.. 200 రైతు సంఘాల ఆధ్వర్యంలో పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ నుంచి లక్ష మందికి పైగా రైతులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆరు నెలలకు సరిపడా ఆహారం, ఇతర నిత్యావసరాలను తీసుకుని వందలాది ట్రాక్టర్ ట్రాలీల్లో, ఇతర వాహనాల్లో బయల్దేరారు. అయితే హరియాణాలో బీజేపీ సర్కారు ఉండడంతో.. రైతులు రాజధానికి చేరకుండా అడ్డుకునేందుకు పలు ప్రాంతాల్లో అడ్డంకులు సృష్టించింది. 15 జిల్లాల్లో 144 సెక్షన్ విధించింది. 64 కంపెనీల పారామిలటరీ బలగాలను.. రాష్ట్ర పోలీసు శాఖకు చెందిన 50 కంపెనీల బలగాలను రంగంలోకి దించింది. పంజాబ్‌తో సరిహద్దులున్న అంబాలా, జింద్, ఫతేహాబాద్, కురుక్షేత్ర, సిర్సా ప్రాంతాల్లో వారు ముళ్లకంచెలు, కాంక్రీట్ బారియర్లు పెట్టారు. అల్లర్లను నియంత్రించే వాహనాలను, జలఫిరంగులను మోహరించారు. వాటిని ఛేదించుకుని ముందుకు వెళ్లే ప్రయత్నం చేసిన రైతులపై బాష్పవాయు ప్రయోగం చేశారు. ముఖ్యంగా.. పంజాబ్, హరియాణా సరిహద్దు శంబు వద్ద పదివేలకు పైగా రైతులు చేరుకుని నిరసన తెలుపుతూ.. పోలీసులపైకి రాళ్లు విసరడం, వంతెనపై ఉన్న బారికేడ్లను కిందికి విసరడంతో పోలీసులు వారిపై డ్రోన్ల ద్వారా టియర్ గ్యాస్ ప్రయోగించారు. వాటర్ క్యానన్లను ప్రయోగించి రైతులను నిరోధించారు. ఇరువర్గాల మధ్య కొన్ని గంటలపాటు ఈ ఘర్షణ కొనసాగింది. పోలీసులు ప్రయోగించిన ఓ రబ్బర్ బుల్లెట్ తగిలి సత్వీర్ అనే రైతు కంటికి తీవ్రగాయమైంది. గాయం కారణంగా కిందపడ్డ సత్వీర్ పైకి లేచేలోపే పోలీసులు అతడున్న చోటుకు టియర్ గ్యాస్ షెల్ విసిరారు. ఇంతలో అక్కడున్న రైతులు అతణ్ని చేతులపై ఎత్తుకుని ఆస్పత్రికి తరలించే యత్నం చేశారు. కొన్నిచోట్ల రైతులు రహదారులపై అమర్చిన కాంక్రీట్ బారికేడ్లను దాటుకుని ముందుకెళ్లేందుకు తమ ట్రాక్టర్లను పక్కనే ఉన్న పొలాల్లోకి దించి.. ఆ అడ్డంకులను దాటాక మళ్లీ రోడ్లపైకి తెచ్చారు. ఢిల్లీకి వేల సంఖ్యలో వాహనాల్లో బయల్దేరిన రైతులు కొన్ని ఎక్స్‌కవేటర్లను కూడా తీసుకొచ్చారు. దారి మధ్యలో బారికేడ్లను తొలగించేందుకు వాటిని వినియోగించారు. చాలాచోట్ల పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించినప్పుడు అవి తమ వద్ద పడగానే.. రైతులు వాటిపై జనపనార సంచులు కప్పేసి పొగ వ్యాపించకుండా ఉండేందుకు ప్రయత్నించారు. కాగా.. ఖట్టర్ సర్కారు హరియాణాను కశ్మీర్ లోయలా మార్చేసిందని కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ నేత శర్వణ్ సింగ్ పంధర్ మండిపడ్డారు.



రైతులు నామినేట్ చేయలేదు..

కనీస మద్దతు ధరపై 2022 జూలైలో తాము ఏర్పాటు చేసిన కమిటీలో.. రైతు సంఘాలు తమ ప్రతినిధులను నామినేట్ చేయలేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2022 జూలై 12న ఈ కమిటీని ఏర్పాటుపై కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ కమిటీలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు ఉంటారని పేర్కొంది. వ్యవసాయ శాఖ మాజీ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ నేతృత్వంలో ఏర్పాటయ్యే కమిటీలో మొత్తం 29 మంది సభ్యులుంటారని వెల్లడించింది. అందులో 25 మంది పేర్లను ప్రభుత్వం పేర్కొంది. మరో ముగ్గురి పేర్లను.. కిసాన్ సంయుక్త మోర్చా ప్రతిపాదిస్తే చేరుస్తామని వివరించింది. కానీ ఆ పేర్లను రైతులు ఇప్పటికీ నామినేట్ చేయలేదని తాజాగా వెల్లడించింది. కాగా, రైతులపై మిలటరీ, బాష్పవాయు ప్రయోగం దుర్మార్గమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం తక్షణమే రైతులతో చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

ఢిల్లీ చుట్టూ బారికేడ్ల కోట..

రైతులు ఢిల్లీలోకి అడుగుపెట్టకుండా పోలీసులు ముళ్లకంచెలు, కాంక్రీట్ శ్లాబ్‌లతో రోడ్లపై కోట కట్టారంటే అతిశయోక్తి కాదు. హరియాణా, పంజాబ్, యూపీ రాష్ట్రాలతో ఢిల్లీకి ఉన్న సరిహద్దుల వద్ద సిమెంటు దిమ్మలు, ముళ్ల కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. గతంలో రైతు ఉద్యమాలకు ప్రధాన నిరసన స్థలాలుగా ఉన్న సింఘూ, టిక్రీ సహా ఇతర పాయింట్ల వద్ద పోలీసులను భారీగా మోహరించారు. నిరసనల నేపథ్యంలో నగరంలో పోలీసులు ఆంక్షలతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎర్రకోట ప్రాంగణాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నామని.. సందర్శకులను అనుమతించట్లేదని పురావస్తు శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు.. 'చలో ఢిల్లీ' పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తున్న రైతులపై సుమోటోగా చర్యలు తీసుకోవాలని కోరుతూ 'సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్'.. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కు విజ్ఞప్తి చేసింది. ఢిల్లీలో ఆంక్షలున్న నేపథ్యంలో లాయర్లు కేసు విచారణకు హాజరు కాలేకపోతే, ఆయా కేసుల్లో ప్రతికూల తీర్పులు ఇవ్వకుండా కోర్టులను ఆదేశించాలని కోరింది. లాయర్లు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి ఆలస్యమైతే తాము సర్దుకుపోతామని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది.

ఎంఎస్‌పీ చట్టంపై తొందరపడం!

» కేంద్ర మంత్రి అర్జున్ ముండా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టాన్ని తొందరపడి తీసుకురాలేమని కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా తేల్చి చెప్పారు. ప్రస్తుతం ఎంఎస్‌పీకి చట్టం చేయాలని కోరుతూ రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి పలు విషయాలు వెల్లడించారు. 'ఎంఎస్‌పీ చట్టాన్ని తొందరపడి తీసుకురాలేం. వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన వారితో చర్చలు జరపాల్సి ఉంది. ముఖ్యంగా రైతులు కూడా నిర్మాణాత్మక చర్చలకు రావాల'ని పేర్కొన్నారు. ఎంఎస్‌పీకి హామీ ఇచ్చే పాలసీని అన్ని రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయించాల్సి ఉంటుందని చెప్పారు. వాస్తవానికి వ్యవసాయం అనేది రాష్ట్రాల అంశమన్నారు. "ఒకవేళ జాతీయ స్థాయిలో మేం ఏదైనా నిర్ణయం తీసుకుంటే.. రేపు రాష్ట్రాల వాదనను పరిగణనలోకి తీసుకోలేదని అంటార"ని తెలిపారు. రైతులు ఇప్పటికే ఎంఎస్‌పీని బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ఏర్పడిన సంజయ్ అగర్వాల్ నేతృత్వంలోని కమిటీలో భాగం కావాలని, లేదా కొత్త కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతు సమస్యలపై చర్చించేందుకు, పరిష్కరించేందుకు కేంద్రం సిద్ధంగానే ఉంటుందన్నారు. ఇప్పటికైనా రైతులు ఒక తేదీ నిర్ణయించాలన్నారు. కానీ, వారు చర్చలకు ముందుకు రాకపోవడం వల్లే సమస్య వస్తోందని, దీని వెనుక రాజకీయ ప్రేరేపితం ఉందని భావిస్తున్నట్టు తెలిపారు. రాజకీయ లబ్ధి ఆశించేవారిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండు దఫాల చర్చల్లో రైతులు లేవనెత్తిన అనేక డిమాండ్లకు అంగీకరించామన్నారు.

రాజస్థాన్ నుంచి రాజ్యసభకు సోనియా

» నేడు జైపూర్‌లో నామినేషన్ సమర్పణ

న్యూఢిల్లీ, జైపూర్, ఫిబ్రవరి 13: కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయనున్నారని మంగళవారం పార్టీ వర్గాలు తెలిపాయి. ఆమె బుధవారం జైపూర్ వెళ్లి నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారని సమాచారం. ఆమె వెంట కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రా వెళ్లనున్నారు. నామినేషన్ పత్రాల సమర్పణకు గురువారం చివరి రోజు కాగా, 27న ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుతం సోనియా తొలిసారిగా ఎగువ సభలో అడుగుపెట్టనున్నారు. ఆమె ఖాళీ చేసిన రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక పోటీ చేసే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

మరోసారి రాజ్యసభకు జయాబచ్చన్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: ఉత్తరప్రదేశ్ నుంచి జయాబచ్చన్‌ను సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) మరోసారి రాజ్యసభకు నామినేట్ చేసింది. అలాగే మాజీ ఎంపీ రామ్‌జీలాల్ సుమన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అలోక్ రంజన్..లను తమ పార్టీ తరఫున రాజ్యసభకు అభ్యర్థులుగా ప్రకటించింది. పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శివపాల్ సింగ్ యాదవ్, పలువురి సమక్షంలో వీరు మంగళవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. జయాబచ్చన్ ఇప్పటికే నాలుగుసార్లు ఎగువసభకు ఎన్నికయ్యారు. తాజాగా అయిదోసారి ఆమె రాజ్యసభకు నామినేట్ అయ్యారు. మరోవైపు బిహార్ సీఎం నితీశ్ కుమార్‌కు సన్నిహితుడైన జేడీ(యూ) ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ ఝూను బిహార్ నుంచి పార్టీ తరఫున రాజ్యసభ అభ్యర్థిగా జేడీ(యూ) ప్రకటించింది.

బీజేపీలో చేరిన అశోక్ చవాన్

ముంబై, ఫిబ్రవరి 13: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ బీజేపీలో చేరారు. మంగళవారం ముంబైలోని బీజేపీ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, పలువురు కీలక నేతల సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా చవాన్ మాట్లాడుతూ.. ఇది తన సొంత నిర్ణయమని చెప్పారు. తన రాజకీయ జీవితంలో ఇది కొత్త ప్రయాణమని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేస్తానని చవాన్ తెలిపారు. ఈ క్రమంలో చవాన్‌కు బీజేపీ తరఫున రాజ్యసభ సీటు దక్కడం ఖాయమయినట్లు తెలుస్తోంది. చవాన్ దాదాపు 4 దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు.

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత

» లోక్‌సభ ఎన్నికల్లో ఇదే మా 'మొదటి గ్యారంటీ': ఖర్గే

» శ్రమకు తగిన ప్రతిఫలం అడిగితే జైళ్లా ?: రాహుల్

అంబికాపూర్, ఫిబ్రవరి 13 : పంజాబ్, హరియాణాకు చెందిన వేలాది మంది రైతులు 'చలో ఢిల్లీ' పేరిట ఆందోళనకు దిగిన వేళ కాంగ్రెస్ పార్టీ కీలక ప్రకటన చేసింది. కేంద్రంలో అధికారం చేపట్టిన వెంటనే పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ ఇచ్చే తొలి గ్యారంటీ ఇదేనని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ఈ గ్యారంటీని అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం నిర్వహించిన భారత్ జోడో న్యాయ యాత్రలో పాల్గొన్న ఖర్గే ఈ ప్రకటన చేశారు. ప్రజాస్వామ్యానికి విలువ ఇవ్వని మోదీ ఇచ్చే గ్యారంటీలను నమ్మవద్దని ప్రజలకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మోదీ ఓ హిట్లర్, నియంత అని అన్నారు. రైతులు తమ హక్కుల కోసం ఢిల్లీ సరిహద్దుల్లో పోరాడుతుంటే ఇనుప కంచెలు వేసి అడ్డుకుంటున్నారని.. ప్రజాస్వామ్యం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. పీఎం పంటల బీమా పథకం వల్ల దేశంలోని ప్రైవేటు బీమా కంపెనీలు పదేళ్లలో రూ.40వేల కోట్ల లాభాలు పొందాయని ఖర్గే తెలిపారు. ధనవంతులను మాత్రమే పట్టించుకునే మోదీకి రైతులు, పేదల సమస్యలు మాత్రం పట్టవని ఆరోపించారు. తాను వెనుకబడిన తరగతికి చెందిన వాడినని, టీ వ్యాపారిని అని మోదీ పదేపదే చెప్పుకుంటారని విమర్శించారు. టీ నేకాదు మోదీ దేనినైనా అమ్ముకోవచ్చునని కానీ దేశాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకూడదని ఖర్గే అన్నారు. దేశంలోని ఓడరేవులు, విమానాశ్రయాలు, రహదారులు, గనులను అదానీకి కట్టబెట్టినప్పుడు మోదీకి వెనుకబడిన తరగతుల ప్రజలు గుర్తు రాలేదని ఖర్గే విమర్శించారు.



కాంగ్రెస్ గ్యారంటీతో 15 కోట్ల మందికి లబ్ధి: రాహుల్

తమ కష్టానికి తగిన ప్రతిఫలం ఇవ్వాలనే డిమాండ్‌తో ఆందోళనకు దిగిన రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగం, జైళ్లలో బంధించడం వంటి చర్యలకు పాల్పడిన కేంద్ర ప్రభుత్వం తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండియా కూటమి అధికారం చేపట్టిన వెంటనే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీ అమలైతే దేశంలోని 15 కోట్ల మంది రైతులు, వారి కుటుంబాల జీవితాలు మారుతాయంటూ హర్షం వ్యక్తం చేశారు. అంబికాపూర్, ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన భారత్ జోడో న్యాయ యాత్రలో ప్రసంగించిన రాహుల్.. కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఎంఎస్ స్వామినాథన్‌ను భారత రత్నతో గౌరవించిన కేంద్ర ప్రభుత్వం రైతులు, వ్యవసాయం కోసం ఆయన చేసి సూచనలను మాత్రం పట్టించుకోదని విమర్శించారు. ఇండియా కూటమి అధికారం చేపట్టిన తర్వాత స్వామినాథన్ సిఫారసులను అమలు చేస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం తీరు వల్ల దేశంలోని కొద్ది మంది మాత్రమే లబ్ధి పొందుతున్నారని, మిగిలిన వారంతా జీఎస్టీలు చెల్లిస్తూ, ఆకలితో అలమటిస్తున్నారని అన్నారు. కుల గణనతో సామాజిక న్యాయం సాధ్యమని రాహుల్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. కాగా, కనీస మద్దతు ధరకు చట్టబద్ధతపై కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీ ఓ విప్లవాత్మక నిర్ణయమంటూ ఆ పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. రైతులు, రైతు కుటుంబాల సంక్షేమం కోసం విప్లవాత్మక ప్రకటన చేసిన కాంగ్రెస్ పార్టీ హరిత, శ్వేత విప్లవాలకు పునాది వేసిందని ఆ పార్టీ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ అభిప్రాయపడ్డారు. అన్నదాతల కోసం తమ పార్టీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రా పేర్కొన్నారు.

జేఈఈలో మనోళ్ల సత్తా

(మొదటి పేజీ తరువాయి)

నుంచి అత్యధికంగా ఏడుగురు ఉండగా, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. హరియాణ, ఢిల్లీ నుంచి ఇద్దరు చొప్పున, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు నుంచి ఒక్కొక్కరు టాప్ స్కోరర్లలో ఉన్నారు. టాప్ 23 మందిలో అందరూ అబ్బాయిలే. హైదరాబాద్‌కు చెందిన రిషి శేఖర్ శుక్లా జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. కాగా, ఈసారి 100 పర్సంటైల్ సాధించిన వారిలో అమ్మాయిలు, జనరల్(ఈడబ్ల్యూఎస్), ఎస్సీ, ఎస్టీల నుంచి ఎవరూ లేరు. రెండోవిడత జేఈఈ మెయిన్స్ పరీక్ష ఏప్రిల్‌లో జరగనుండగా.. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను మే 26న నిర్వహించనున్నారు. ఈ పరీక్షల్లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో ప్రవేశాలు జరుపుతారు. జేఈఈ మెయిన్స్‌లో బీసీ గురుకుల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. బీసీ ఇంటర్మీడియట్ గురుకులం నుంచి 248 మంది హాజరుకాగా.. 98 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 50 మంది బాలికలు, 48 మంది బాలురు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, బీసీ గురుకుల కార్యదర్శి మల్లయ్యబట్టు అభినందించారు. 100 పర్సంటైల్ సాధించిన హైదరాబాద్ విద్యార్థుల్లో కొంత మంది ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

రెండో ర్యాంకు ఊహించలేదు: రిషి శేఖర్ శుక్లా

చాలా సంతోషంగా ఉంది. 100 పర్సంటైల్ వస్తుందని, జాతీయస్థాయిలో రెండో స్థానంలో నిలుస్తానని ఊహించలేదు. ఆకాశ్ కాలేజీ ఫ్యాకల్టీ మంచి తర్ఫీదు ఇచ్చారు. అమ్మానాన్నలు, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైంది. ఐఐటీ బాంబేలో ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ చేయాలన్నదే లక్ష్యం. నాన్న రిషి శేఖర్ ఇస్రోలో శాస్త్రవేత్త. అమ్మ వందన శేఖర్ కూడా సైంటిస్టే.

మా అక్కనే నాకు స్ఫూర్తి: ముతవరపు అనూప్

ఇంజనీరింగ్ చదవాలనే కోరికకు ఐఐటీ చెన్నైలో బీటెక్ చేస్తున్న మా అక్క హరితనే స్ఫూర్తి. చిన్నప్పటి నుంచి ఫిజిక్స్, మ్యాథ్స్ నాకు చాలా ఇష్టం. నాన్న రాజ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అమ్మ గృహిణి. అమ్మానాన్నలతో తోడ్పాటుతో పాటు లెక్చరర్ల గైడెన్స్‌తోనే 100 పర్సంటైల్ సాధ్యమైంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ చదవడమే నా లక్ష్యం.

యూఏఈలో నేడు అతిపెద్ద ఆలయ ఉద్ఘాటన

» అబుధాబి చేరుకున్న ప్రధాని మోదీ

» యూపీఐ-ఏఏఎన్ఐల సమన్వయం

అబుధాబి, ఫిబ్రవరి 13: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో నిర్మించిన అతిపెద్ద హిందూ దేవాలయం ప్రారంభానికి సిద్ధమైంది. 27 ఎకరాల విస్తీర్ణంలో భారతీయత, శిల్పకళ ఉట్టిపడేలా నిర్మితమైన ఈ ఆలయ ఉద్ఘాటన బుధవారం జరగనుంది. ప్రధాని మోదీ విశిష్ట అతిథిగా పాల్గొని, దేవతావిగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ మంగళవారం అబుధాబి చేరుకున్నారు. అక్కడ యూఏఈ గార్డ్ గౌరవ వందనాన్ని మోదీ స్వీకరించారు. అనంతరం ఇరువురు పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు ఒప్పందాలు జరిగినట్లు భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ముఖ్యంగా.. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం, పెట్టుబడులు, వాణిజ్యంపై ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వివరించింది. యూపీఐ, యూఏఈ పేమెంట్ గేట్‌వే ఏఏఎస్ఐ మధ్య అనుసంధానానికి ఇరుదేశాలు అంగీకరించినట్లు పేర్కొంది. అదేవిధంగా భారత దేశీయ డెబిట్/క్రెడిట్‌కార్డుల సంస్థ రూపే, యూఏఈకి చెందిన జైవాన్‌ల అనుసంధానానికీ అంగీకారం కుదిరినట్లు వివరించింది. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వారసత్వం-మ్యూజియాల విషయంలో ఇరుదేశాల మధ్య ఒప్పందాలు కుదిరినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎక్స్‌లో తన యూఏఈ పర్యటన విశేషాలను పంచుకున్నారు. "నా సోదరుడు మహమ్మద్-బిన్-జాయెద్ నుంచి సాదర స్వాగతం అందుకున్నాను. యూఏఈకి వస్తే.. సొంత ఇంటికి వచ్చాననే భావన నాలో కలుగుతుంది. యూఏఈ మద్దతు లేకుంటే.. స్వామినారాయణ్ ఆలయం నిర్మితమయ్యేది సాధ్యం కాని పని. ఈ సహకారం అందించిన జాయెద్‌కు ధన్యవాదాలు" అని ఆయన పేర్కొన్నారు. అనంతరం 'అహ్లన్ మోదీ' పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రవాస భారతీయులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుమారు 65 వేల మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మోదీ దక్షిణ భారత భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళాల్లో మాట్లాడటం విశేషం.



ఆలయం విశేషాలివే..!

యూఏఈలో 27 ఎకరాల సువిశాల స్థలంలో నిర్మించిన స్వామినారాయణ్ ఆలయంలో భారతీయ శిల్పకళాసౌందర్యం.. హిందూ ధర్మం ఉట్టిపడుతుంది. ఇది పశ్చిమాసియాలోనే అతిపెద్ద హిందూ ఆలయం. ఈ ఆలయం ఎత్తు 32.92 మీటర్లు, పొడవు 79.86 మీటర్లు, వెడల్పు 54.86 మీటర్లు. ఈ ఆలయానికి ఏడు గోపురాలున్నాయి. యూఏఈలోని ఏడు ఎమిరేట్స్‌కు ఈ గోపురాలు ప్రతీకగా బోచసన్వాసి శ్రీఅక్షర్ పురుషోత్తమ్ స్వామినారాయణ్ సంస్థ(బీఏపీఎస్) వివరించింది. ఈ ఆలయ నిర్మాణంలో రాజస్థాన్ నుంచి తెప్పించిన పాలరాతిని వినియోగించారు.

కోటి ఇళ్లకు సౌరశక్తి

నెలకు ఫ్రీగా 300 యూనిట్లు.. ఈ పథకంతో మరింత ఆదాయం: మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: దేశంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో 'ప్రధానమంత్రి సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన'ను ప్రధాని మోదీ మంగళవారం ప్రకటించారు. ఈ పథకం కింద ఒక కోటి ఇళ్లకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటును అందిస్తామని తెలిపారు. కోటి ఇళ్లకు విద్యుత్ కాంతులను అందించాలని నిర్ణయించామని, ఈ పథకానికి రూ.75 వేల కోట్లకుపైగా వ్యయం అవుతుందని వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్‌లో మోదీ వివరాలను తెలియజేశారు. లబ్ధిదారుల బ్యాంకుఖాతాలకు ప్రత్యక్షంగా నగదు బదిలీ చేయటం దగ్గరి నుంచి రాయితీల మీద బ్యాంకు రుణాలను అందించేవరకూ ప్రజల మీద ఎటువంటి ఆర్థికభారం పడకుండా కేంద్రం తగు చర్యలు తీసుకుంటుందని ప్రధాని చెప్పారు. ఈ పథకానికి సంబంధించిన వారందరినీ ఒక జాతీయ ఆన్‌లైన్ పోర్టల్‌తో అనుసంధానిస్తామన్నారు. ముఫ్త్ బిజిలీ యోజన గురించి క్షేత్రస్థాయిలో అందరికీ తెలిసేలా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలు కృషి చేయాలని, ఈ మేరకు తమ పరిధిలో ఉన్న ఇళ్ల పైకప్పులపై సౌరశక్తి వ్యవస్థలను నెలకొల్పేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తే ఆయా సంస్థలకు రాయితీలు కల్పిస్తామన్నారు. ఈ పథకం ఆదాయాన్ని, ఉద్యోగావకాశాలను సృష్టించటంతోపాటు కరెంటు బిల్లుల భారాన్ని కూడా గణనీయంగా తగ్గిస్తుందని చెప్పారు. సౌరశక్తి వినియోగాన్ని, సుస్థిరాభివృద్ధి ప్రగతిని ముందుకు తీసుకెళ్దామని, పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజనను బలోపేతం చేద్దామని వినియోగదారులకు ముఖ్యంగా యువతకు ప్రధాని పిలుపునిచ్చారు. https://pmsuryaghar.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎన్నో ప్రయోజనాలు..

ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు ఏటా సగటున రూ.15,000 నుంచి రూ.18,000 వరకూ ప్రయోజనం చేకూరుతుంది. 'ప్రధానమంత్రి సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన వల్ల సౌరశక్తి ప్యానెళ్ల తదితరాల తయారీ, విక్రయం, విద్యుత్ సరఫరా రంగాల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు భారీ ఎత్తున అవకాశాలు లభించటమేగాక విద్యుత్ సామగ్రి ఏర్పాటు, నిర్వహణ పరంగా పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కూడా అందుబాటులోకి వస్తాయి.



ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

- https://pmsuryaghar. gov.in/ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ రాష్ట్ర డిస్కంను ఎంచుకోవాలి.
- విద్యుత్ కన్స్యూమర్ నెంబరును, మొబైల్ నెంబరును, ఈ-మెయిల్ అడ్రస్ నమోదు చేయాలి.
- కన్స్యూమర్ నెంబరు, మొబైల్ నెంబరు ద్వారా లాగిన్ కావాలి.
- ఇంటి పైకప్పు మీద సోలార్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవటం కోసం దరఖాస్తు చేయాలి.
- అనుమతి లభించగానే రిజిస్టర్డ్ వ్యాపారి ద్వారా సోలార్ ప్లాంట్‌ను ఇంటి పైకప్పు మీద ఏర్పాటు చేయించాలి.
- సోలార్ ప్లాంట్ వివరాలను సమర్పించి, నెట్ మీటరు కోసం దరఖాస్తు చేసుకోవాలి.
- నెట్‌మీటరు ఏర్పాటు, డిస్కంతో తనిఖీ తర్వాత పోర్టల్ నుంచి ఒక సర్టిఫికేట్ లభిస్తుంది.
- పోర్టల్‌లో మీ బ్యాంకు ఖాతా వివరాలను, ఒక ఖాళీ చెక్కు ఫొటోను అప్‌లోడ్ చేయాలి. దీంతో ప్రక్రియ ముగుస్తుంది. ఇది జరిగిన 30 రోజుల్లో మీ బ్యాంకు ఖాతాలో సబ్సిడీ జమ అవటం ప్రారంభమవుతుంది.

ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతున్న కాంగ్రెస్

» అధికారపక్షం మాట్లాడి.. విపక్షానికి అవకాశమివ్వలేదు

» ఒకటి, రెండు పిల్లర్లు కుంగితే బురదజల్లే యత్నం: హరీశ్

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ప్రధాన ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా.. వాయిదా వేయడం తగదని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. సభ జరిగిన తీరును ఆయన ఖండించారు. ప్రజాస్వామ్య విలువలు మంటగలిపే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎజెండాలో లేని అంశాలపై అధికార పార్టీ సభ్యులు మాట్లాడి, తమకు మైకులు ఇవ్వకపోవడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని చెప్పారు. బీఆర్ఎస్ సభ ఉండటంతో.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం పోటీగా మేడిగడ్డ సందర్శన కార్యక్రమం చేపట్టిందని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీలో ఒకటి, రెండు పిల్లర్లు కుంగిపోతే కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక్క మేడిగడ్డ మాత్రమే కాదన్నారు. 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌజ్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల గ్రావిటి కెనాల్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్, 240 టీఎంసీల ఉపయోగం... వీటన్నింటి సమాహారమే కాళేశ్వరం ప్రాజెక్టు అని హరీశ్‌రావు వివరించారు.

సాగర్‌ను పరిశీలించిన ఎన్‌డీఎస్‌ఏ

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 13: నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలోని ఏడుగురు సభ్యుల బృందం మంగళవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును పరిశీలించింది. ఎగువ నుంచి వరద వచ్చే సమయంలో క్రస్ట్ గేట్లను ఎత్తినప్పుడు నీళ్లు వేగంగా వెళ్లకపోవడంతో స్పిల్ వేపై భారం పడుతుందని వారు గుర్తించారు. సీపేజీ (లీకేజీ)ని గుర్తించేందుకు గ్యాలరీలను కూడా పరిశీలించారు. ప్రాజెక్టుకు ప్రత్యేక గేట్లను అమర్చి వరదల సమయంలో పూడికను బయటకు పంపే సాధ్యాసాధ్యాలపై సమాలోచనలు చేశారు. సాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే, కుడి కాల్వ హెడ్ రెగ్యులేటర్, గ్యాలరీల్లో సీపేజీ, పూడికను బయటకు పంపేందుకు గేట్ల ఏర్పాటుకు రూ.20 కోట్లు అవసరమని అంచనా వేసినట్లు సమాచారం. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల పరిశీలన అనంతరం రెండు ప్రాజెక్టుల మరమ్మతులపై కేఆర్ఎంబీ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులతో ఎన్‌డీఎస్‌ఏ బృందం సభ్యులు సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం, కుడి, ఎడమ కాల్వల పరిస్థితి, స్పిల్ వే మరమ్మతులు, క్రస్ట్‌గేట్లు, గ్యాలరీల పటిష్ఠత గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్‌డీఎస్‌ఏ బృందం బుధవారం ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించనుంది.

ఎమ్మెల్యే కారు కింద పడి హోంగార్డు మృతి


కిషోర్(ఫైల్)

నల్లగొండ/నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13: నల్లగొండలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభ విధులు నిర్వహిస్తున్న కిషోర్(45) అనే ఓ హోం గార్డు ప్రాణాలు కోల్పోయాడు. ఓ కారు ఢీకొట్టడంతో ఎగిరిపడ్డ కిషోర్.. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ప్రయాణిస్తున్న కారు కింద పడి మరణించాడు. నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న కిషోర్(45)కు కేసీఆర్ బహిరంగ సభ నేపథ్యంలో నల్లగొండలో ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలను అప్పగించారు. చిట్యాల పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ శ్రీనుతో కలిసి నల్లగొండలోని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై కిషోర్ ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. అయితే, హైదరాబాద్ నుంచి నల్లగొండ వైపు అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు ముందు ఉన్న ట్రాలీ ఆటోను తప్పించే క్రమంలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న కిషోర్, శ్రీనును బలంగా ఢీకొట్టింది. దీంతో రోడ్డు అవతలి వైపునకు ఎగిరిన కిషోర్.. అదే సమయంలో నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఎమ్మెల్యే లాస్య నందిత కారు కిందపడ్డాడు. దీంతో కిషోర్ అక్కడికక్కడే మరణించాడు.

కేసీఆర్ ఆస్తులను జప్తు చేసే ధైర్యముందా?

» రాష్ట్ర ప్రభుత్వానికి బండి సంజయ్ సవాల్

హైదరాబాద్/సిరిసిల్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి బాధ్యుడంటూ మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై వేలెత్తి చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ధైర్యముంటే వారి ఆస్తులను జప్తు చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సవాల్ చేశారు. ఈ ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని గతంలో ఆరోపించిన కాంగ్రెస్.. ఇప్పుడెందుకు సీబీఐ విచారణ జరిపించడం లేదని నిలదీశారు. సబ్-కాంట్రాక్టు సంస్థ నిర్వాకం వల్లే మేడిగడ్డ బ్లాక్‌లు కుంగినట్లు విజిలెన్స్ నివేదిక ఇచ్చినా.. ఆ సంస్థ పేరును ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు. వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో ప్రజాహిత యాత్ర సందర్భంగా విలేకరులతో మాట్లాడారు.



నల్లగొండ సభలో నినదిస్తున్న కేసీఆర్, జగదీశ్‌రెడ్డి, కేకే, కడియం, కేటీఆర్; సభకు హాజరైన ప్రజలు

దద్దమ్మల పాలన


కేసీఆర్‌కు అభివాదం చేస్తున్న పద్మారావు, హరీశ్‌రావు, తదితరులు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకెళ్లి ప్రధానిని కలిసి నిలదీయాలని, నీటి హక్కుల కోసం కేంద్రంతో కొట్లాడాలని సూచించారు. ఆరు నెలల్లో నీటిహక్కులు తేల్చాల్సిందిగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. తాను 24 ఏళ్ల పాటు పక్షిలా తెలంగాణ అంతా తిరిగి ఇటు కృష్ణా, అటు గోదావరి నీళ్లు లేకుంటే మనకు బతుకే లేదని వివరించానని తెలిపారు. కేఆర్ఎంబీ విషయంలో ఆనాడు కేవలం ఒక్క ఏడాది కోసం సర్దుకోవాలని కేంద్రం చెబితే.. సరేనన్నామని చెప్పారు. తర్వాత కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక ఎన్నో వందల లేఖలు రాసినా స్పందించలేదని విమర్శించారు. తాము మునిగిందే నీళ్లలోనని, నీళ్లలో తమ వాటా తేల్చాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని తెలిపారు. ట్రైబ్యునల్ కోసం నిలదీశామని, కేంద్రం స్పందించకపోతే సుప్రీంకోర్టుకు వెళ్లామని అన్నారు. ఆ తర్వాత సుప్రీంకోర్టులో కేసును ఉపసంహరించుకుంటే ట్రైబ్యునల్ వేస్తామని కేంద్రం అడిగితే.. వెనక్కి తీసుకున్నామని గుర్తు చేశారు. ట్రైబ్యునల్ కోసం, నీటి వాటాల కోసం ఇటీవల కూడా బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో ఆందోళనలు చేశారని, కేంద్ర మంత్రిని కూడా కలిశారని వివరించారు. అయితే ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించాక.. ట్రైబ్యునల్ వేయాలంటూ ఎందుకు అడుగుతున్నారని ఎంపీలను కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ప్రశ్నించారని చెప్పారు.



కేంద్రంతో కొట్లాడడం మొగోళ్ల పని

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా జలవనరుల కోసం, హక్కుల కోసం కేంద్రంతో కొట్లాడడం మొగోళ్ల పని అని కేసీఆర్ అన్నారు. ప్రజలపై ప్రేమ, మమకారం ఉంటే, ప్రజలకు ఏమైనా చేయాలనే తపన ఉంటే హక్కుల కోసం పోరాడతారని, కానీ.. ఇప్పుడు అధికారంలో ఉన్న వారికి పదవులపైనా, పైరవీలపైనా, డబ్బులపైనే తప్ప.. ప్రజలపై, ప్రజల హక్కులపై మమకారం లేదని విమర్శించారు. "కేంద్రం వద్ద నీటి హక్కులను ఎలా సాధించాలనే విషయంలో మీకు అమాయకత్వమో, అడిగే సంస్కారం లేదో, తెలివి ఉందో, లేదో అర్థంకావడం లేదు. నీటిని ఎలా సాధించాలనే అంశంలో సీనియర్లు పొన్నాలను, కడియంను, నన్ను, హరీశ్‌ను.. ఎవరిని అడిగినా చెప్పేవాళ్లం. తెలివితక్కువగా వ్యవహరించి రాష్ట్ర హక్కులకు భంగం కలిగించారు" అని కేసీఆర్ ధ్వజమెత్తారు. అసెంబ్లీలో చేసిన తీర్మానంలోనూ తెలివితక్కువతనం బయటపడిందని, కేవలం నదీజలాల్లో హక్కుల అంశాన్నే తీర్మానంలో పెట్టారని, విద్యుదుత్పత్తి అంశాన్ని పెట్టలేదని అన్నారు. కృష్ణా జలాల్లో హక్కుల కోసం నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైద్రాబాద్ జిల్లాల ప్రజలు నిరంతరం అప్రమత్తతతో ఉండాలని సూచించారు. హక్కులు సాధించేవరకు పోరాడాలని, కృష్ణానీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాడుతుందని హామీ ఇచ్చారు. తాము ప్రభుత్వంలో ఉన్నప్పుడు కేంద్రంపైనా, మోదీపైనా పోరాడామని, కరెంటుకు మీటర్లు పెట్టమంటే పెట్టేదిలేదని తేల్చి చెప్పామని అన్నారు. రాష్ట్రపతి పాలన విధిస్తామన్నా వినలేదన్నారు.

సోయిలేకుండా మాట్లాడుతున్న మంత్రులు

కాంగ్రెస్ మంత్రులు సోయి లేకుండా మాట్లాడుతున్నారని కేసీఆర్ మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలోనే బాగుండెనని, ఇప్పుడే బాగాలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో అన్నారని, మరి ఆనాడే బాగుంటే ఇదే జిల్లాకు చెందిన శ్రీకాంతాచారి ఎందుకు అమరత్వం పొందారని, ఇంత పెద్ద ఉద్యమం ఎందుకు జరిగిందని ప్రశ్నించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. రైతుబంధు ఇవ్వలేక చేతులెత్తేశారని, రైతులు అడిగితే ఒక మంత్రి సంస్కారం లేకుండా చెప్పుతో కొట్టాలన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "రైతులను చెప్పుతో కొట్టమంటారా? మీకు ఎన్ని గుండెలు? నిలదీశారు. రైతులకూ చెప్పులుంటాయి. వాళ్లు కొడితే 32 పళ్లు ఊడిపోతాయ్ జాగ్రత్త" అని కేసీఆర్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి, మంత్రులు మేడగడ్డకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. "ఎల్ఎండీ, ఎంఎండీ నింపి ఐదు లక్షల ఎకరాలను నీరివ్వాల్సి ఉంటే.. ఆ పని చేయకుండా మేడిగడ్డకు పోతాం.. బొందలగడ్డకు పోతామంటున్నారు. అక్కడేమైనా తోకమట్ట ఉందా? అక్కడికి వెళ్లి ఏం చేస్తారు?" అని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగిశాక తాము కూడా అక్కడికే వెళ్లి కాంగ్రెస్ బండారం బయటపెడతామన్నారు. చిత్తశుద్ధి ఉంటే కాఫర్‌డ్యామ్ కట్టి అయినా నీళ్లివ్వవచ్చని చెప్పారు. 250, 300 టీఎంసీల కాళేశ్వరం ప్రాజెక్టు మూడు బ్యారేజీలు, 200 కిలోమీటర్ల టన్నెల్, 1500 కిలోమీటర్ల కాల్వలు, 19 సబ్‌స్టేషన్లు , 20వరకు రిజర్వాయర్లు ఉన్నాయని, ఇంత వ్యవస్థలో రెండు మూడు పిల్లర్లు కుంగాయన్నారు. వాటిని రిపేరు చేసి నీరివ్వాలే తప్ప.. చిల్లర రాజకీయాలు చేయడమేంటని మండిపడ్డారు. గతంలో నాగార్జునసాగర్‌లో కుంగలేదా? కడెం ప్రాజెక్టు గేట్లు కోసుకుపోలేదా? మూసీ ప్రాజెక్టు మూసుకుపోలేదా? అని ప్రశ్నించారు.

సభ సక్సెస్‌తో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆనందం

నల్లగొండలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభ విజయవంతం కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మండుటెండలో సైతం సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి రైతాంగం భారీగా తరలివచ్చారు. కాగా, తుంటి ఆపరేషన్ చేయించుకున్న కారణంగా కేసీఆర్ వైద్యుల సూచనల మేరకు కుర్చీలో కూర్చొనే ప్రసంగించారు. సుమారు 40 నిమిషాలపాటు మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక జరిగిన తొలి బహిరంగ సభ కావడంతో కేసీఆర్ ప్రసంగాన్ని ప్రజలు ఆసక్తిగా విన్నారు. కేసీఆర్ ప్రసంగానికి ముందు నిరంజన్‌రెడ్డి, అనంతరం జగదీశ్‌రెడ్డి మాత్రమే మాట్లాడారు.

రెట్టింపు వేగంతో మళ్లీ అధికారంలోకి వస్తాం

అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, తాము మళ్లీ రెట్టింపు వేగంతో అధికారంలోకి వస్తామని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమీ తక్కువ చేయలేదని, ఆరు నెలల్లో కరెంటును 24 గంటలిచ్చేలా తీర్చిదిద్దామని అన్నారు. నల్లగొండ జిల్లాలోనే 4వేల మెగావాట్ల విద్యుదుత్పత్తికి దామరచర్ల వద్ద పవర్‌ప్లాంట్ నిర్మాణం చేపట్టామని, 80శాతం పనులుకూడా పూర్తయ్యాయని, మరో 1600 మెగావాట్ల కోసం రామగుండంలో నిర్మించామని గుర్తు చేశారు. వీటిని పూర్తి చేస్తే విద్యుత్ పుష్కలంగా అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వం మారగానే కరెంటు మాయమైందన్నారు. అసెంబ్లీలో సైతం హరీశ్‌రావు మాట్లాడుతుంటే ఏడు సార్లు కరెంటు పోయిందని, శాసనసభలో జనరేటర్లు ఏర్పాటు చేసిన దద్దమ్మ ప్రభుత్వమని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిచ్చారని, వాళ్లు అయిదేళ్లు పాలించాలని, తమకు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారని ప్రజల హక్కుల కోసం, ప్రజల కోసం తాము ప్రతిపక్షంగా పోరాడతామని స్పష్టం చేశారు. కేసీఆర్‌ని దూషిస్తే నాయకులు కాలేరని, తాము చేసిన పనుల కంటే నాలుగు అదనంగా చేసి మంచిపేరు సాధించుకోవాలని హితవు పలికారు. రాజకీయాలు చేస్తూ, నిందారోపణలు, ప్రేలాపనలు చేయవద్దన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు 'రైతుబంధు' ఈ పాటికి టింగుటింగుమని మోగేదని, ఇప్పుడు ఏం మోగుతుందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో దూషణలు, దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నారని తప్పుబట్టారు. "మళ్లీ మనమే అధికారంలో వచ్చాక అన్నీ చేసుకుందాం. అధికారం లేకపోయినా బీఆర్ఎస్ శ్రేణులు విశ్రమించవద్దు. ప్రజల కోసం పోరాడాలి" అని పిలుపునిచ్చారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడామని, రాష్ట్రం వచ్చాక ఆరేళ్లలో ఫ్లోరోసిస్ మహమ్మారిని తరిమికొట్టామని కేసీఆర్ తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని, డిండి ఎత్తిపోతలను 80 శాతం పూర్తిచేశామని, అవి పూర్తయ్యేంత వరకు ఈ ప్రభుత్వం వెంటపడతామని చెప్పా రు. బలాదూర్ తిరుగుతామంటే కుదరదని హెచ్చరించారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, గంగుల కమలాకర్, ఎంపీలు కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు హాజరయ్యారు.

బీఆర్ఎస్ నేతలకు నిరసన సెగ

బస్సును అడ్డుకున్న ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు.. బస్సుపై కోడిగుడ్ల దాడి.. నల్ల దుస్తులతో నిరసన

» కేసీఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు

» చెదరగొట్టిన పోలీసులు


నల్లగొండలో బీఆర్ఎస్ నేతల బస్సును అడ్డుకుంటున్న ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు

నల్లగొండ, ఫిబ్రవరి 13: కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ సభకు హాజరయ్యేందుకు మంగళవారం నల్లగొండకు వచ్చిన బీఆర్ఎస్ నేతలకు నిరసన సెగ తగిలింది. సభా ప్రాంగణానికి వెళుతున్న బీఆర్ఎస్ నేతల బస్సును ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. మధ్యాహ్నం 3 గంటలకు నల్లగొండకు చేరుకున్న బీఆర్ఎస్ నేతలు తొలుత శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆగి భోజనం చేశారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాక సాయంత్రం 4 గంటలకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ముఖ్య నేతలు కలిసి బస్సులో మర్రిగూడ బైపాస్‌లోని సభాప్రాంగణానికి బయలుదేరారు. కాగా, బస్సు.. పట్టణంలోని వీటీ కాలనీ సమీపానికి చేరుకోగానే నల్లచొక్కాలు ధరించిన ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు ఒక్కసారిగా బస్సుకు అడ్డంగా వచ్చారు. మాజీ సీఎం కేసీఆర్‌కు, మాజీ మంత్రులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'పదేళ్లపాటు నల్లగొండకు ఏమీ చేయని కేసీఆర్ గోబ్యాక్' అంటూ నినదిస్తూ బస్సు ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో బస్సు ముందున్న పోలీసులు అప్రమత్తమై ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు ఆగకుండా బస్సుపై కోడిగుడ్లు విసిరారు. ఈ హఠాత్పరిణామంతో బస్సు వెనుక వస్తున్న కాన్వాయ్‌లోని వాహనాల్లో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడికి చేరుకుని ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో పరస్పరం దాడులకు పాల్పడటంతో పోలీసులు ఇరువర్గాలను చెల్లాచెదురు చేశారు. కొంతమందిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పది నిమిషాల్లో పరిస్థితి సద్దుమణగడంతో బీఆర్ఎస్ నాయకుల బస్సు సభా ప్రాంగణానికి బయలుదేరింది.

కేసీఆర్.. మీ హామీలు గుర్తున్నాయా?

» పదేళ్లుగా ఎస్ఎల్‌బీసీ పూర్తిచేయకపోవడంపై ఆగ్రహం

» కుర్చీ వేసి..గులాబీ టవల్‌పై కేసీఆర్ చిత్రపటం ఏర్పాటు

» 'నిజాల నివేదిక' పేరిట కాంగ్రెస్ నిరసన


కేసీఆర్ హామీల వివరాలను ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రదర్శిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13: పదేళ్లలో సీఎం హోదాలో మీరిచ్చిన హామీలు గుర్తున్నాయా.. అంటూ కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ నేతలు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కృష్ణా జలాల హక్కుల పరిరక్షణపై మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో 'చలో నల్లగొండ' నిర్వహించగా.. కేసీఆర్ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు 'నిజాల నివేదిక' పేరుతో సభ నిర్వహించారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి రెండు గంటలపాటూ నల్లగొండలోని క్లాక్‌టవర్ చౌరస్తాలో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేసి.. కుర్చీ వేసుకుని ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తానన్న కేసీఆర్ హామీని ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రజంటేషన్ ద్వారా గుర్తు చేస్తూ...వేదికపై ఖాళీ కుర్చీ వేసి, గులాబీ రంగు టవల్ కప్పి దానిపై కేసీఆర్ చిత్రపటాన్ని ఉంచి నిరసన వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదని, కేఆర్ఎంబీపై బీఆర్ఎస్ చేపడుతున్న సభలో పసలేదని విమర్శించారు. కృష్ణాజలాల అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేయడంతో ఏం మాట్లాడాలో తెలియక కేసీఆర్ అయోమయంలో పడ్డారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ గోబ్యాక్ అంటూ నినదించారు. మంత్రి కోమటిరెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం నిర్వహించారు.

కాళేశ్వరం రైతుల త్యాగాలకు ఫలితం లేదు!

» గత ప్రభుత్వ అవినీతితో అంతా వృథా: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ భూములు, ఇళ్లను రైతులు త్యాగం చేశారని, కానీ గత ప్రభుత్వం చేసిన అవినీతితో వారి త్యాగాలకు ఫలితం లేకుండా పోయిందని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. కాళేశ్వరం పర్యటనకు బయలుదేరటానికి ముందు శాసనసభలో ఆయన మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించారని, వాటి కోసం తాము ఇళ్లు, భూములు త్యాగం చేస్తే, ప్రజల సంపద వృథా అయ్యిందని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెకులపై దశాబ్దాలు గడిచినా ఎలాంటి ఫిర్యాదులు రాలేదని మంత్రి గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల అడ్డగోలుగా దోపిడీ జరిగిందని, ప్రజల డబ్బు దుర్వినియోగమైందని చెప్పారు. కాళేశ్వరంలో అవినీతి జరిగినట్లు తమ ప్రభుత్వం ఆరోపణలు చేయటంలేదని, డ్యామ్‌సేఫ్టీ, విజిలెన్స్ అధికారులు ఇచ్చిన నివేదికలను మాత్రమే ప్రజల ముందుకు తీసుకొచ్చామని ఆయన తెలిపారు. వాస్తవాలను స్వయంగా కళ్లతో చూడాలని, నివేదికలు బయట పెడితే ఎందుకు ఉలిక్కి పడుతున్నారని ప్రశ్నించారు.

నల్లచట్టాలతో రైతులు, రైతు కూలీల హత్య

» కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా..

16న ఇందిరాపార్కు వద్ద భారీ నిరసన

» పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి


గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి, కోదండరెడ్డి తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ ప్రభుత్వం తెచ్చిన నల్లచట్టాలు రైతులు, రైతు కూలీలను హత్య చేసే చట్టాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. రైతు, ప్రజా వ్యతిరేక చట్టాలను అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా టీపీసీసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ఎదుట వచ్చే శుక్రవారం(16వ తేదీ) భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని ప్రకటించారు. రైతు కూలీ సంఘాలతో పాటు కలిసి వచ్చే అన్ని సంఘాలను సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశం అనంతరం జగ్గారెడ్డి విలేకరులతో మాట్లాడారు. మోదీ సర్కారుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిర్వహించనున్న బంద్‌లో భాగంగా పీసీసీ నేతృత్వంలో జరిగే ఆందోళనలో పాల్గొనేందుకు కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. బంద్, ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అన్ని సంఘాలతో కలిసి ఓ సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. పార్టీ తరఫున పీసీసీతో చర్చిస్తామని వివరించారు. రైతులను కాపాడుకోవడానికి ప్రతిఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందిరా పార్కు వద్ద నిర్వహించే రాష్ట్ర మంత్రులు కూడా పాల్గొంటున్నారని చెప్పారు. సీపీఐ, సీపీఎం. తెలంగాణ జనసమితి పార్టీతో పాటు తమతో కలిసి వచ్చే వారందరిని కలుపుకుని ముందుకు వెళతామని తెలిపారు. మోదీ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టే ఈ ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేసే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి మాట్లాడుతూ నల్ల చట్టాలు తెచ్చి మోదీ రైతులను మోసం చేశారని పేర్కొన్నారు. అదానీ, అంబానీలకు లాభం చేకూర్చే పనిలో మోదీ ఉన్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని పక్కన పెట్టిందని విమర్శించారు. కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ నల్ల చట్టాలు దొడ్డి దారిన అమలు చేసే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై చేపట్టిన నిరసన ర్యాలీలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాగా, సంయుక్త కిసాన్ మోర్చా, ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు పాల్గొన్న ఈ సమావేశంలో సీపీఎస్ రద్దు చేయాలని, 57 ఏళ్లు దాటిన రైతులకు, వ్యవసాయ కార్మికులకు రూ.10 వేల పింఛను ఇవ్వాలని, ఉపాధి పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజువారీ వేతనాన్ని రూ.800 చెయ్యాలని డిమాండ్ చేశారు.

చేపల పులుసు తిని.. కృష్ణా నీళ్లు ఇచ్చేశారు

» బిడ్డ లిక్కర్‌కేసు, కొడుకు అవినీతి కేసుల కోసం తెలంగాణ బిడ్డల బతుకులు తాకట్టు పెట్టారు

» మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పదేళ్లు అధికారంలో ఉండి.. ఆంధ్రా నాయకులతో చెట్టాపట్టాలేసుకుని తిరిగి.. వాళ్లు పెట్టిన చేపల పులుసు తిన్న కేసీఆర్.. ఏకంగా కృష్ణా నీళ్లను వాళ్లకి అప్పగించారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమను రతనాల సీమ చేస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ ఆ మాటలను మరిచిపోయి ఇప్పుడు గజనిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 2015లోనే తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రాకు తాకట్టుపెట్టి 299 టీఎంసీలకు ఒప్పుకున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నల్లగొండలో సభ నిర్వహించడంపై మంత్రి కోమటిరెడ్డి మీడియాకు ప్రకటన విడుదల చేశారు. నల్లగొండలో 70 శాతం పూర్తయిన ప్రాజెక్టులను కేసీఆర్ పదేండ్లలో కూడా పూర్తి చేయకుండా.. ఒక్క ప్రాజెక్టు కట్టకుండా మోసం చేసి.. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు రాగానే నాటకాలు మొదలుపెట్టారని ధ్వజమెత్తారు. కేసీఆర్ తెలంగాణలో రాజకీయాలు వదిలేసి ఆంధ్రాలో ఏఆర్ఎస్ (ఆంధ్రా రాష్ట్ర సమితి) పార్టీ పెట్టుకుంటే బావుంటుందని సూచించారు. మెదక్‌లో కేసీఆర్‌పై ఒక సామాన్య కార్యకర్తను నిలబెట్టి గెలిపిస్తామని సవాల్ విసిరారు. కేసీఆర్ తన బిడ్డ లిక్కర్ కేసుల కోసం, కొడుకు అవినీతి కేసుల కోసం తెలంగాణ బిడ్డల బతుకుల్ని తాకట్టుపెట్టారని, ఆయన కొడుకు అనుచరుడైన ఓ అధికారిని విచారిస్తే వేల కోట్ల ఆస్తులు దొరుకుతున్నాయని, దాంతో కేసీఆర్‌కు భయం పట్టుకుందన్నారు. ఆర్టీఐ చట్టం ద్వారా సేకరించిన కేసీఆర్ దొంగ దీక్ష రిపోర్టులను ప్రజల ముందు పెడతామన్నారు.

నీటి పారుదల శాఖపై నేడు శ్వేతపత్రం

నీటి పారుదలశాఖపై బుధవారం శ్వేత పత్రం విడుదల చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. 2014 నుంచి 2023 దాకా నీటి పారుదల శాఖ ప్రాజెక్టుల వ్యయం, కొత్తగా సాగులోకి వచ్చిన ఆయకట్టు అంశాలపై చర్చ జరపనుంది. ప్రధానంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో పాటు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ ఎత్తిపోతల పథకం - సీతమ్మ బ్యారేజి బహుళార్థ సాధక ప్రాజెక్టులకు ఇప్పటిదాకా వెచ్చించిన వ్యయం, కొత్తగా సాగులోకి వచ్చిన ఆయకట్టును ప్రభుత్వం ప్రస్తావించనుంది.

అది ప్రజల నిర్ణయాన్ని అపహాస్యం చేయడమే: తుమ్మల



'పాలిచ్చే బర్రెను వదులుకొని దున్నపోతుని తెచ్చుకున్నారని మాజీ సీఎం కేసీఆర్ నల్గొండ సభలో వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్యాన్ని, ప్రజల నిర్ణయాన్ని అపహస్యం చేయడమేనని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. "వేదిక మీద పెద్ద పెద్ద వ్యాఖ్యలు చేసే మీరు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం గురించి హేళనగా మాట్లాడటం ఆక్షేపణీయం. మాజీ సీఎంగా మీరు మాట్లాడే భాష ప్రజాస్వామ్య విలువలకు లోబడి లేదని ప్రజలు భావిస్తున్నారు. ఓడిపోయిన 60 రోజులకే అధికారం గురించి ఇంత ఆరాటపడటం, ఇంత అసహనానికి గురవడం మీ అంతర్యాన్ని చెప్పకుండానే తెలియజేస్తోంది. వాస్తవాలను మరచి మీరు చేస్తున్న వ్యాఖ్యలు దొంగే దొంగ అన్నట్లుగా ప్రజలు భావించే అవకాశంగా ఉంది.' అని మంత్రి తుమ్మల అన్నారు.

కేసీఆర్ కాశీకే!

(మొదటి పేజీ తరువాయి)

అయిన వ్యయం, సృష్టించిన ఆయకట్టు వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టు ఈఎన్‌సీ సుధాకర్ వివరించారు. కాళేశ్వరంపై కేసీఆర్ అడుగడుగునా అబద్ధాలే చెప్పారని రేవంత్ ఆరోపించారు. మొత్తం ప్రాజెక్టు పూర్తయితే దాదాపు 20 లక్షల ఎకరాలకు నీరందే అవకాశం ఉండగా, ఇప్పటికే కోటి ఎకరాలకు నీరందిస్తున్నట్లు కేసీఆర్ గొప్పలు చెప్పుకున్నారన్నారు. రూ.94 వేల కోట్లు ఖర్చు పెట్టి, నీళ్లిచ్చింది 98,570 ఎకరాలకు మాత్రమేనని చెప్పారు. మొత్తం పంపులు పనిచేస్తే సంవత్సరానికి రూ.10,500 కోట్ల బిల్లు అవుతుందని, ప్రాజెక్టు నిర్వహణ, బ్యాంకు రుణాలు, వడ్డీ, ఇవన్నీ లెక్కేస్తే సంవత్సరానికి రూ.25 వేల కోట్లు దాటుతుందని వివరించారు. సంవత్సరానికి రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తే కేసీఆర్ అనుకున్నట్లు ప్రాజెక్టు పూర్తయితే... 19.63 లక్షల ఎకరాలకు నీళ్లు అందుతాయన్నారు. ప్రాజెక్టుకు రూ.1.27 లక్షల కోట్లను అంచనా వేస్తే ఇప్పటికే రూ.లక్ష కోట్లు ఖర్చయ్యాయని వివరించారు. రూ.2 లక్షల కోట్లు పెడితే కానీ ప్రాజెక్టు పూర్తి అవదన్నారు. నిర్మాణం సక్రమంగా జరిగితే 20 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందేదన్నారు. మేడిగడ్డ కుంగడంతో అది కూడా అనుమానంలో పడిందని చెప్పారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను కూడా అదే టెక్నాలజీతో కట్టారని, ఇప్పటికే లీకేజీలు కనిపిస్తున్నాయని తెలిపారు. అధికారంలోకి రాగానే ఎన్‌డీఎస్‌ఏ నివేదికను పరిశీలించామని చెప్పారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో విచారణ జరిపించి, నివేదికను తెప్పించుకున్నామని, ప్రాజెక్టు డిజైన్, నిర్మాణ లోపాలు, నిర్వహణ లోపాలు, అంచనా వ్యయంలో లోపాలున్నట్లు విజిలెన్స్ నివేదిక ద్వారా గుర్తించామని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ అంచనా రూ.1,800 కోట్లయితే రూ.4 వేల కోట్లకు పెంచారని, ఇందులో అవినీతి జరిగిందని చెప్పారు. కాళేశ్వరంలో వేల కోట్ల అవినీతి జరిగిందని స్వయంగా కాగ్ చెప్పిందని రేవంత్ ప్రస్తావించారు. విజిలెన్స్, కాగ్ నివేదికల ఆధారంగా సాగు నీటి శాఖపై శ్వేతపత్రాన్ని రూపొందించామన్నారు. దానిపై బడ్జెట్ సమావేశాల్లో చర్చిద్దామంటే కేసీఆర్ తన బండారం బయట పడుతుందని ప్రజల ముందు దోషిగా నిలబడాల్సి వస్తుందన్న భయంతో వ్యూహాత్మకంగా శాసనసభను తప్పించుకొని కృష్ణా నది ప్రాజెక్టులపై తప్పుడు ఆరోపణలకు దిగారని మండిపడ్డారు. మీరు సీఎంగా ఉన్నప్పుడే కదా?

కృష్ణా ప్రాజెక్టుల స్వాధీనాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేద్దాం రమ్మని పిలుపునిస్తే కేసీఆర్ రాలేదన్నారు. కేంద్రానికి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వమే అప్పగించిందని కేసీఆర్ చెబుతున్నారని, నిజానికి ఆయన ముఖ్యమంత్రిగా ఉండగానే 2023 డిసెంబరు 1న సీఎంవో కార్యదర్శి స్మితాసభర్వాల్ ప్రాజెక్టులను అప్పజెప్పుతూ కేంద్రానికి లేఖ రాశారన్నారు. లేఖను అసెంబ్లీలో ప్రవేశపెట్టామని చెప్పారు. కాళేశ్వరం మీద అనుమానాల నివృత్తికి 13న మేడిగడ్డ వెళదాం రమ్మంటే తప్పించుకున్నారని చెప్పారు. కాలు విరిగిందన్న నెపం చూపుతూ డిసెంబరు నుంచి సమావేశాలకు రావడం లేదని, విరిగిన కాలుతో నల్లగొండ ఎలా వెళ్లారని రేవంత్ ప్రశ్నించారు. అసెంబ్లీ దగ్గరుందా? నల్లగొండ దగ్గరుందా? అన్నారు. కాళేశ్వరంపై చర్చ జరగకూడదని, బీఆర్ఎస్ దోపిడీ బయటపడకూడదనే లక్ష్యంతోనే నల్లగొండ సభ పెట్టుకున్నారని ఆరోపించచారు. నాలుగైదు పిల్లర్లు కూలితే తప్పా అని నల్లగొండ సభలో కేసీఆర్ అంటున్నారని, ఆయనకు ఏదీ తప్పుకాదని ఎద్దేవా చేశారు. చులకన మాటలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని చెప్పారు.

తీర్మానంలో లోపాలుంటే వచ్చి సవరించాల్సింది

కేఆర్ఎంబీపై సలహా అడిగితే ఇచ్చే వాడిని కదా అని కేసీఆర్ అంటున్నారని రేవంత్ ప్రస్తావించారు. శాసనసభలోనే చర్చ పెట్టి సలహా అడిగామని, ఆదేశాలిచ్చయినా కేసీఆర్‌ను రప్పించాలని స్పీకర్‌ను కోరామని చెప్పారు. కేసీఆర్ వచ్చి సలహాలు, సూచనలు ఇచ్చాకే తీర్మానం చేద్దామని అనుకున్నామని వెల్లడించారు. ప్రభుత్వం పెట్టిన తీర్మానం సరిగా లేదంటే హరీశ్‌రావు ఎందుకు మద్దతు ఇచ్చారని ప్రశ్నించారు. హరీశ్ మాటలకు విలువ లేదు, కేసీఆర్ కొట్టిపారేస్తాడని అప్పుడే సభలో అన్నానని, అనుకున్నట్లే దిక్కుమాలిన, పనికిమాలిన తీర్మానమని నల్లగొండ సభలో కేసీఆర్ అన్నారని ప్రస్తావించారు. తీర్మానంలో లోపాలుంటే కేసీఆరే వచ్చి సవరించాల్సిందని రేవంత్ వ్యాఖ్యానించారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని అంటున్న కేసీఆర్ అదేమాట శాసనసభకు వచ్చి చెప్పాలన్నారు. "మమ్మల్ని వెంటాడతాడట... అల్లాటప్పగా కుర్చీలో కూర్చోలేదు. ప్రజలు ఓట్లేసి ఎన్నుకున్న ప్రభుత్వం మాది. ఉద్యమం ముసుగులో మంది పిల్లలను చంపి కుర్చీ ఎక్కలేదు" అన్నారు. కుంగిపోయిన బ్యారేజీల మీద ఎందుకు మాట్లాడటం లేదన్నారు. కేఆర్ఎంబీ ప్రాజెక్టులపై మీ కార్యదర్శి రాసిన లేఖను బయట పెడితే... దానిపై ఎందుకు స్పందించడం లేదు? ఆమె మీ అనుమతి తీసుకుని రాశారా లేదా? ఆ విషయం ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మీకు లేదా? కేసీఆర్ అవినీతి చిట్టా మొత్తం ప్రజలకు తెలిస్తే ప్రతిపక్ష హోదా కూడా రాదని ఎద్దేవా చేశారు. కుర్చీ పోగానే కేసీఆర్‌కు గుర్తొచ్చేది నీళ్లు, నల్లగొండ ఫ్లోరైడ్ బాధితులని చెప్పారు.

వాస్తవాలను సమాజానికి చెప్పండి

ఎమ్మెల్యేలు, మీడియాకు నిజాలేమిటో చెప్పాలని మేడిగడ్డకు తీసుకొచ్చామని రేవంత్ ప్రకటించారు. న్యూయార్క్ స్క్వేర్‌లో ఇదో 'మ్యాన్ మేడ్ వండర్' అని గత ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చుకుందని, జాతీయ మీడియాలో చెప్పలేనంత ప్రచారం చేసుకుందని చెప్పారు. నేషనల్ మీడియా కూడా మేడిగడ్డ పరిస్థితులను చూపించాలని రేవంత్ కోరారు. ఇక్కడి అవినీతిపై చర్చలు పెట్టాలన్నారు. శాసనసభకు వస్తే కేసీఆర్ గౌరవం తగ్గకుండా చూస్తామని హామీ ఇచ్చారు. "రేపు ఉదయం దయచేసి సభకు రండి. శ్వేతపత్రంపై చర్చలో పాల్గొని సూచనలు ఇవ్వండి. ప్రజల కోసం ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఒక్క క్షణమైనా ఆలోచన చేయండి" అన్నారు. కృష్ణా ప్రాజెక్టుల విషయంలో ఏనుగు ఇప్పటికే దాటిపోయిందని, మిగిలిన తోకను పట్టుకొని గుంజే ప్రయత్నం తమ ప్రభుత్వం చేస్తోందని రేవంత్ చెప్పారు. అన్ని పాపాలకు కేసీఆరే కారణమని, ఆయనే ప్రాజెక్టులను అప్పజెప్పాడని, నిర్వహణకు నిధులు ఇచ్చాడని, కేబినెట్‌లో ఆమోదించి, లేఖలు కూడా రాశారని రేవంత్ ఆరోపించారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే మిగిలిన పిల్లర్లలో ఎన్ని ఉంటాయో ఎన్ని ఊడతాయో తేలుతుందన్నారు. సుందిళ్ల ఏ క్షణమైనా కొట్టుకుపోవడానికి సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ ఐదు అడుగులు కుంగిందన్నారు. కేసీఆర్ సభకు వచ్చి ఎల్ అండ్ టీ సంస్థను బ్లాక్ లిస్టు చేయాలా? వద్దా? సర్టిఫికెట్ ఇచ్చిన అధికారులను శిక్షించాలా? వద్దా? కాళేశ్వరం అవకతవకలపై మాజీ సీఎం, మాజీ నీటిపారుదల మంత్రిల అభిప్రాయం ఏమిటో చెప్పాలన్నారు కాలు ఇరిగినా, చేతకాకపోయినా మీ కోసం సభకు వచ్చిన అని చెబుతున్న కేసీఆర్‌కు జనం కోసం వచ్చే లక్షణం ఎన్నడూ లేదన్నారు. ఎంతో మంది పిల్లలు చనిపోతే, ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకుంటే, ఎంతో మంది గొప్ప వ్యక్తులు చనిపోతే చూడటానికి రాని కేసీఆర్ ఇప్పుడు కుర్చీ పోవడంతో కుర్చీని వెతుక్కుంటూ నల్గొండ వచ్చారని రేవంత్ ఎద్దేవా చేశారు. దక్షిణ తెలంగాణ మొత్తం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని తెలియడంతో సానుభూతి కోసం నాకు కాలు లేదు, అవిటివాడిని, నడవలేకపోతున్నా అంటూ ఓట్లు అడుక్కోవడానికి వచ్చాడన్నారు. అవినీతిపరుడిగా పచ్చిగా పట్టుబడ్డ కేసీఆర్‌ను కుర్చీ నుంచి దించి రెండు నెలలు కాకముందే అడుక్కునే పని మొదలు పెట్టారన్నారు. నిజాం హాస్పిటల్ సానుభూతి పదేళ్లు అక్కరకు వచ్చిందని, ఇప్పుడు వీల్ చెయిర్‌తో ప్రయోగాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నల్లగొండ సభకు జనాలు దొరకకపోతే కల్వకుర్తి నుంచి బస్సులు పెట్టి తోలుకుపోయిండని ఆరోపించారు. కవులు, కళాకారులు, మేధావులంతా కాళేశ్వరానికి వచ్చి చూడాలని రేవంత్ పిలుపునిచ్చారు. హెలికాప్టర్ పెట్టినా రాని కేసీఆర్ తర్వాత వస్తానని చెబుతున్నారని, ఇక ఆయన వెళ్లాల్సింది కాళేశ్వరం కాదని, కాశీకి వెళ్లి సన్యాసం పుచ్చుకొని బిచ్చమెత్తుకోవాలని ఎద్దేవా చేశారు.



మేడిగడ్డ బ్యారేజీ పర్యటనలో సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

నిపుణుల అభిప్రాయాల మేరకు చర్యలు

కాళేశ్వరం విషయంలో సాంకేతిక నిపుణుల అభిప్రాయం మేరకు చర్యలు ఉంటాయని రేవంత్ చెప్పారు. ఒకటి రెండు పిల్లరు కూలితే ఏమవుతుందని కేసీఆర్ అంటున్నాడని, కేసీఆర్‌కు ఒక కాలు విరిగితే... ఆస్పత్రికి ఎందుకు వెళ్లాడని ప్రశ్నించారు. అసలు ప్రాజెక్టులో ఎల్ అండ్ ఉందా? ఇంకెవరైనా ఉన్నారా? తేలాల్సి ఉందన్నారు. మరమ్మతులకు ఎల్ అండ్ టీ ముందుకు రాకపోతే రెవెన్యూ రికవరీ యాక్టును అమలు చేసి, ప్రజాధనాన్ని రికవరీ చేస్తామన్నారు. కేసును సీబీఐకి ఇవ్వాలనడం కిషన్‌రెడ్డి అతి తెలివితేటకు నిదర్శనమని, సీబీఐకి ఇస్తే క్లోజ్ తమ చేతిలోకి వస్తుందని, కేసీఆర్ నుంచి గిల్లుకోవచ్చని ఆయన ఆలోచిస్తున్నారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో లేఖ రాయించి, సిట్టింగ్ జడ్జిని ఇప్పించే ప్రయత్నం చేయాలన్నారు. పదేళ్లలో గత ప్రభుత్వంపై సీబీఐ, ఈడీ, ఆదాయపన్ను శాఖలతో ఎందుకు విచారణ చేపట్టలేదన్నారు. కిషన్‌రెడ్డి వరంగల్‌లోనే ఉండి తానెందుకు రాలేదు? ఎమ్మెల్యేలను ఎందుకు పంపలేదు? ప్రధాని నరేంద్ర మోదీ వద్దకు మేము వెళ్లడం లేదా? అని ప్రశ్నించారు.



రేవంత్: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీవాళ్లు ఏం చెప్పారు?

సుధాకర్: ప్రాజెక్టు ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్ ఆపరేషన్, మెయింటెనెన్స్‌లలో కొన్ని కారణాలున్నాయని గుర్తించారు. ర్యాప్ట్ విఫలం కావడమే ప్రాథమిక కారణమని చెప్పారు. అప్‌స్ట్రీమ్‌లో లోడ్ ఎక్కువ కావడం వల్ల కూడా ఏమైనా జరిగి ఉండొచ్చన్నారు. క్వాలిటీ కంట్రోల్ సరిగా లేకపోవడం కూడా కారణమన్నారు.

రేవంత్: 2020లోనే సమస్యలు గుర్తించారా?

సుధాకర్: 2020లో 10,300 క్యూసెక్కుల డిశ్చార్జి వచ్చింది. గేట్లన్నింటినీ వదిలేశాం. అప్పుడే సమస్యలున్నట్లు గుర్తించాం.

రేవంత్: ఈ సమస్యను 2020లోనే గుర్తించి లేఖ రాశారు. దానిని సరిదిద్దలేదు. దాంతో 2023 అక్టోబర్ 21న పియర్స్ కుంగిపోయినట్లు గుర్తించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఒకే సాంకేతిక నైపుణ్యంతో నిర్మించారు. ఈ మూడింటిలో ఒకే రకమైన సమస్యలున్నాయి. మేడిగడ్డలో తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. వాటిలో కూడా సమస్యలు వచ్చాయి. వీటన్నింటినీ కప్పి పుచ్చుదానికి నీటిని వదిలేశారు. ఇప్పుడు ఎండాకాలం అయినందున నీటిని నింపుదామన్న అవకాశం లేదు.


కేసీఆర్ చీకటి మిత్రులు రాలేదు

కేసీఆర్ చీకటి మిత్రులైన బీజేపీ వాళ్లు కూడా కాళేశ్వరం పర్యటనకు రాలేదని, వాళ్ల ఎమ్మెల్యేలు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని రేవంత్ ఆరోపించారు. చీకటి పొత్తులు ఎన్నాళ్లు? లోక్‌సభ ఎన్నికల్లో బయటపెట్టక తప్పదు అన్నారు. జ్యుడీషియల్ ఎంక్వైరీ వద్దని, తమ చేతికి ఇవ్వాలని బీజేపీ వాళ్లు ఎందుకు అడుగుతున్నారో తెలుసని, టీఆర్ఎస్‌తో కూర్చొని మాట్లాడుకోవడం కోసమేనని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకోవడానికి సహకరిస్తారా లేక కాపాడడానికి ప్రయత్నిస్తారో బీజేపీ స్పష్టం చేయాలని రేవంత్ డిమాండ్ చేశారు. శాసనసభ సమావేశాలు ముగియగానే కాళేశ్వరం అవినీతిపై దృష్టి పెడతామన్నారు.

వ్యయం రూ.93,570 కోట్లు

కాళేశ్వరం రెండు టీఎంసీల ప్రాజెక్టు అంచనా విలువ రూ.94,413 కోట్లని ఈఎన్‌సీ సుధాకర్ చెప్పారు. ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎమ్మెల్యేలకు వివరించారు. కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణం రూ.44,614 కోట్లని, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.28,886 కోట్లు పెట్టిందని చెప్పారు. మొత్తం రూ.73,500 కోట్లు అయ్యిందన్నారు. మూడో టీఎంసీ అంచనా వ్యయం రూ.33,459 కోట్లు కాగా, రుణాల కింద రూ.17,051 కోట్లు, రాష్ట్ర వాటాగా రూ.3,321 కోట్లు... మొత్తం రూ.20,372 కోట్లు అవుతుందన్నారు. మొత్తం మూడు టీఎంసీల అంచనా వ్యయం రూ.1,27,772 కోట్లు అయితే.. ఇప్పటివరకు రూ.93,872 కోట్లను ఖర్చు చేశామన్నారు. ఇందులో రూ.61,665 కోట్లు రుణాలైతే, రాష్ట్ర ప్రభుత్వం రూ.32,207 కోట్లు పెట్టిందని చెప్పారు. 97,477 ఎకరాలు అవసరం కాగా, ఇప్పటివరకు 66,190 ఎకరాలను సేకరించామని, 31,287 ఎకరాలను సేకరించాల్సి ఉందని చెప్పారు. దీని కోసం ఇంకా రూ.5,438 కోట్లు కావాలన్నారు. 19,63,360 ఎకరాలకు సాగు నీరు లక్ష్యం కాగా ఇప్పటివరకు 98,570 ఎకరాలకు నీరు ఇచ్చామని చెప్పారు. మేడిగడ్డలో 8 బ్లాకుల కింద మొత్తం 85 పిల్లర్లు ఉన్నాయని, 7వ బ్లాకులో పిల్లర్లు కుంగిపోయాయని తెలిపారు. మూల కారణాన్ని కనుగొనడానికి పరీక్షిస్తున్నామని, బ్లాక్ 7కు టెస్టులు పూర్తయ్యాయని, 6, 8 బ్లాకులకు కూడా టెస్టులు చేయాల్సి ఉందని చెప్పారు. ఇవి నాలుగు రోజుల్లో పూర్తవుతాయన్నారు. ల్యాండ్ ఫైన్ అయ్యిందా, ఫెయిల్యూరా? తేలాల్సి ఉందని అన్నారు.

మరీ ఇన్ని పగుళ్లా?



ఇంత డ్యామేజీ జరిగితే చిన్న లోపమంటారా?.. పగుళ్ల ప్రాజెక్టు గురించా అంత గొప్పగా చెప్పింది!

» మేడిగడ్డను చూసి విస్తుపోయిన ఎమ్మెల్యేలు

హైదరాబాద్/వరంగల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లలో పగుళ్లను చూసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, వారి వెంట పర్యటనకు వచ్చిన వివిధ పార్టీల ఎమ్మెల్యేలు నివ్వెరపోయారు. "ఇలాంటి ప్రాజెక్టు గురించా కేసీఆర్, బీఆర్ఎస్ లీడర్లు అంత గొప్పగా చెప్పింది? ఈ ప్రాజెక్టు గురించా.. డిస్కవరీ వంటి చానళ్లు ప్రత్యేక కథనాలను ప్రసారం చేసింది? ఈ ప్రాజెక్టేనా.. తెలంగాణకు లైఫ్‌లైన్ అని బీఆర్ఎస్ చెప్పుకొన్నది" అంటూ ఆశ్చర్యపోయారు. బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు మినహా.. మిగతా పార్టీల శాసనసభ్యులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఈ బృందం మధ్యాహ్నం 3.30 గంటలకు మేడిగడ్డను చేరుకోగా.. నేరుగా బ్యారేజీ ఎనిమిదో బ్లాక్ పక్క నుంచి అప్రోచ్ రోడ్డు ద్వారా గోదావరి నదిలోకి దిగారు. బ్యారేజీ ఫౌండేషన్ వద్ద దెబ్బతిన్న ఏడో బ్లాక్‌లోని పిల్లర్లను పరిశీలించారు. మొదట కుంగిపోయిన 20వ పిల్లర్‌ను, నిలువునా చీలిన 21వ, నిలువునా పగుళ్లు వచ్చిన 22వ పిల్లర్లను పరిశీలించారు. 18వ పిల్లర్ ఫౌండేషన్ నుంచి నీళ్లు ఉబికి వస్తుండడాన్ని చూసి, ఆశ్చర్యపోయారు. బ్యారేజీ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన కాఫర్ డ్యామ్‌ను తొలగించకపోవడంపై.. పైన అప్రోచ్ బ్రిడ్జి వరకు ఏర్పడిన భారీ పగుళ్లను చూసి ఎమ్మెల్యేలు విస్మయం వ్యక్తం చేశారు. బ్యారేజీ ర్యాఫ్ట్ ఫౌండేషన్ ఏకంగా ఐదు అడుగుల మేర కుంగిపోవడం, 20వ పిల్లర్ ఎడమవైపునకు కొద్దిగా వంగిపోవడంతో.. అసలు బ్యారేజీ నిలిచి ఉండే అవకాశం ఉందా? వరద వస్తే కొట్టుకుపోతుందా? అని ఇంజనీర్లను ప్రశ్నించారు. బ్యారేజీకి ఇంత నష్టం జరిగితే.. నాలుగైదు పిల్లర్లను తిరిగి కడితే సరిపోతుందని బుకాయించడాన్ని ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. ఇంత పెద్ద పిల్లర్లను ఎలా తొలగిస్తారని, కొత్తగా ఎలా కడతారని ఇంజనీర్లను ప్రశ్నించారు. దానికి ఇంజనీర్లు స్పందిస్తూ.. డైమండ్ కటింగ్ ద్వారా బ్యారేజీలోని మిగతా భాగాలకు నష్టం జరుగకుండా పిల్లర్లను తొలగించి మళ్లీ నిర్మిస్తామని వివరించారు. మీడియా ప్రతినిధులు కూడా బ్యారేజీ పగుళ్లను దగ్గరగా చూడడం ఇదే మొదటిసారి.



పనులు పూర్తవ్వకుండానే ప్రారంభం

మేడిగడ్డ పనులు పూర్తి కాకుండానే.. 2019 జూన్ 21 అప్పటి సీఎం కేసీఆర్ బ్యారేజీని ప్రారంభించారని, నిజానికి అప్పటికి బ్యారేజీ ముందు భాగంలో లాంచింగ్ అప్రాన్ పనులు జరుగుతున్నాయని విజిలెన్స్ అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పనులు కాకున్నా.. అయినట్లు సర్టిఫికెట్లు ఇచ్చారని చెప్పారు. లోపాలకు బాధ్యత వహించే సమయం విగిలి ఉండగానే.. నిర్మాణ సంస్థకు బ్యాంకు గ్యారెంటీని విడుదల చేశారని పేర్కొన్నారు. దీంతో.. నిపుణుల కమిటీ తేల్చాకే.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను మరమ్మతు చేయాలా? పునరుద్ధరణ చేయాలా? లేక వాటి స్థానంలో కొత్తవి కట్టాలా? అనే దానిపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

బ్లాక్ లిస్ట్‌లో ఎల్‌అండ్‌టీ?

మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణకు ఎల్‌అండ్‌టీ ముందుకు రాకపోతే ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టే ప్రతిపాదనలు పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. నిర్మాణ పనులకు సంబంధించి ఎల్‌అండ్‌టీకి రూ.695 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. మేడిగడ్డను ప్రారంభించిన ఐదు నెలలకే లోపాలు బయట పడ్డాయని తాజాగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్మాణ సంస్థే బాధ్యత వహించాలనే అభిప్రాయానికి వచ్చింది. బ్యారేజీ పునరుద్ధరణ, మరమ్మతు పనులకు ముందుకురాకుంటే.. పెండింగ్ బిల్లుల విడుదలను అడ్డుకోవడమే కాకుండా.. ఎల్‌అండ్‌టీని బ్లాక్ లిస్టులో చేర్చే ప్రక్రియను వేగవంతం చేయాలని సర్కారు సంకల్పించింది.

పరిశీలిస్తూ.. ప్రశ్నిస్తూ..


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడిగడ్డ పర్యటనలో లోపాలను పరిశీలిస్తూ.. అధికారులను ప్రశ్నిస్తూ.. గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ముందుకు సాగారు. బ్యారేజీపైన ఏడో బ్లాకు వద్ద.. ఎంత మేర కుంగిందని ఇంజనీర్లను అడిగి, తెలుసుకున్నారు. తన వెంట ఉన్న మజ్లిస్, సీపీఐ ఎమ్మెల్యేలకు పగుళ్ల గురించి వివరిస్తూ ముందుకు సాగారు. ప్రాణహిత నది నుంచి వచ్చే నీటికి మేడిగడ్డ వద్ద అడ్డుకట్ట వేసి.. ఇక్కడి నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి ఎల్లంపల్లికి ఏ విధంగా నీటిని పంపింగ్ చేస్తారో ఎమ్మెల్యేలకు వివరించారు. అనంతరం నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీరు సుధాకర్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రాజెక్టు గురించి సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలకు వివరించారు. రేవంత్‌రెడ్డి మధ్యలో కల్పించుకుంటూ.. ప్రాజెక్టు వ్యయం, ఎన్ని ఎకరాలకు నీరు అందుతుంది? అనే అంశాలపై ప్రశ్నలు సంధించారు. కాళేశ్వరం లిఫ్ట్ ద్వారా రూ.25 వేల కోట్ల నిర్వహణ ఖర్చులతో 19.6 లక్షల ఎకరాలకు నీరు అందుతుందని చీఫ్ ఇంజనీరు వివరించారు. ఇంతమొత్తంలో ఖర్చుచేసి, 19.60 లక్షల ఎకరాలకే నీరందిస్తే.. ప్రయోజనం ఏమిటని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరాన్ని తమ ప్రచారానికి బీఆర్ఎస్ వాడుకుని, ప్రజాధనాన్ని వృథా చేసిందని విమర్శించారు. 2020-23 మధ్యకాలంలో నాలుగు సార్లు ఇంజనీర్లు మేడిగడ్డ బ్యారేజీలో లోపాలను ఎత్తిచూపినా, ఎల్‌అండ్‌టీ పట్టించుకోలేదని దుయ్యబట్టారు.

దేశంలోనే భారీ స్కామ్: ఉత్తమ్

స్వాతంత్ర్యానంతరం దేశంలో జరిగిన కుంభకోణాల్లో కాళేశ్వరం భారీ స్కామ్ అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రూ.38వేల కోట్ల ప్రాజెక్టుకు రీడిజైనింగ్ పేరుతో రూ.94 వేల కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. "ప్రాజెక్టు కోసం ఇంకా రూ.34 వేల కోట్లను ఖర్చు చేయాల్సి ఉంది. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, ప్రాజెక్టును కట్టారు. ఇది భారీ కుంభకోణం. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా క్యాబినెట్‌లో చర్చిస్తాం. అక్టోబరు 21న మేడిగడ్డ కుంగితే.. కేసీఆర్ ఒక్కమాట కూడా మాట్లాడలేదు" అంటూ మండిపడ్డారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు కాళేశ్వరం ఫెల్యూర్ ప్రాజెక్టు అని తేల్చారని.. వారి సూచనలతోనే ఈ ప్రాజెక్టుపై ముందుకెళ్తామన్నారు.

ప్రజల గుండెకు పగుళ్లు: కూనంనేని

కాళేశ్వరం ప్రాజెక్టును ఇలా చూడటం బాధాకరంగా ఉందని, ఇవి మేడిగడ్డ పగుళ్లు కాదని, తెలంగాణ ప్రజల గుండెకు ఏర్పడిన పగుళ్లని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. మూడేళ్లలో నిర్మించడం, ఎనిమిదేళ్లలో కూలిపోవడం ప్రాజెక్టులో డిజైన్ లోపమేనని ఆరోపించారు. మోతాదుకు మించి నీటిని నిల్వ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును నాశనం చేశారని విమర్శించారు. నాణ్యతాలోపంతో ప్రాజెక్టును నిర్మించి, లక్ష కోట్లను గోదారిలో పోసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



జేఈఈ మెయిన్‌లో

ఎస్ఆర్ ప్రభంజనం



మనీశ్ తేజస్వీ

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 13 : దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్-2024(సీజన్-1) పరీక్ష ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన అభ్యర్థులు ప్రభంజనం సృష్టించారని సంస్థ ఛైర్మన్ ఏ.వరదారెడ్డి వెల్లడించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో దొంతుల మనీశ్ 99.99 శాతం పర్సంటైల్ సాధించి ఎస్ఆర్ విద్యాసంస్థల కీర్తి ప్రతిష్ఠలను జాతీయ స్థాయిలో నిలబెట్టారని ఆయన తెలిపారు. అలాగే తుమ్మ తేజస్వి 99.95 శాతం, ఆర్.దీపాన్ష్ రెడ్డి 99.19 శాతం, పి.నిహాల్ శ్రీవాత్సవ్ 99.91 శాతం పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో కూడా అత్యుత్తమమైన ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను వరదారెడ్డి అభినందించారు.

సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. 300కి 300 మార్కులతో 100 పర్సంటైల్‌తో పాటు రెండు సబ్జెక్టుల్లో 13 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. మ్యాథ్స్‌లో 34 మంది అభ్యర్థులు, ఫిజిక్స్‌లో 68 మంది, కెమిస్ట్రీలో 58 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. మొత్తం సబ్జెక్టుల్లో 100 పర్సంటైల్స్ 162 వచ్చాయి. ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఫ్యాకల్టీని శ్రీ చైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ శ్రీ అభినందించారు.

నారాయణ విద్యార్థుల ఆల్ టైమ్ రికార్డు

జేఈఈ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు అరుదైన ఘనత సాధించారు. యం.సాయితేజ, షేక్ సూరజ్, ఆర్యన్ ప్రకాశ్, పి. రోహన్ సాయి, హెచ్.విదిత్, యం.అనూప్.. 300 మార్కులకు 300 సాధించి జయకేతనం ఎగరేశారు. దేశవ్యాప్తంగా 23 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించగా.. అందులో 8 మంది నారాయణ విద్యార్థులే. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులకు నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి. సింధూర, పి.శరణిఅభినందనలు తెలిపారు.

అద్భుత ఫలితాలు సాధించిన రెసొనెన్స్

ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ పరీక్షలో రెసొనెన్స్ విద్యా సంస్థల విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించారు. టాప్ స్కోర్ సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బోధనా సిబ్బందిని మాదాపూర్‌లోని రెసొనెన్స్ జూనియర్ కళాశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా రెసొనెన్స్ హైదరాబాద్ సెంటర్స్ డైరెక్టర్ పూర్ణ చంద్రరావు మాట్లాడారు. జేఈఈ పరీక్షలో రెసొనెన్స్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని తెలిపారు.



సూర్యాపేటలోని జయ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ జయ వేణుగోపాల్

జయ కళాశాల విద్యార్థుల జయకేతనం

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సూర్యాపేట జయ కళాశాలకు చెందిన 21 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని కాలేజీ కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. కళాశాల మొదటి బ్యాచ్‌లోనే 21 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో 90 శాతానికి పైగా పర్సంటైల్ సాధించారని తెలిపారు. కె.వెంకటేష్ 99.75, జి.చందన 99.56, హర్షిణి 98.97, కె.సిద్ధార్థన్ 98.57, విష్ణుతేజ 97.90, సాయి శివరంజన్ రెడ్డి 97.64, జె.గౌతమ్ 97.36, ఎస్.దీక్షిత 97.21 శాతం పర్సంటైల్ సాధించారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు.

మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

తెలంగాణ ప్రభుత్వం మంగళవారం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ-వేలం ద్వారా సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టి ఈ రుణాన్ని సేకరించింది. 22 ఏళ్ల కాల పరిమితికి 7.44 శాతం వార్షిక వడ్డీతో ఈ అప్పు తీసుకుంది. రాష్ట్రంతో సహా దేశంలోని 9 రాష్ట్రాలు రూ.18,500 కోట్ల మేర అప్పులు తీసుకున్నాయి.

అభిప్రాయ సేకరణ తర్వాతే వైటీపీఎస్ పనులు

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై టీఎస్‌జెన్కో వివరణ

యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నిర్మాణ పనులకు ఇసుక, ఇతర సామగ్రి కొరత లేదని రాష్ట్ర విద్యుత్తు ఉత్పత్తి కార్పొరేషన్ (టీఎస్‌జెన్కో) ప్రకటించింది. చెన్నైలోని జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు పనులు సాగుతున్నాయని వెల్లడించింది. యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నిర్మాణ పనులు నిలిచిపోవడంపై 'మాకేంటి!?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై టీఎస్‌జెన్కో ఓ ప్రకటన చేసింది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ కొత్త నిబంధనల ప్రకారం 20న ప్రాజెక్టు వద్ద కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నామని టీఎస్‌జెన్కో డైరెక్టర్ అజయ్ పేర్కొన్నారు. అభిప్రాయ సేకరణ పూర్తయ్యాక మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు.

కాళేశ్వరం పేరుతో కట్టింది పేక మేడలా? పిట్టగూళ్లా?

ప్రపంచంలో అద్భుత కట్టడమైతే కేసీఆర్ ఎందుకు రారు?.. ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపారో.. మేడిగడ్డకొచ్చి చెప్పాలి కదా?

» చంద్రశేఖరరావు మీద, కాళేశ్వర రావు మీద చర్చిద్దాం

» కూలిపోయిన మేడిగడ్డ.. పేలిపోయిన అన్నారంపైనా చర్చ జరగాలి: సీఎం రేవంత్



మేడిగడ్డ సందర్శనకు అసెంబ్లీ నుంచి వెళుతున్న సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): "కాళేశ్వరం ఏటీఎంలా మారిందని, మీ ఇంట్లో కనకవర్షం కురిసిందని నేను అనటం లేదు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయటానికి ముందుకు రావాలి కదా? తప్పు జరిగిందా? జరగలేదా? కూలిపోయిన మేడిగడ్డ, పేలిపోయిన అన్నారం బ్యారేజీలపై చర్చ జరగాలి. తప్పు జరిగిందని నిర్ధారిస్తే.. దానికి కారకులెవరు? విధించాల్సిన శిక్ష ఏమిటి? బాంబులు పెట్టి పేల్చారని పోలీస్‌స్టేషన్‌లో గత పాలకులు ఫిర్యాదుచేశారు. బాంబులు పెట్టి పేలిస్తే... శకలాలు గాల్లోకి లేస్తాయి. కానీ భూములోకి కుంగదు. అందుకే బాంబులు పెట్టి పేల్చారా? పేక మేడలు కడితే కూలిపోయాయా? ఇసుకలో పిట్టగూళ్లు కట్టారా? అనే విషయాలపై చర్చ జరగాలి. అలాగే చంద్రశేఖరరావుతోపాటు కాళేశ్వర్ రావు (హరీశ్‌రావు) ప్రమేయంపై కూడా చర్చ జరగాలి." అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాళేశ్వరం పర్యటనకు బయలుదేరటానికి ముందు అసెంబ్లీలో రేవంత్ మాట్లాడారు. ప్రభుత్వం మారిన తర్వాత అధికారులు ఫైళ్లు మాయం చేస్తున్నారని సమాచారం వస్తే.. ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు విచారణ బాధ్యత అప్పగించిదని వెల్లడించారు. ఫైళ్లు ఎవరు మాయం చేశారో తెలుసుకోవటంతోపాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల అవకతవకలమీద నివేదిక తయారుచేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, లోపభూయిష్టమైన నిర్మాణాలు, నిర్వహణలో జరిగిన నిర్లక్ష్యంపై ప్రాథమిక నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే మహాద్భుతమని, మ్యాన్‌మేడ్ వండర్ అని, డిస్కవరీ చానల్‌తోపాటు న్యూయార్క్‌లో అద్భుతాలు ప్రదర్శించే చోట ప్రదర్శించారని చెబుతూ.. ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం, ఆలోచన, ఈ అద్భుతాన్ని సృష్టించిన విధానం, పడిన శ్రమ, ఎన్ని నిద్రలేదని రాత్రులు గడిపారో కొత్తగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు చంద్రశేఖరరావు ప్రత్యక్షంగా చూపించి వివరిస్తే బాగుండేదని పేర్కొన్నారు. చంద్రశేఖరరావు, గతంలో సాగునీటి మంత్రులుగా పనిచేసిన హరీశ్‌రావు, కడియం శ్రీహరి తెలంగాణ సమాజానికి వాస్తవాలను వివరించాలని కోరారు. కేసీఆర్‌కు రోడ్డుమార్గంలో మేడిగడ్డకు రావటం ఇబ్బందయితే.. ప్రభుత్వం హెలికాప్టర్ ఏర్పాటుచేసి తీసుకెళ్తుందని చెప్పారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్, బీజేపీ, సీపీఐ, మజ్లిస్ పక్షాలకు కూడా మంత్రి ఉత్తమ్ లేఖ రాశారని తెలిపారు. మంథనికి వెళ్లి చూసి సభలో చర్చిస్తే.. తెలంగాణ సమాజానికి, రైతాంగానికి చేరుతుందని అన్నారు. మేడిగడ్డ ఎందుకు కుంగిపోయిందని అడిగితే... బ్యారేజీ కింద ఇసుక కదిలితే కుంగిపోయిందని చెప్పారని, ఇసుక కదిలితే కుంగడానికి ఇసుకలో పేకమేడలు కట్టారా? అని రేవంత్ ప్రశ్నించారు. ప్రాజెక్టు కుంగిపోతే ఎవరినీ పోనీయకుండా పోలీసుల పహారా పెట్టారని, పాకిస్థాన్ సరిహద్దులో కన్నా ఎక్కువ పహారా పెట్టారని ఆరోపించారు. కేంద్రానికి ఫిర్యాదులు అందితే.. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులను పంపించి నివేదిక ఇచ్చిందని, నిపుణులు ఇచ్చిన నివేదికను కూడా గత ప్రభుత్వం తప్పు పట్టిందని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులపై సభలో శ్వేతపత్రం పెట్టినప్పుడు అన్ని విషయాలు చర్చకు రావాల్సి ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన నేత టి. దేవేందర్‌గౌడ్ ఆదిలాబాద్ నుంచి చేవెళ్లకు పాదయాత్ర చేశారని, తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలంటే ప్రాణహిత-చేవెళ్ల నిర్మించాలని డిమాండ్‌ను వినిపిస్తే.. అప్పటి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రజల ఆలోచనను దృష్టిలో పెట్టుకొని ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ. 38,500 కోట్లతో 2008 లో టెండర్ పిలిచి, పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కేంద్ర మాజీమంత్రి జి. వెంకటస్వామి సూచన మేరకు అంబేద్కర్ పేరును ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు పెట్టినట్లు తెలిపారు. కాగా రాష్ట్రం వచ్చి ప్రభుత్వం మారిన తర్వాత అధికారంలోకి వచ్చిన వారు... రీడిజైనింగ్ అనే బ్రహ్మపదార్థాన్ని కనిపెట్టారన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టును మార్చుచేసి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బ్యారేజీలు నిర్మించి నీటిని లిఫ్టుచేసి మిడ్ మానేరులో పోసి నీటి పంపిణీచేస్తామని చెప్పినట్లు తెలిపారు. రూ.38,500 కోట్ల అంచనాలతో ప్రారంభమైన ఈ పనులకు రూ. 1.47 లక్షల కోట్లకు అంచనాలు పెంచారని విమర్శించారు. ఇంతవరకు డీపీఆర్ కూడా లేదని... భవిష్యత్తులో దీనిని పూర్తిచేయటానికి రెండున్నర లక్షల కోట్లవుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు.

ఎన్నికల్లో పొత్తుకోసమే కాళేశ్వరం పరిశీలనకు దూరం

» బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేల డుమ్మాపై మంత్రి పొన్నం ఆరోపణ

» కాళేశ్వరం దేవుడిపేరిట కూడా భారీ అవినీతి: ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి

» ఎన్నికల కోసమే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకాలు: పాయల్ శంకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు కుదుర్చుకుని పోటీ చేసేందుకే బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనకు రాలేదని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. తమ మధ్య స్నేహబంధం లేదని, ఎన్నికల్లో పొత్తు ఉండదని ఆయా పార్టీల నేతలు స్పష్టం చేస్తారా..? అని మంత్రి సవాల్ విసిరారు. బీజేపీ-బీఆర్ఎస్ స్నేహితులని, మాజీ సీఎం కేసీఆర్ సూచనలు, కిషన్‌రెడ్డి ఆలోచనల మేరకు వారి ఎమ్మెల్యేలు రాలేదని స్పష్టమవుతోందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేంద్రం ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో పొత్తుకోసమే ఇరుపార్టీల నేతలు కేవలం ఆరోపణలకు మాత్రమే పరిమితమయ్యారని పొన్నం ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుతోపాటు, కాళేశ్వరం దేవుడి పేరిట కూడా భారీ స్థాయిలో అవినీతి చేశారని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మేడిగడ్డ ఒకటే కుంగిపోయింది కదా అంటూ.. మాజీ మంత్రి టి.హరీశ్‌రావు తప్పును ఒప్పుకుంటున్నారని.. అలాంటప్పుడు ప్రాజెక్టును సందర్శించేందుకు వెళితే బీఆర్ఎస్ నేతలకు అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు.

ఎన్నికల కోసమే నాటకాలు: పాయల శంకర్

లోక్‌సభ ఎన్నికల కోసమే ప్రాజెక్టుల అంశంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ కొత్త నాటకాలకు తెరలేపాయని బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్ ఆరోపించారు. కాళేశ్వరం అక్రమాలపై ఏం చేస్తారో అధికారంలో ఉండి కూడా కాంగ్రెస్ పార్టీ చెప్పలేకపోతోందని విమర్శించారు. ప్రాజెక్టు కుంగిపోయిన విషయం తెలుసుకొని గత అక్టోబరు 22న తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పరిశీలించారని, దానిపై తాము నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి ఫిర్యాదు చేశామని గుర్తుచేశారు. సీఎం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మేడిగడ్డను చూసి రావడంవల్ల ఒరిగేదేమీలేదన్నారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ కావాలట!

» మరో రెండేళ్లు 'ఉమ్మడి' రాజధానిగా ఉండాలట

» జగన్ చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలు



విశాఖపట్నం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఒక్క రాజధాని అమరావతిని అటకెక్కించారు. మూడు రాజధానులంటూ ఊదరగొట్టారు. అందులోనూ విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించేశారు. ఇప్పుడు.. అన్నీ పక్కనపెట్టి మరో రెండేళ్లు హైదరాబాద్‌నే ఉమ్మడి రాజధానిగా ఉంచాలని కేంద్రాన్ని కోరతారట! ఇది ఎవరో చెప్పిన మాట కాదు! ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బాబాయ్, వైసీపీలో కీలక నేత, ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి చెప్పిన మాట. మంగళవారం ఆయన విశాఖలో ఈ వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్ పది సంవత్సరాలు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని చట్టం చేశారు. ఆ గడువు ఈ జూన్‌తో ముగిసిపోతుంది. రాష్ట్రంలో మళ్లీ వైసీపీయే అధికారంలోకి వస్తుంది. ముఖ్యమంత్రిగా జగన్ విశాఖపట్నం నుంచి పరిపాలన ప్రారంభిస్తారు. ప్రస్తుతం కొత్త రాజధానిని నిర్మించే పరిస్థితి లేదు. ఇప్పటికిప్పుడు అమరావతి నుంచి ఉద్యోగులంతా విశాఖ వస్తే వసతి కల్పించడం కష్టం. అందువల్ల.. అన్నీ సమకూర్చుకునేంత వరకు కనీసం రెండేళ్లయినా హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ఉంచాలని కేంద్రాన్ని కోరుతాం. ఈ అంశం మా మేనిఫెస్టోలో కూడా ఉంటుంది" అని వైవీ సుబ్బారెడ్డి అన్నారు.

ఆంధ్ర హైకోర్టులో.. ఇద్దరు అదనపు న్యాయమూర్తులకు పదోన్నతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావులను అదే కోర్టులో శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. అలాగే బదిలీపై మధ్యప్రదేశ్ హైకోర్టుకు వెళ్లిన జస్టిస్ దుప్పల వెంకటరమణకు కూడా శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి ఇవ్వాలని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్‌తో కూడిన త్రిసభ్య కొలీజియం మంగళవారం సమావేశమై ఈ మేరకు సిఫారసులు చేసింది.

పాస్ బుక్‌కు రూ.40 లక్షలు లంచం

» ఏసీబీ వలలో శామీర్‌పేట తహసీల్దార్

శామీర్‌పేట, కరీంనగర్ క్రైమ్, ఫిబ్రవరి 13: పట్టాదార్ పాస్‌బుక్ ఇవ్వడానికి రూ.30 లక్షలు లంచం బొక్కి.. అదీచాలక మరో రూ.10 లక్షలు డిమాండ్ చేసిన శామీర్‌పేట తహసీల్దార్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గుంటూరు జిల్లా నిడుబ్రోలు ప్రాంతానికి చెందిన రైతు ముప్వ రామశేషగిరిరావు.. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేట గ్రామ పరిధిలో 2006లో 29 ఎకరాల భూమిని పలువురు రైతుల నుంచి కొనుగోలు చేశారు. అయితే, ఈ పట్టా భూమిపై కోర్టులో కేసులు ఉన్నాయి. భూమి కొన్న రామశేషగిరిరావుకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోర్టులు ఆదేశాలు జారీ చేయడంతో.. శేషగిరిరావు తహసీల్దార్ సత్యానారాయణను కలిశారు. ఏడాది పాటు ఆయన కార్యాలయం చుట్టూ తిరగ్గా.. రూ.30 లక్షలు లంచం ఇస్తేనే ఆ భూమిని ధరణిలో అయన పేరిట నమోదు చేస్తామని, పట్టాదార్ పాస్‌బుక్ ఇస్తామని తహసీల్దార్ తేల్చిచెప్పారు. ఇందుకు ఒప్పుకొన్న శేషగిరిరావు.. నెలరోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో రూ.10 లక్షలు తహసీల్దార్‌కు ఇచ్చారు. తర్వాత మరో రూ.20 లక్షల చెక్కును తహసీల్దార్‌కు ఇచ్చారు. ఇంకా రూ.10 లక్షలు ఇవ్వాలంటూ సత్యనారాయణ సదరు రైతును సతాయిస్తుండడంతో.. రామశేషగిరిరావు విసిగిపోయి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సత్యనారాయణ అవినీతిపై గతంలోనే పలు ఆరోపణలు రావడంతో ఆయన్ను పట్టుకోవడానికి ఏసీబీ అధికారులు మూడుసార్లు ప్రయత్నించినా తప్పించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రామశేషగిరిరావు నుంచి ఫిర్యాదు రావడంతో ఏసీబీ అధికారులు ఈసారి పక్కా వ్యూహం పన్నారు. వారి సూచనల మేరకు రామశేషగిరిరావు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయానికి రూ.10 లక్షల తీసుకెళ్లారు. తహసీల్దార్ సత్యనారాయణను కలిసి డబ్బును తెచ్చినట్లు చెప్పగా.. ఆ సొమ్మును కార్యాలయ ఆవరణలో ఉన్న తన డ్రైవర్‌కు ఇవ్వాలని చెప్పారాయన. ఆ డబ్బును రామశేషగిరిరావు తహసీల్దార్ డ్రైవర్‌కు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సత్యనారాయణ స్వస్థలమైన కరీంనగర్‌లో ఉన్న ఆయన ఇంటిలో, ఇక్కడ ఉంటున్న తూంకుంటలోని నివాసంలో, ఆయన బంధువుల ఇళ్లల్లో కూడా సోదాలు నిర్వహిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు. కరీంనగర్‌లో ఆయన ఇంటిని సోదా చేసిన అధికారులు కొన్ని పత్రాలు సీజ్ చేశారు. పైరవీలు చేయించుకుని మరీ శామీర్‌పేట తహసీల్దార్‌గా డిప్యుటేషన్‌పై వచ్చిన సత్యనారాయణ.. మంగళవారం ఉదయం 11గంటలకు కార్యాలయానికి వచ్చి, సిబ్బంది మొత్తాన్నీ తన చాంబర్‌లోకి పిలిపించుకున్నారు. తాను నల్లగొండ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యానని.. త్వరలోనే రిలీవ్ అవుతానని చెప్పారు. ఆ తర్వాత గంట వ్యవధిలోనే.. డ్రైవర్ ద్వారా లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● బుధవారం 14 ఫిబ్రవరి 2024

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ విభాగాల్లో ఒకటి ఎంచుకోవచ్చు. సంస్థ నిర్వహించే క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి 8 నెలలు. ఒక్కో ప్రోగ్రామ్‌లో 8 కోర్సులు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. వీటికి మొత్తం 35 క్రెడిట్స్ నిర్దేశించారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. వర్కింగ్ ప్రొఫెషనల్స్, నిరుద్యోగులు సహా ఆసక్తిగలవారందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారు ఇంజనీరింగ్ అర్హత లేకున్నా ప్రోగ్రామర్లుగా, డేటా సైంటిస్ట్‌లుగా రాణించవచ్చు.

ఐఐటీ మద్రాస్‌లో డిప్లొమా



ప్రోగ్రామ్ వివరాలు

- 'డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్'లో కంప్యూటేషనల్ థింకింగ్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రోగ్రామింగ్-డేటా స్ట్రక్చర్స్-అల్గారిథమ్స్ యూజింగ్ పైథాన్, మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ - 1 & 2, ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్ యూజింగ్ జావా, సిస్టమ్ కమాండ్స్ కోర్సులు ఉంటాయి. మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి రెండు ప్రాజెక్ట్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.
- 'డిప్లొమా ఇన్ డేటా సైన్స్'లో మేథమెటిక్స్ & స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ ఫౌండేషన్స్ - టెక్నిక్స్ - ప్రాక్టీస్, బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్, టూల్స్ ఇన్ డేటా సైన్స్ కోర్సులు ఉంటాయి. బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఒక ప్రాజెక్ట్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్‌కు సంబంధించి మరో ప్రాజెక్ట్ పూర్తిచేయాలి.
- ప్రోగ్రామ్‌లో భాగంగా ఆన్‌లైన్ వీక్లీ అసైన్‌మెంట్‌లు, మంత్లీ క్విజ్‌లు, ప్రోగ్రామింగ్ ఎగ్జామ్‌లు, వైవా, ఎండ్ టర్మ్ ఎగ్జామ్ ఉంటాయి.

క్వాలిఫయర్ ఎగ్జామ్ వివరాలు

- 'డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్'లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్, బేసిక్ మేథమెటిక్స్ పేపర్లు ఉంటాయి. ఇంగ్లీష్ పేపర్ 25 మార్కులకు ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, లిజెనింగ్ ఎబిలిటీ, గ్రామర్, రైటింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ పేపర్‌లో సెట్ థియరీ, నెంబర్ సిస్టమ్, కోఆర్డినేట్ జామెట్రీ, క్వాడ్రాటిక్ ఫంక్షన్స్, పాలినామియల్స్, ఫంక్షన్స్, లాగరిథమ్స్, గ్రాఫ్ థియరీ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఆప్టిట్యూడ్ పేపర్‌లో లాజికల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం 3 గంటలు.
- 'డిప్లొమా ఇన్ డేటా సైన్స్'లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంగ్లీష్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ పేపర్లు ఉంటాయి. ఇంగ్లీష్, మేథమెటిక్స్ పేపర్లు పై ప్రోగ్రామ్‌నకు నిర్వహించే వాటి మాదిరిగానే ఉంటాయి. పైథాన్ పేపర్‌లో వేరియబుల్స్, బేసిక్ టైప్స్-స్ట్రింగ్-ఇంటీజర్-ఫ్లోట్-బూలియన్, ఆపరేటర్స్ అండ్ ఎక్స్‌ప్రెషన్స్, బేసిక్ ఇన్‌పుట్-ఔట్‌పుట్, స్ట్రింగ్స్-స్లైసింగ్-ఇండెక్సింగ్-మెథడ్స్, కండిషనల్ స్టేట్‌మెంట్స్, లూప్స్, లిస్ట్స్, ఫంక్షన్స్, కలెక్షన్స్, ఫైల్ హ్యాండిలింగ్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. స్టాటిస్టిక్స్ పేపర్‌లో డేటా, స్కేల్స్ ఆఫ్ మెజర్‌మెంట్, డేటా ఫ్రీక్వెన్సీ, వేరియబుల్స్, ప్రాబబిలిటీ, వేరియెన్స్ తదితర అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సిలబస్‌లో లేనప్పటికీ కంప్యూటేషనల్ థింకింగ్‌కు సంబంధించిన మల్టిపుల్ ఇటరేషన్స్, ఫిల్టరింగ్, ఫ్లో చార్ట్, సైడ్ ఎఫెక్ట్‌లు, గ్రాఫ్, మాట్రిక్స్, ట్రీ, బ్యాక్ ట్రాకింగ్, క్లాసిఫికేషన్ తదితర సాంకేతిక అంశాలపై అవగాహన ఉండాలి. పరీక్ష సమయం 4 గంటలు.
- క్వాలిఫయర్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు ఒక్కో పేపర్‌లో కనీసం 40 శాతం చొప్పున మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఒక్కో పేపర్‌లో కనీసం 35 శాతం చొప్పున మొత్తమ్మీద కనీసం 45 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఒక్కో పేపర్‌లో కనీసం 30 శాతం చొప్పున మొత్తమ్మీద కనీసం 40 శాతం మార్కులు రావాలి. వీరు మాత్రమే సంబంధిత డిప్లొమా ప్రోగ్రామ్‌నకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.70,500
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.6,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.3,000; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 29
- **క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** ఏప్రిల్ 28
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, విజయవాడ, గుంటూరు, భీమవరం, విశాఖపట్నం, రాజమండ్రి, అనంతపురం, కడప, కర్నూలు, తిరుపతి.
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** మే 15, 16
- **తరగతులు ప్రారంభం:** మే 31 నుంచి
- **వెబ్‌సైట్:** diploma.iitm.ac.in

బిర్లా ఇన్‌స్టిట్యూట్‌లో

ఫెలో ప్రోగ్రామ్‌లు

గ్రేటర్ నోయిడాలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ(బీఐఎంటీఈసీహెచ్)- మేనేజ్‌మెంట్ విభాగంలో ఫెలో ప్రోగ్రామ్, ఎగ్జిక్యూటివ్ ఫెలో ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. వీటిలో 18 నెలలు కోర్సు వర్క్, 30 నెలలు రీసెర్చ్ వర్క్ ఉంటాయి. వారాంతాల్లో కోర్సు వర్క్‌కు సంబంధించిన తరగతులు నిర్వహిస్తారు.

రీసెర్చ్ అంశాలు: బిజినెస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, ఫైనాన్స్-ఇన్సూరెన్స్-రిస్క్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మార్కెటింగ్ అండ్ రిటైల్, హెచ్‌ఆర్, ఆపరేషన్స్ అండ్ డెసిషన్ సైన్స్, స్ట్రాటజీ-ఇన్నొవేషన్-ఆంత్రప్రెన్యూర్‌షిప్, సస్టయినబిలిటీ-సీఎస్ఆర్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/మేనేజ్‌మెంట్/ఎకనామిక్స్/సోషల్ సైన్స్/కామర్స్/హ్యూమానిటీస్ విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ ప్రోగ్రామ్ పూర్తిచేసి ఉండాలి. బీకాం డిగ్రీతోపాటు ద్వితీయ శ్రేణి మార్కులతో సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎగ్జిక్యూటివ్ ఫెలో ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి బోధన/మేనేజ్‌మెంట్/ఎగ్జిక్యూటివ్ విభాగాల్లో కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 మార్చి 31 నాటికి ఫెలో ప్రోగ్రామ్‌నకు 45 ఏళ్లు, ఎగ్జిక్యూటివ్ ఫెలో ప్రోగ్రామ్‌నకు 50 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: రీసెర్చ్ ప్రపోజల్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. క్యాట్ 2023లో 60 శాతానికి పైగా స్కోర్/జీమ్యాట్(2018 జూన్ నుంచి 2024 జనవరి)లో 400కు పైగా స్కోర్/నెట్-మేనేజ్‌మెంట్(2021/ 2022)లో 75 శాతానికి పైగా స్కోర్ ఉన్నవారికి అదనంగా అయిదు శాతం వెయిటేజీ ఇస్తారు.

స్కాలర్‌షిప్: ఫెలో ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు మొదటి ఏడాది నెలకు రూ.40,000; రెండో ఏడాది నెలకు రూ.45,000; చివరి రెండేళ్లు నెలకు రూ.50,000 చెల్లిస్తారు. ల్యాప్‌టాప్, సాఫ్ట్‌వేర్ కొనుగోలు; జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే సెమినార్‌లు, కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు వన్ టైం రీసెర్చ్ గ్రాంట్ కింద రూ.1,80,000 ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.3,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూలై 13 నుంచి
- **వెబ్‌సైట్:** fpm.admissions.bimtech.ac.in



లిటిల్స్




మీకు తెలుసా?

- మనదేశంలో హిమాలయాలతో పాటు నేపాల్, భూటన్, చైనా, మయన్మార్ దేశాల్లో ఉండే ఈ పక్షిని 'బ్లడ్ ఫీజంట్' అని పిలుస్తారు.
- 43 సెం.మీ. ఉండే ఈ పక్షికి బూడిద రంగు రెక్కలు, రెక్కల కింద తెలుపు, లేత ఆకుపచ్చ, ఎరుపు ఉంటుంది. బాగా గమనిస్తే వీటి రెక్కల కాంబినేషన్‌లో పన్నెండు రంగులు కనిపిస్తాయి.
- ఆడపక్షులు డల్‌బ్రౌన్ రంగులో ఉంటాయి. వీటికంటే మగపక్షులు కాస్త పెద్దవి.
- పురుగులు, నత్తలు, సీతాకోకచిలుకలను తింటాయివి.
- వెదురుచెట్లు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో .. దీంతో పాటు నీటి కుంటలకు అతి దగ్గరలో జీవించటానికి ఇష్టపడతాయి.



- బరువు కేజీలోపు మాత్రమే ఉంటాయి.
- కోళ్లమాదిరే ఇవి రెండు లేదా అంత కంటే ఎక్కువ పక్షులు సంచరిస్తుంటాయి.
- నాలుగు నుంచి పద్నాలుగు గుడ్లు పెడతాయి. వీటి పొదిగే కాలం ఇరవై ఏడు రోజుల నుంచి 31 రోజుల వరకూ.
- ఎండ పెరిగితే మంచు ప్రాంతాలకు, చలి ఎక్కువైతే మంచులేని ప్రాంతాలకు వెళ్లిపోతాయి.
- ఇవి హంటర్స్. ముఖ్యంగా వాటి గుంపులోని వాటితో కాకుండా మిగతా గుంపులో ఉండేవాటితో పోట్లాడతాయి.

5 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



పదాలను పూరించండి

AP__E C_RR_T

B_NA_A BRO_CO_I

LE__N AVO__DO

డైలీ సుడోకు - 229

8								
			7		5		9	8
9					8	5		
4	8	6			1			
1		9				4		5
			9			3	8	1
		2	1					9
6	4		2		9			
								4

సుడోకు - 228 సమాధానం

3	4	7	5	2	6	1	9	8
8	9	2	7	1	3	4	5	6
6	5	1	9	4	8	2	7	3
7	3	9	1	6	5	8	2	4
2	8	6	4	3	9	5	1	7
4	1	5	2	8	7	6	3	9
9	7	4	6	5	2	3	8	1
5	6	3	8	7	1	9	4	2
1	2	8	3	9	4	7	6	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

SCHOLARSHIP ALERT

Bhalodia-Khetan Summer Research Excellence Award

Description: Bhalodia-Khetan Summer Research Excellence Award 2024 is an opportunity offered by the Indian Institute of Technology, Gandhinagar to honor and recognise outstanding research conducted by students participating in the Summer Research Internship Program (SRIP) at IIT Gandhinagar.

Eligibility: Open for students who have completed the Summer Research Internship Programme (SRIP) under the faculty guides' evaluation at the Indian Institute of Technology (IIT), Gandhinagar.

Prizes & Rewards: An award of 50,000 (one-time)

Last Date to Apply: 05-03-2024

Application mode: Online Applications Only

Short Url: www.b4s.in/aj/BKSA1

National AIDS Control Organisation Internship Programme

Description: National AIDS Control Organisation (NACO) Internship Programme 2024 is an opportunity offered by the Ministry of Health & Family Welfare, Government of India for students pursuing undergraduate, postgraduate, M.Phil and Ph.D. degree courses in various disciplines.

Eligibility: Open for Indian nationals pursuing undergraduate, postgraduate, M.Phil, and Ph.D. degree courses in specified disciplines.

Prizes & Rewards: A monthly stipend of 8,000 and a completion certificate

Last Date to Apply: Round The Year

Application mode: via post or email at: Deputy Secretary National AIDS Control Organisation (NACO) 9th Floor, Chandralok Building, 36, Janpath, New Delhi – 110001 Email ID: naco.internship@gmail.com ***Short Url:*** www.b4s.in/aj/NACO1

Summer Research Internship Program (SRIP)

Description: Summer Research Internship Program (SRIP) 2024 is a research opportunity offered by the Indian Institute of Technology, Gandhinagar, to students pursuing bachelor's or master's degrees at institutions in India.

Eligibility: Open for Indian nationals pursuing a bachelor's or master's degree at an Indian institution.

Prizes & Rewards: A weekly stipend of 2,000 and other benefits. ***Last Date to Apply:*** 05-03-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/SRIP2

buddy4study.com

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

లెటర్ సిరీస్

పార్ట్-3

1. L - NMMN - NNL - L - MN -
   (ఎ) MLLMM (బి) MLMLM
   (సి) LLMMM (డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

LMNM / MNLN / NLML / LMNM

ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలు LMN / MNL /NLM / LMN కింది పద్ధతిని అనుసరించాయి. మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదే విధంగా రెండో సమూహంలోని చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది. అంతేకాక ప్రతి సమూహంలో రెండో అక్షరమే తిరిగి నాలుగో అక్షరంగా రిపీట్ అయింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు MLMLM



2. a - bcb - cac - a - aa - c
   (ఎ) abcbb (బి) abbcb (సి) abbbc (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ : ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

aabc / bbca / ccab /aabc

ప్రతి సమూహంలోను చివరి మూడు అక్షరాలు అయిన abc / bca / cab / abc కింది పద్ధతిని అనుసరించాయి. మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదేవిధంగా రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. ఈవిధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది. అంతేకాక మొదటి సమూహంలో మొదటి అక్షరంగా a, రెండో సమూహంలో మొదటి అక్షరంగా b, మూడో సమూహంలో మొదటి అక్షరంగా 'c' ఉంది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు abcbb

3. a - ab - ab - b - b - b -
   (ఎ) bbabbb (బి) bbbbba (సి) bbbabb (డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: ఆప్షన్ (సి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

ab / abb / abbb / abbbb

రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దానిముందు సమూహంలోని అక్షరాలే ఉంటూ ఒక 'b' అదనంగా చేరింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bbbabb

4. L - N - LM - ML - N - LM - L
   (ఎ) MMNNNN (బి) MLNMNN
   (సి) MNMNMN (డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

LMNL / LMNM / LMNN / LMNL

ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలుగా LMN ఉంటూ, నాలుగో అక్షరంగా మొదటి సమూహంలో L, రెండో సమూహంలో M, మూడో సమూహంలో N ఉన్నాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు MLNMNN

5. P - QQ - RRR - P - Q
   (ఎ) PPPQ (బి) PQPP (సి) PPQP (డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

PPQ / QQR/ RRP / PPQ

ప్రతి సమూహంలోను మొదటి రెండు అక్షరాలు సేమ్.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు PQPP

6. P - P - PP - PP - P - P - PP
   (ఎ) QPQPQP (బి) PQPQPQ
   (సి) PPPQQQ (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

PQPP / PPQP/ PPPQ / PPPP

మొదటి సమూహంలో ఒక P తరవాత Q, రెండో సమూహంలో రెండు Pలు తదుపరి Q, మూడో సమూహంలో మూడు Pలు తదుపరి Q ఉంటూ నాలుగో సమూహంలో నాలుగు Pలతో ఈ సిరీస్ పూర్తి అయింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు QPQPQP

7. a - cca - b - aab -
   (ఎ) bcbc (బి) bbcc (సి) cbcb (డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

abc / cab / bca / abc

మొదటి సమూహంలో చివరి అక్షరం రెండో సమూహంలో మొదటి అక్షరంగా మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఏర్పడ్డాయి. అదే విధంగా రెండో సమూహంలోని చివరి అక్షరం మూడో సమూహంలో మొదటి అక్షరంగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు మూడో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఈవిధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bbcc

8. a - bc - ab - cdabc - dab - d -
   (ఎ) adbccd (బి) abcddc (సి) abcdcd (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

aabcd / abbcd abccd /abcdd

ప్రతి సమూహంలోను abcd అనే నాలుగు అక్షరాలు ఉంటూ మొదటి సమూహంలో a స్థానంలో రెండు aలు రెండో సమూహంలో b స్థానంలో రెండు bలు మూడో సమూహంలో c స్థానంలో మూడు cలు, నాలుగో సమూహంలో d స్థానంలో రెండు dలు ఉన్నాయి. ఈవిధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు adbccd



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ